
మర్రిపూడి మండలం అంకేపల్లిలో దెబ్బతిన్న సజ్జ పైరును పరిశీలిస్తున్న మంత్రి స్వామి

జిల్లా ప్రజలను మొంథా తుఫాన్ ముంచింది. వివిధ రంగాలకు భారీగా నష్టాన్ని చేకూర్చింది. రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. వర్ష విలయం నుంచి ప్రజలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు. ఎండలు కాస్తుండటంతో నష్టాలు వెలుగు చూస్తున్నాయి. ప్రధానంగా పంటలు భారీగా దెబ్బతిన్నాయి. చాలాప్రాంతాల్లో పొగాకు, మిర్చి మొక్కలు వర్షం ధాటికి ఉరకెత్తాయి. పత్తి కుళ్లిపోయింది. ఇతర పంటల పరిస్థితి కూడా అలాగే ఉంది. అన్ని ప్రాంతాల్లో ధ్వంసమైన రోడ్లు, దెబ్బతిన్న నీటి వనరులు, ఇతర నష్టాలు బయటపడుతున్నాయి. అక్కడక్కడా ఇంకా వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తూ కొన్నిచోట్ల ఇబ్బందికరమైన పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇటు ప్రజాప్రతినిధులు, అటు ఉన్నతాధికారులు విస్తృతంగా పర్యటించి నష్టాలను పరిశీలిస్తున్నారు. బాధితులను పరామర్శించి ఉపశమనం కలిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇస్తున్నారు.


సింగరాయకొండ మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని రాతిచెరువుకు గండి పడి శుక్రవారం దిగువకు ప్రవహిస్తున్న వరద

ముంచిన మొంథా

వర్షం తెరపి ఇవ్వడంతో వెలుగు చూస్తున్న నష్టాలు

దెబ్బతిన్న పంటలు... ధ్వంసమైన రోడ్లు

- అక్కడక్కడా ఉధృతంగానే వాగులు
- గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు తగ్గిన వరద
- పంటల రక్షణ కోసం రైతుల పాట్లు
- నష్టాలను కళ్లారా చూసి భరోసా ఇస్తున్న నేతలు, అధికారులు
- మర్రిపూడి మండలంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన మంత్రి స్వామి


ముండ్లమూరు మండలంలో భారీ వర్షానికి కోతకు గురైన చింతలపూడి-ఉమామహేశ్వర అగ్రహారం రహదారి


ఎర్రగొండపాలెంలో దెబ్బతిన్న మిరప తోట

ఒంగోలు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మొంథా తుఫాన్ బీభత్సం సృష్టించింది. వివిధ రంగాలపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. సోమవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు కేవలం 36 గంటల్లోనే 18.40 సెం.మీ వర్షపాతం నమోదైంది. దీంతో జిల్లా మొత్తం వరద పోటెత్తింది. అన్ని ప్రాంతాల్లోనూ వేలాది ఎకరాల్లో పంటలు ముంపునకు గురయ్యాయి. వందకు పైగా గ్రామాలు, కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. నదులు, వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. దీంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. రెండు రోజులుగా పరిస్థితిలో మార్పు మిగతా 6లో...

పంటలకు అపార నష్టం

జిల్లాలో సుమారు 30వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. పత్తి, మిర్చి, కంది, సజ్జ, వరి, మినుము, మొక్కజొన్న రైతులు కోలుకోలేని దెబ్బతిన్నారు. చాలాప్రాంతాల్లో పొగాకు, మిర్చి మొక్కలు ఉరకెత్తాయి. పత్తి కుళ్లిపోయింది. వర్షం తెరపి ఇవ్వడంతో ఉన్న పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపుతున్నారు. ఉరకెత్తిన పంటలో యూరియా, ఇతర ఎరువులు పిచికారీ చేసి రక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కలుపు విపరీతంగా పెరుగుతుండటంతో దాని తొలగింపు పనులు చేస్తున్నారు. ప్రత్యేకించి పశ్చిమప్రాంతంలో పంటలకు ఎక్కువ నష్టం వాటిల్లింది.


మారథాన్‌లో పరుగు తీస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఐక్యతా పరుగు

ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం ఒంగోలులోని కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజాబాబు, జేసీ గోపాలకృష్ణ.. పటేల్‌కు నివాళి అర్పించారు. పటేల్‌ను గుర్తు చేస్తూ పోలీసుల ఆధ్వర్యంలో నగరంలో ఐక్యతా పరుగు నిర్వహించారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో కరువు మండలాలు 3

- ప్రకటించిన ప్రభుత్వం
- అవి మూడూ కొండపి నియోజకవర్గంలోనివే

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌కు కరువు మండలాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అందులో రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో 37 మండలాలున్నాయి. మన జిల్లాలో కొండపి నియోజకవర్గంలోని మూడింటిని ప్రకటించింది. ఆమేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ శుక్రవారం రాత్రి గజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లాలో ప్రకటించిన కరువు మండలాల్లో కొండపి, జరుగుమల్లి, పొన్నలూరు ఉన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం సరిగా లేకపోవడం, సాధారణ విస్తీర్ణంలో కూడా పంటలు సాగు కాకపోవడాన్ని ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంది.



పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.344

- మళ్లీ పెరుగుదల
- ఆందోళనకరంగానే నోబిడ్‌లు

ఒంగోలు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పొగాకు మార్కెట్లో మళ్లీ కాస్తంత కదలిక వచ్చింది. గరిష్ఠ ధరలు పెరుగుతున్నాయి. శుక్రవారం కిలో రూ.344 పలికింది. గత నెలలో గరిష్ఠంగా కిలోకు రూ.346 లభించగా అనంతరం ధరలు తగ్గి వారం క్రితం వరకు కిలో రూ.315 నుంచి 316లోపు నిలకడగా సాగుతున్నాయి. నాలుగు రోజుల క్రితం నుంచి కొంత మేర కదలిక వచ్చింది. గురువారం కిలోకు రూ.335 లభించింది. తిరిగి శుక్రవారం కిలోకు మరో రూ.9 పెరిగి రూ.344 పలికింది. ఒంగోలు-2 వేలం కేంద్రంలో ఈ గరిష్ఠ ధర లభించగా మిగతా కేంద్రాల్లో రూ.340 నుంచి రూ.343 దక్కాయి. అయితే నోబిడ్ బేళ్లు అధికంగా ఉండటం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. శుక్రవారం నాటి మార్కెట్‌లో సగటున 34శాతం బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. అంటే వేలంకు వచ్చిన బేళ్లలో ప్రతి మూడింటిలో ఒకటి నోబిడ్ అయింది. కనిగిరి కేంద్రానికి శుక్రవారం వచ్చిన బేళ్లలో ఏకంగా 50.76శాతం బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. అంటే అక్కడ కొన్న వాటికన్నా నోబిడ్ అయినవే ఎక్కువగా ఉండటం గమనార్హం. డీసీపల్లిలో 46.46శాతం, కలిగిరిలో 44శాతం, పొదిలిలో 43శాతం, వెల్లంపల్లిలో 37.23శాతం తిరస్కరణలు జరిగాయి. కనిష్ఠ ధరలు ఇంచుమించు అన్ని కేంద్రాల్లో కిలో రూ.60 నుంచి రూ.70 లోపుగానే ఉన్నాయి.

వెలిగొండ ఫీడర్ కాలువకు టెండర్లు ఖరారు

- 4.60శాతం అదనపు మొత్తంతో దక్కించుకున్న కేఎంవీ సంస్థ
- ప్రాజెక్టు తొలిదశ పూర్తికి అవసరమైన కీలక పనుల్లో ముందడుగు
- జీవో ఇచ్చిన 40 రోజుల్లోనే..


అధ్వానంగా ఉన్న వెలిగొండ ఫీడర్ కాలువ (ఫైల్)

ఒంగోలు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువ ఆధునికీకరణ పనులకు టెండర్లు ఖరారయ్యాయి. నిర్దేశిత మొత్తానికి కన్నా 4.60శాతం అదనంతో కేఎంవీ అండ్ జీడీఆర్ జాయింట్ వెంచర్ సంస్థ టెండర్‌ను దక్కించుకుంది. ఈమేరకు రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ (ఎస్ఎల్‌టీసీ) శుక్రవారం ఖరారు చేసింది. దీంతో వెలిగొండ తొలిదశను వచ్చే ఏడాది ఆగస్టు నాటికి పూర్తి చేసి ప్రాజెక్టుకు నీరు ఇవ్వాలన్న ప్రభుత్వ లక్ష్యంలో కీలక అడుగు ముందుకు పడినట్లు అయింది. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెలిగొండపై ప్రత్యేక దృష్టి సారించారు. గత ఏడాది అక్టోబరు ఆఖరులో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం పలుమార్లు సీఎం చంద్రబాబు నాయుడు స్వయంగా సమీక్షలు చేశారు. ఆ సందర్భంగా రెండో టన్నెల్ లైనింగ్, ఫీడర్ కాలువ ఆధునికీకరణ, ఇతరత్రా పనులతోపాటు నిర్వాసితుల పునరావాసం వంటివి తొలిదశ పనులు పూర్తికి కీలకమని అధికారులు నివేదించారు. ఇందుకోసం సుమారు రూ.2,059కోట్లు అవసరమవుతుందని అంచనా వేశారు. నిధులకు భరోసా ఇచ్చిన సీఎం.. ఎట్టి పరిస్థితుల్లో వచ్చే ఆగస్టుకు తొలిదశ పూర్తి చేసి నీరు ఇవ్వాలని ఆదేశించారు.

లైనింగ్‌తోపాటు కాంక్రీట్ గోడల నిర్మాణం

వెలిగొండ ఫీడర్ కాలువ ఆధునికీకరణ కోసం రూ. 476 కోట్లతో ప్రభుత్వం గత నెల 22న జీవో ఇచ్చింది. నిజానికి ఈ కాలువ తవ్వకం 15 ఏళ్ల క్రితమే జరిగింది. వెలిగొండ మిగతా 6లో...

తుఫాన్ సమయంలో అత్యుత్తమ సేవలు

- ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, నగర కమిషనర్ వెంకటేశ్వరరావుకు అవార్డులు
- నేడు సీఎం చేతుల మీదుగా ప్రదానం


ఆర్డీవో లక్ష్మీప్రసన్న


కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్/కార్పొరేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ సమయంలో అత్యుత్తమ సేవలు అందించిన ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వర రావును ప్రభుత్వం అభినందించింది. వారికి అవార్డులు ప్రకటించింది. వీరు తుఫాన్ సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకున్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వరదల సమయంలో సేవలు అందించారు. వీరిద్దరూ శనివారం ఉదయం సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబు చేతుల మీదుగా అవార్డులను అందుకోనున్నారు.



నేడు పింఛన్ల పంపిణీ

- 2,83,704 మంది లబ్ధిదారులు
- రూ.125.39 కోట్లు విడుదల
- ఇంటి వద్దకు వెళ్లి అందజేయనున్న 5,495 మంది ఉద్యోగులు

ఒంగోలు నగరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను శనివారం పంపిణీ చేయనున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. మొత్తం 2,83,704 మంది పింఛన్‌దారులుండగా ప్రభుత్వం రూ.125.39 కోట్లు విడుదల చేసింది. దీన్ని పంపిణీ చేసేందుకు జిల్లాలో 5,495 మంది ఉద్యోగులను కేటాయించారు. వీరు ఉదయం 6.30 గంటలకే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్మును అందజేయనున్నారు. నగదును సచివాలయ సిబ్బంది శుక్రవారమే బ్యాంకుల నుంచి డ్రా చేసి సిద్ధంగా ఉంచుకున్నారు. శనివారం పింఛన్లు మిగతా 6లో...

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఉద్యోగి దుర్మరణం



మృతుడు వెంకటరెడ్డి

ఒంగోలు క్రైం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం త్రోవగుంట సమీపంలోని బృందావన గార్డెన్స్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో తాళ్ళూరుకు చెందిన రిటైర్డ్ హెల్త్ సూపర్‌వైజర్ కర్నాటి వెంకటరెడ్డి (62)మృతి చెందారు. త్రోవగుంట సమీపంలో గల బృందావనగార్డెన్స్‌లో బంధువుల వివాహానికి వెంకటరెడ్డి హాజరయ్యారు. అక్కడి నుంచి జాతీయ రహదారిపై ఆయన నడుచుకుంటూ వెళుతుండగా ఓ కారు ఆయనను ఢీకొట్టింది. దీంతో వెంకటరెడ్డి రోడ్డు మీద పడిపోవడంతో తలకు తీవ్రగాయమైంది. రక్తస్రావం కావడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. ఈమేరకు తాలుకా ఎస్ఐ ఫణిభూషణ్ సంఘటన్నా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. కాగా కనిగిరి నియోజకవర్గంలోని తమ్మినేనిపాలెంకు చెందిన వెంకటరెడ్డి ఉద్యోగరీత్యా దాదాపు 47 ఏళ్ల క్రితం తాళ్లూరు పీహెచ్‌సీకి వచ్చి వివిధరకాల హోదాల్లో పని చేసి 2004లో హెల్త్ సూపర్‌వైజర్‌గా ఉద్యోగ విరమణ చేశారు. మృతుడు వెంకటరెడ్డి మరణంతో తాళ్లూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. ఉదయం అందరిని పలకరిస్తూ వెళ్లిన ఆయన మధ్యాహ్నం మృతి చెందాడన్న సమాచారం రావటంతో గ్రామస్థులు నిర్ఘాంతపోయారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

దొంగతనం కేసులో నిందితులకు జైలు

సింగరాయకొండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు కామిని కాంప్లెక్స్‌లో రంగా గోల్డ్ దుకాణంలో 2021లో గుర్తుతెలియని దుండగులు షాపు వెనుకవైపు కన్నం వేసి 596 గ్రాముల బంగారు వస్తువులను అపహరించుకొనిపోయారు. దుకాణం నిర్వాహకుడు జలదంకి వెంకటరంగం శెట్టి ఫిర్యాదు మేరకు అప్పటి టంగుటూరు ఎస్సై నాయబ్ రసూల్ కేసు నమోదు చేశారు. ఒంగోలు డీఎస్పీ కేవీవీన్ ప్రసాద్ కేసును ప్రత్యేకంగా దర్యాప్తుచేశారు. కందుకూరు సాయినగర్‌కు చెందిన అక్కల శివకోటయ్య, జరుగుమల్లి మండలం దావగూడూరు గ్రామానికి చెందిన కంకిపాటి నరేష్‌ను నిందితులుగా గుర్తించి అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపించారు. ఒంగోలు అసిస్టెంట్ పీపీ పాలపర్తి సుజాత, సింగరాయకొండ అసిస్టెంట్ పీపీ దేవరకొండ వరకుమారి ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు. శుక్రవారం సింగరాయకొండ జేఎఫ్‌సీఎం న్యాయాధికారిణి లీలా శ్యామసుందరి సాక్ష్యాధారాలను పరిశీలించి నిరూపణ అయినందున నిందితులు అక్కల శివకోటయ్యకు 2 ఏళ్లు జైలుశిక్ష రూ. 3వేలు జరిమానా రెండో నిందితుడు కంకిపాటి నరేష్‌కు 8నెలల జైలుశిక్ష, రూ. 2వేలు జరిమానా విధించారు. నిందితులకు శిక్షపడటంలో సమర్థవంతంగా విధులు నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బంది, అసిస్టెంట్ పీపీలను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులో మూడేళ్లు జైలు

ఒంగోలు క్రైం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో తన్నీరు పవన్ కుమార్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.17వేలు జరిమానా విధిస్తూ అదనపు జిల్లా జడ్జి, ఎస్సీ ఎస్టీ కోర్టు న్యాయమూర్తి రాజావెంకటాద్రి శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... 2022 ఏప్రిల్ 10న స్థానిక రామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న గంటా పున్నయ్య, పవన్‌కుమార్‌ల కొడుకులు రోడ్డు మీద కొట్టుకున్నారు. ఈనేపథ్యంలో పవన్‌కుమార్ కర్రతో పున్నయ్య కుమారుడ్ని కొట్టి గదిలో బంధించాడు. అంతే కాదు కులం పేరుతో దూషించాడు. దీంతో పున్నయ్య ఒంగోలు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వైప్రశాంతి తమ వాదనలు వినిపించారు. న్యాయమూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించి నేరం రుజువు కావడంతో నిందితుడు తన్నీరు పవన్‌కుమార్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.17 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కేసులో సాక్ష్యాధారులు సేకరించిన అప్పటి డీఎస్పీ నాగరాజు, ఎస్సై దాసరి రాజారావు, కోర్టు కానిస్టేబుళ్లను ఎస్పీ వి.హర్షవర్ధనరాజు అభినందించారు.

తుఫాన్ బాధితులకు అన్ని విధాలా అండ

మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

వేటకు వెళ్లని మత్స్యకారులకు, పునరావాసకేంద్రాల్లో ఉన్న వారికి నిత్యావసరాల పంపిణీ

సింగరాయకొండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ బాధితులను అన్ని విధాలా ప్రజా ప్రభుత్వం ఆదుకోవడానికి చర్యలు చేపట్టిందని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. శుక్రవారం పాకల, ఊళ్లపాలెం పల్లెపాలెంలో తుఫాన్ వలన వేటకు వెళ్లని మత్స్యకారులకు, పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న వారికి ఆయన చేతుల మీదగా నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వేటకు వెళ్లని 5,544 మత్స్యకారులకు 50 కేజీల బియ్యం, కిలో చొప్పున 5 నిత్యవసర వస్తువులు(కందిపప్పు, పామాయిల్, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, పంచదార) ఒక్కొక్కరికి రూ.వెయ్యి కుటుంబంలో గరిష్ఠంగా రూ.3వేలు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తుందని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న 3,029 మందికి 25 కేజీల బియ్యంతోపాటు నిత్యావసరవస్తులు, ఆర్థిక సహాయం చేస్తున్నట్లు వివరించారు. తుఫాన్ సమర్థవంతంగా ఎదుర్కొన్న ప్రభుత్వంపై జగన్‌రెడ్డి, వైసీపీనాయకులు విమర్శలు చేయడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు మరమ్మతులకు యుద్ధప్రాతిపాదికన అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పశుసంవర్ధక శాఖ నుంచి 50శాతం సబ్సిడీతో రైతులకు దాణాను అందజేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు నిరంతర పర్యవేక్షణ వలన కలెక్టర్ నుంచి కింది స్థాయిలో ఉండే పారిశుధ్య కార్మికుడు వరకు అంకితభావంతో పనిచేశారన్నారు. వారందరినీ మనస్ఫూర్తిగా ప్రభుత్వం తరఫున అభినందిస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 3 కోట్ల 5 లక్షల రూపాయలతో పీబీఛానల్‌ను అభివృద్ధిచేశామని, దాని ఫలితంగా 7 గొలుసుకట్టు పంట చెరువులు పూర్తిగా నిండాయని తెలిపారు. మూలగుంటపాడు పంచాయతీలోని రాతిచెరువును కూడా ఒక రోజు లోపుల గండిపూర్తి చేయించి మరలా పూర్తి నీటితో నింపుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జడ్పీ సీఈవో చిరంజీవి, పశుసంవర్ధకశాఖ జేడీ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఎన్‌బీవీ రాజేష్, ఎంపీడీవో జయమణి, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ కార్పొరేషన్ డైరెక్టర్ వేల్పుల సింగయ్య, మండల అధ్యక్షుడు మించల బ్రహ్మయ్య నేతలు షేక్ సంధానీబాషా, గొర్రిపాటి రామయ్య, పాకల సర్పంచ్ సైకం చంద్రశేఖర్, గాంధీచౌదరి, నారాయణస్వామి, చీమకుర్తి కృష్ణ, చంటి, కనూనరెడ్డి సుబ్బారావు పాల్గొన్నారు.



బియ్యం, నిత్యావసరాలను అందజేస్తున్న మంత్రి డాక్టర్ స్వామి

ఘనంగా వల్లభాయ్‌పటేల్ జయంతి వేడుకలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : భారత దేశపు ఉక్కుమనిషి, దేశాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చి జాతీయ ఐక్యతకు పునాది వేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం కలెక్టర్ పీ రాజాబాబు, జాయింట్‌కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణలు వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేశానికి వల్లభాయ్‌పటేల్ చేసిన సేవలను కలెక్టర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లారెవెన్యూ అధికారి చినఓబులేశు, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ ఉన్నారు.

ఉక్కుమనిషి వల్లభాయ్‌పటేల్ : ఎస్పీ

ఒంగోలు క్రైం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): దేశ ఏకీకరణలలో సర్ధార్ వల్లభాయ్ పటేల్ చూపించిన దృఢ సకల్పం యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్పీ వి.హర్షవర్ధనరాజు పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సర్ధార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు పోలీసు శాఖ తరఫున ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించించారు. అనంతరం నగరంలో ఐక్యతా పరుగును ఎస్పీ ప్రారంభించి పాల్గొన్నారు. తొలుత ఎస్పీ మాట్లాడుతూ భారత దేశం ముక్కలు కాకుండా పటేల్ చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు నాగరాజు, శ్రీనివాసరావు, విజయకృష్ణ, పాండురంగారావు పాల్గొన్నారు.





పటేల్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ రాజాబాబు, జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో ఓబులేశు,ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

విద్యుత్తు శాఖ నష్టం రూ.3.40 కోట్లు

దెబ్బతిన్నవి సుమారు 500 స్తంభాలు, 164 ట్రాన్స్‌ఫార్మర్లు

జిల్లా అంతటా సరఫరా పునరుద్ధరణ

ఆ శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు

ఒంగోలు క్రైం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మొంథా తుఫాన్ విద్యుత్తు శాఖకు రూ 3.40 కోట్లు నష్టం మిగిల్చిందని ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు చెప్పారు. శుక్రవారం స్థానిక విద్యుత్తు భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా ఆరు సబ్‌స్టేషన్లలోకి వరద నీరు చేరిందన్నారు. అయినప్పటికీ ఆరు సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాలకు ప్రత్యామ్నాయ మార్గాలలో మరుసటి రోజు విద్యుత్తు సరఫరా చేశామని చెప్పారు. ప్రస్తుతం చదలవాడ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు పూర్తిగా మునిగిపోయే విధంగా వరద నీరు వచ్చిందన్నారు. దీంతో ఆ సబ్‌స్టేషన్‌కు సంబంధిచి విద్యుత్తు సరఫరా వేరే మార్గాల ద్వారా పునరుద్ధరించామని తెలిపారు. ఎస్‌డీఆర్ఎఫ్ బృందాల సహకారంతో చేకూరుపాడు నుంచి మద్దిరాలపాడు విద్యుత్తు సిబ్బంది వెళ్లి విద్యుత్తు పునరుద్ధరించామని వివరించారు. మొత్తం 1576 మంది సిబ్బంది, 175 మంది అధికారులు తుఫాన్‌లో విధులు నిర్వహిచి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకున్నారని, వారందరికీ అభినందనలు తెలిపారు. మొత్తం సుమారు 500 విద్యుత్తు స్తంభాల, 164 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని వివరించారు. ఒంగోలు కర్నూలు రోడులో విద్యుత్తు శాఖకు సంబంధిచిన స్టోర్స్ విభాగంలో వర్షం నీరు చేరి సుమారు రూ.85 లక్షలు విలువ చేసేసామగ్రి దెబ్బతిందన్నారు. తీరప్రాంత మండలాలో ప్రస్తుతం యథావిధిగా విద్యుత్తు సరఫర పునరుద్ధరించామని చెప్పారు. ఇంకా టంగుటూరు మండలం జయవరానికి విద్యుత్తు వ్యవసాయ లైన్లపై ఇచ్చామన్నారు. శనివారం నుంచి వ్యవసాయ కనెక్షన్లపై దృష్టిసారించి విద్యుత్తు సరఫరా పునరుద్ధరిస్తామని చెప్పారు.



మాట్లాడుతున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

మంత్రి అభినందనలు

జిల్లాలో తుఫాన్ కారణంగా విద్యుత్తు సరఫరాను అత్యంత వేగంగా పునరుద్ధరించడంతోపాటు యంత్రాంగాన్ని అప్రమత్తంగా ఉంచి విధులు నిర్వహించినందుకు ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లును మంత్రి గొట్టిపాటి రవికుమార్ అభినందిచారు. ఈ మేరకు ఆయనకు సెల్‌ఫోన్‌లో సందేశం పంపించారు.

భారీ వర్షాలతో నష్టం

ఉరకెత్తిన మిర్చి, పొగ తోటలు

ఆందోళన చెందుతున్న రైతులు

దర్శి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ భారీ నష్టాన్ని కల్గించింది. ప్రధానంగా పంటలకు కోలుకోలేని దెబ్బతగిలింది. రోజులు తరబడి వర్షం కురవటంతో ఉరకెత్తి మిర్చి, పత్తి, పొగాకు మొక్కలు చనిపోతున్నాయి. మండలంలోని బసిరెడ్డిపల్లి, చందలూరు, లింగన్నపాలెం, వెంకటచలంపల్లి తదితర గ్రామాల్లో సాగు చేసిన పొగతోటలు ఉరకెత్తాయి. కాపుకొచ్చిన మిరప ఉరకెత్తి నేలకొరిగాయి. బొట్లపాలెం, పోతకమూరు, పాపిరెడ్డిపాలెం, చెరువుకొమ్ముపాలెల్లో బోర్లకింద సాగుచేసిన వరిపైరు పంట దశకు చేరింది. వెన్నుతీస్తున్న సమయంలో గాలి, వాన దెబ్బకు పంట నేలమట్టమైంది. కంది పంట పలు గ్రామాల్లో ఉరకెత్తి దెబ్బతింటుంది. వర్షం వీడిన తర్వాత రైతులు పొలాల్లోకి వెళ్లి చూస్తే పరిస్థితి అగమ్యగోచరంగా మారటంతో ఏం చేయాలో తెలియక కన్నీరుమున్నీరు అవుతున్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటలు పంట దశకు వచ్చేసరికి తుఫాన్‌తో నాశనం కావటంతో అప్పులపాలయ్యే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

ఇరు వర్గాలపై కేసులు

నాగులుప్పలపాడు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తిమ్మసముద్రం గ్రామంలో వరద బాధితుల వివరాల నమోదు విషయంలో గ్రామానికి చెందిన టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య జరిగిన దాడిలో ఇరువర్గాలు ఒకరిపైనొకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైసీపీ వర్గీయులు ఎనిమిది మందిపై టీడీపీ గ్రామ అధ్యక్షుడు మంగమూరి మధు, అలాగే టీడీపీ వర్గీయులు ఆరుగురిపై మాజీ సర్పంచ్ కరణం రమేష్ ఫిర్యాదులు చేశారు. దాంతో సదరు వ్యక్తులపై శుక్రవారం కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ రజియాసుల్తానా తెలిపారు. టీడీపీకి చెందిన మంగమూరి మధు, ముద్దన రవి, తేళ్ల శేషుబాబు, తేళ్ల కృష్ణకాంత్, మంగమూరి సురేష్, తేళ్ల హేమంత్, మంగమూరి శేషయ్యతో పాటు వైసీపీ చెందిన కరణం రమేష్, ముద్దన మహేశ్వరావు, ముద్దన రాఘవయ్య, వెంకటేశ్వర్లు, శేషకల్పసాయి, రామూర్తి నాయుడు, ఎంపీటీసీ అశోక్(నాని), జయప్రకాశ్‌నారాయణలపై కేసులు నమోదు చేశారు.

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సత్కారం

ఒంగోలు క్రైం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖలో పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఇరువురు హెడ్ కానిస్టేబుళ్లను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు శుక్రవారం ఒంగోలు ఎస్పీ కార్యాలయంలో సత్కరించారు. రాచర్ల పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎల్లయ్య, ఆర్మ్‌డ్ రిజర్వులో హెడ్ కానిస్టేబుల్ బి.సింగారయ్యలకు శాలువాలు కప్పి సత్కరించారు. డీఎస్పీలు ఆర్.శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ రామవేంద్ర పాల్గొన్నారు.

వర్షపు నీటిని తొలగించాలి

నాగులుప్పలపాడు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ముంపు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీటిని యుద్ధప్రాతిపదికన తొలగించాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. తుఫాన్ ప్రభావంతో నీటమునిగిన చదలవాడ ఎస్టీకాలనీని కలెక్టర్ రాజాబాబు, జేసీ గోపాలకృష్ణతో కలిసి శుక్రవారం పరిశీలించారు. అక్కడి ప్రజలతో మమేకమయ్యారు. వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పునరావాస కేంద్రంలో భోజనవసతులు ఎలా ఉన్నాయి.. తాగునీరు అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు. గుండ్లకమ్మ నుంచి నీటిని విడుదల చేయడంతో కాలనీ మొత్తం ముంపునకు గురైందని కాలనీవాసులు తెలిపారు. శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్‌ను కోరారు. కాలనీలో రోడ్లు ఎత్తు పెంచేలా చర్యలు తీసుకొంటామని కలెక్టర్ చెప్పారు. అనంతరం చీర్వానుప్పలపాడు రోడ్డులో రామన్నచెరువు నీరు బయటకు వెళ్లేందుకు రోడ్డు పగులగొట్టి తూములు ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ కాంక్రీట్ కల్వర్టును నిర్మించాలని అధికారులకు సూచించారు. రామన్నచెరువు కట్టకు శాశ్వత పరిష్కారం కల్పిస్తామని చెప్పారు. వైద్యశిబిరాలను నిర్వహించాలని ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వరదనీటిలో చిక్కుకున్న మద్దిరాలపాడులో నెలకొన్న సమస్యలపై సర్పంచ్ స్వర్ణ అనురాధ, ఉప సర్పంచ్ సునీల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో తేళ్ల రవికుమార్ పాల్గొన్నారు.

చీమకుర్తి మున్సిపాలిటీకి మహర్దశ

- **రూ.4.50కోట్లతో అభివృద్ధి పనులు**
- **కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం**
- **ఎమ్మెల్యే బీఎన్ చొరవతో కల సాకారం**

చీమకుర్తి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మున్సిపాలిటీకి మహర్దశ పట్టబోతుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఏకంగా దాదాపు రూ.4.50కోట్లతో అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ప్రత్యేక చొరవతో మంజూరు చేయించిన డీఎంఎఫ్ నిధులు, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో పాటు 15వ ఫైనాన్స్ నిధులతో పట్టణంలో పలు అభివృద్ధి పనులను చేపట్టటానికి మార్గం సుగమం కానుంది. మున్సిపల్ చైర్‌పర్సన్ జి.రాజ్యలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అజెండాలో పొందుపరిచిన 39 అంశాలకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. రూ.2.60కోట్ల డీఎంఎఫ్ నిధులు, రూ.54లక్షలు ఒడా నిధులు, రూ.95లక్షలు ఎస్ఎఫ్‌సీ నిధులు, రూ.35లక్షల ఎస్సీసబ్‌ప్లాన్ నిధులతో చీమకుర్తి పట్టణాన్ని సుందరాంగంగా తీర్చిదిద్దనున్నారు. టెండర్లు కూడా పూర్తయిన ఈ నిధులతో రెండునెలల లోపే సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, కమ్యూనిటీ భవనాలు, ఎస్సీలకు చెందిన శ్మశానవాటికల అభివృద్ధి తదితర పనులు నిర్వహించనున్నారు. కమిషనర్ రామకృష్ణయ్య, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

(5వపేజీ తరువాయి)

అందుకునే వారిలో వృద్ధులు 1,47,284, వితంతువులు 74,669, ఒంటరి మహిళలు 7,713 మంది, చర్మకారులు 5,242, డప్పు కళాకారులు 4,522, దివ్యాంగులు 32,568, మత్స్యకారులు 2,454, చేనేతలు 1,727 ఉన్నారు. వీరితో పాటు కల్లు గీత కార్మికులు 240, హిజ్రాలు 90, కళాకారులు 56, అభయ హస్తం కింద 4,682, వ్యాధులతో బాధపడుతున్న 1,889, ఇతరులు 649కి పింఛన్లు ఇవ్వనున్నారు. ఏకారణం చేతనైనా శనివారం పింఛన్ సొమ్మును తీసుకోలేని వారికి 3వ తేదీ సోమవారం అందజేయనున్నారు.

నోటీసులు ఇచ్చిన వారికి కూడా...

ఎన్టీఆర్ భరోసా కింద పింఛన్లు పొందుతున్న వారిలో కొందరిని ప్రభుత్వం అనర్హులుగా గుర్తించింది. వారికి రెండు నెలల క్రితమే నోటీసులు ఇచ్చింది. అర్హతను నిరూపించుకోవాలని, తిరిగి వైద్య పరీక్షలకు హాజరుకావాలని సూచించింది. ప్రభుత్వానికి అప్పీలు చేసుకునేందుకు గడువు విధించింది. నోటీసులు పొందిన వారిలో సగానికి సగం మంది స్పందించ లేదు. ఎలాంటి సమాధానం ఇవ్వకుండా ముఖం చాటేశారు. ఇలాంటి వారికి ఈనెలలో పింఛన్ సొమ్మును ప్రభుత్వం నిలిపివేస్తుందని భావించారు. అయితే ఒక్కరికి కూడా పింఛన్ ఆపకుండా పంపిణీ చేయాలని ప్రభుత్వం శుక్రవారం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ నెలలో అందరికీ పింఛన్లు ఇవ్వనున్నారు.

పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని ప్రజాప్రతినిధులను అధికారులు కోరారు. దూర ప్రాంతాల్లో ఉన్న వారికి గ్రామాలకు వచ్చి పింఛన్ సొమ్ము తీసుకోవాలని సచివాలయం సిబ్బంది ఫోన్ల ద్వారా సమాచారం పంపారు.

అవీఇవీ

నాల్గో రోజూ గుండ్లకమ్మ ఉధృతి

తర్లుపాడు నుంచి కంభంకు రాకపోకలు బంద్



ప్రమాదకరస్థాయిలో గుండ్లకమ్మ ప్రవాహం

తర్లుపాడు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ వాగు నాలుగో రోజు కూడా తగ్గలేదు. దీంతో తర్లుపాడు నుంచి కంభానికి రాకపోకలు నిలిచిపోయాయి. గుండ్లకమ్మ వాగు మరో 2 రోజుల పాటు ఇలాగే ప్రవహించవచ్చని ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు. తర్లుపాడు నుంచి కంభానికి కేవలం 15 కి.మీ. ప్రస్తుతం ప్రయాణికులు మార్కాపురం వెళ్లి అక్కడ నుంచి 40 కి.మీ. సుదూరంగా ప్రయాణించాల్సి వస్తుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బొడిచర్ల, బొందలపాడు, సూరెపల్లె, లింగోజిపల్లె ప్రజలు తమ గమ్యస్థానానికి చేరాలంటే దాదాపుగా 45 కి.మీ. ప్రయాణించాల్సి వస్తున్నది.

దివ్యాంగుల వసతి గృహంలో అక్రమాలపై విచారణ



విచారణ చేస్తున్న పీడీ సువర్ణ

ఒంగోలునగరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంతపేటలోని దివ్యాంగ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వసతి గృహంలో జరుగుతున్న అక్రమాలపై శుక్రవారం విచారణ చేపట్టారు. విచారణ అధికారిగా నియమితులైన స్త్రీశిశు సంక్షేమశాఖ సువర్ణ వసతి గృహానికి వెళ్లి విచారణ చేపట్టారు. వసతి గృహంలో తక్కువ మంది విద్యార్థులు ఉండగా ఎక్కువ మంది ఉన్నట్లు చూపించి బిల్లులు డ్రా చేసుకుంటున్నారంటూ మదర్‌థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి నాయకులు సయ్యద్ అమీర్ ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఇంకా పలు ఆరోపణలు చేస్తూ ఆయన చేసిన ఫిర్యాదుపై ప్రభుత్వం స్పందించి విచారణకు ఆదేశించారు. వసతి గృహానికి ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతులు నిర్వహిస్తున్న రవితేజపై పీడీ సువర్ణ విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుడిని, ఇన్‌చార్జి వార్డెన్ రవితేజను, వసతి గృహంలోని విద్యార్థులను వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ముంచిన మొంథా

(5వపేజీ తరువాయి)

వచ్చింది. ఎండలు రావడంతో ప్రజానీకం కాస్తంత కుదటపడి సాధారణ జీవనంలోకి వస్తున్నారు. ఈ సమయంలో పంటలు, ఇతర వనరులకు జరిగిన నష్టాలు వెలుగు చూస్తున్నాయి.

పలుచోట్ల చెరువులకు గండ్లు, లీకులు

వర్షపు నీరు వెళ్లిపోవడంతో జిల్లావ్యాప్తంగా రోడ్లకు జరిగిన నష్టం వెలుగుచూస్తోంది. చాలా చోట్ల అర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలతోపాటు పట్టణాల్లోని రోడ్లు ధ్వంసమై దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల పర్లాంగుకు పది గుంటలు, కిలో మీటరకు ఐదారు చోట్ల కోతలు, అక్కడక్కడా గండ్లు పడి కనిపిస్తున్నాయి. చెరువులు, వాగులు, వంకలు ఇతర నీటి వనరులకు పడిన గండ్ల పరిధి ఎంత స్థాయిలో ఉందో స్పష్టతవస్తోంది. గుండ్లకమ్మ ప్రాజెక్టులోకి రెండు రోజుల క్రితం పోల్చితే వరద తగ్గినా ఇంకా ఎగువ నుంచి భారీగానే నీరు వస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 12వేల క్యూసెక్కులు వస్తుండగా ఒక గేటు ఎత్తి 250 క్యూసెక్కులు బయటకు వదులుతున్నారు. పశ్చిమ ప్రాంతంలో గుండ్లకమ్మలోకి నీరు ఇంకా వస్తోంది. తర్లుబాడు మండల పరిధిలో ఉధతంగా గుండ్లకమ్మ ప్రవహిస్తుండటంతో కంభం-తర్లుబాడు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కంభం చెరువు అలుగు కూడా ఉధృతంగానే ప్రవహిస్తూ ఆ నీరు గుండ్లకమ్మలోకి చేరుతోంది. సింగరాయకొండ మండలంలోని కలికవాయి, బిత్రగుంట చెరువుల నుంచి నీరు ఉధృతంగా బయటకు వస్తూ దిగువన ఉన్న రాతి చెరువుకు చేరడంతో దానికి గండి పడింది. కనిగిరిపెద్ద చెరువుకు లీకులు పడ్డాయి. పలు ఇతర చోట్ల ఉధృతంగా వాగులు, వంకల్లో నీరు పారుతోంది.

సహాయక చర్యలు ముమ్మరం

వర్షం తెరపి ఇవ్వడంతో ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాలను పరిశీలించడంతోపాటు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. మంత్రి డాక్టర్ స్వామి మర్రిపూడి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పంట నష్టాలను పరిశీలించారు. అలాగే సింగరాయకొండ మండలం పాకలలో మత్స్యకారులకు నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందజేశారు. నాగులుప్పలపాడు మండలంలో కలెక్టర్ పి.రాజాబాబు పలు గ్రామాల్లో పర్యటించారు. ఇతర ప్రాంతాల్లోనూ అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటించి నష్టాలను పరిశీలించి ఉపశమన చర్యలపై ప్రజలకు భరోసా ఇస్తున్నారు.

వివిధ శాఖలకు...

ఒంగోలు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా వర్షం తెరపి ఇవ్వడంతో నష్టాలు వెలుగు చూస్తున్నాయి. అధికారులు ప్రాథమికంగా అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపుతున్నారు. విద్యుత్ శాఖకు రూ.3.40 కోట్ల మేర నష్టం వాటిల్లింది. ఒంగోలు మునిసిపాలిటీలో రూ.10.7 కోట్లు, ఆర్‌అండ్‌బీకి రూ.16.22 కోట్లు, పంచాయతీరాజ్‌లో రూ.7.01 కోట్లు, మత్స్యశాఖకు రూ.88 లక్షల మేర నష్టం జరిగినట్లు ఆశాఖల అధికారులు ప్రాథమికంగా నివేదికలు పంపినట్లు తెలుస్తోంది. ఇరిగేషన్‌కు కూడా భారీగా నష్టం వాటిల్లినట్లు సమాచారం. అనేకప్రాంతాల్లో చెరువులకు గండ్లుపడటంతోపాటు కాలువలు కూడా ధ్వంసమయ్యాయి. దీంతో ఆశాఖ అధికారులు కూడా ప్రాథమిక అంచనాలను రూపొందిస్తున్నారు. ఇక వ్యవసాయశాఖకు సంబంధించి భారీగా నష్టాలు వెలుగు చూస్తున్నాయి. వివరాలను అన్ని శాఖల ద్వారా కలెక్టరేట్‌కు తెప్పిస్తున్నారు. ప్రాథమిక అంచనా వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తున్నట్లు సమాచారం.

వెలిగొండ ఫీడర్ కాలువకు టెండర్లు ఖరారు

(5వపేజీ తరువాయి)

టన్నెల్ నుంచి నీరు బయటకు వచ్చే దోర్నాల మండలం కొత్తూరు నుంచి రిజర్వాయర్ వరకు సుమారు 21.80 కి.మీ మేర కాలువ తవ్వారు. దాని ద్వారా టన్నెల్ నుంచి వచ్చే కృష్ణానీరు రిజర్వాయర్‌లోకి చేరుతుంది. ఇంతటి కీలకమైన ఫీడర్ కాలువ కోసం అప్పట్లో రూ.105 కోట్లు ఖర్చు చేశారు. అయితే ప్రాజెక్టు నీరు టన్నెల్ నుంచి రాకముందే దశాబ్దన్నర క్రితం తవ్వడం, పనులు కూడా సక్రమంగా పూర్తి చేయకపోవడం వల్ల ఏటా వచ్చే వర్షాలతో కాలువ ధ్వంసమైంది. దీంతో ఆధునికీకరిస్తే తప్ప ఫీడర్ కాలువ నుంచి రిజర్వాయర్‌లోకి నీరు చేర్చడం సాధ్యంకాదని అధికారులు నివేదించారు. మొత్తం 21.80 కి.మీ. కాలువకు లైనింగ్‌తోపాటు మూడు చోట్ల 5.20 కి.మీ మేర కాంక్రీటు గోడల నిర్మాణం అవసరమని.. అందుకు రూ.436 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. ఆ మేరకు సీఎం ఆదేశాలతో ఈ పనులను గత నెల 23న ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

త్వరలో పనులు ప్రారంభం

ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన వెంటనే అధికారులు టెండర్ల ప్రక్రియను ప్రారంభించారు. జీఎస్టీ, ఇతర పన్నులు పోను రూ.375 కోట్లకు టెండర్లు పిలవగా మెగా ఇంజనీరింగ్, కేఎంవీ అండ్ జీడీఆర్ జాయింట్ వెంచర్ కంపెనీలు టెండర్లు దాఖలు చేశాయి. ఈనెల 23న వాటి సాంకేతిక బిడ్‌ను ఓపెన్ చేసిన అధికారులు తాజాగా టెండర్ ఆర్థిక బిడ్‌ను తెరిచారు. అందులో మెగా కంపెనీ 4.83శాతం అదనపు మొత్తానికి, కేఎంవీ జాయింట్ వెంచర్ కంపెనీ 4.60శాతం అదనపు మొత్తానికి టెండర్లు దాఖలు చేశాయి. దీంతో తక్కువ మొత్తం కోడ్ చేసిన కేఎంవీ కంపెనీకి పనులు ఇచ్చేలా సంబంధిత అధికారులు ఎస్ఎల్‌టీసీకి ప్రతిపాదించారు. దీన్ని ఎస్ఎల్‌టీసీ సభ్యులు శుక్రవారం సమావేశమై పరిశీలించారు. ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ శ్యామ్ ప్రసాద్ కన్వీనర్‌గా ఉన్న ఈ సాంకేతిక కమిటీలో రాష్ట్రస్థాయిలోని ఇతర ఉన్నత స్థాయి ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు. ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదించిన కేఎంవీ కంపెనీకి ఈ కమిటీ టెండర్ ఖరారు చేసింది. టెండర్లు ఖరారు అయినందున త్వరలోనే పనులు చేపట్టనున్నట్లు వెలిగొండ ఎస్ఈ అబూద్ సలీం తెలిపారు.



ఉన్నత లోకాలనిచ్చే ఉత్థాన ఏకాదశి

నేడు శ్రీ మహావిష్ణువు యోగనిద్ర నుంచి మేల్కొంటారని చెబుతున్న పురాణాలు
సాధకులు, సాధువులు, పీఠాధిపతులు నేటితో చాతుర్మాస్య దీక్ష విరమణ
జిల్లావ్యాప్తంగా వైష్ణవాలయాలలో ప్రత్యేక పూజలు, కల్యాణాలు

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : పురాణాల ప్రకారం శ్రీమహావిష్ణువు సంవత్సరంలో నాలుగు నెలలు యోగనిద్రలో ఉంటారు. ఏటా తొలి ఏకాదశి రోజున యోగ నిద్రకు ఉపక్రమించిన శ్రీ మహావిష్ణువు తిరిగి నాలుగు నెలల తర్వాత కార్తీకమాసంలో యోగనిద్ర నుంచి బయటకు వస్తారు. అందుకే తొలి ఏకాదశిని శయన ఏకాదశి అని, కార్తీకమాస శుక్లపక్షంలో వచ్చే ఏకాదశిని ఉత్థాన ఏకాదశి అని పిలుస్తారు. అటువంటి ఉత్థాన ఏకాదశి ఈ ఏడాది శనివారం రావటం మరింత విశేషం. శ్రీ మహావిష్ణువు పూజకు అత్యంత విశేషమైన రోజు శనివారం.

● శుభకార్యాలకు శ్రీకారం

ఈ ఉత్థాన ఏకాదశి నుంచే అనేక శుభకార్యాలకు శ్రీకారం పలుకుతారు. గృహప్రవేశాలు, శంకుస్థాపనలు, వివాహాలు, ఉపనయనాలు మొదలైన అనేక శుభకార్యాలు ప్రారంభం అవుతాయి.

● చాతుర్మాస్య దీక్షకు ముగింపు

అనేకమంది సాధకులు, సాధువులు, పీఠాధిపతులు తొలి ఏకాదశి మొదలు చాతుర్మాస్య దీక్షను ఆరంభిస్తారు. అంటే వారు నాలుగు నెలల పాటు అత్యంత నియమనిష్టలతో ఉండి ఎక్కడికీ కదలకుండా కేవలం భగవంతుని పూజా కార్యక్రమాలలోనే గడుపుతారు. అటువంటి చాతుర్మాస్య దీక్ష శ్రీ మహావిష్ణువు యోగనిద్ర నుంచి మేల్కొనే ఈ ఉత్థాన ఏకాదశి రోజున ముగుస్తుంది.

● శ్రీ మహావిష్ణువు, తులసి కల్యాణం

ఉత్థాన ఏకాదశి రోజున అనేకమంది ఉపవాసం ఉండి మరుసటి రోజైన ద్వాదశి, దీనినే చిలుక ద్వాదశిగా పిలుస్తారు. ఆ రోజున శ్రీమహావిష్ణువుకు తులసీ దేవికి కల్యాణం జరిపిస్తారు. ఈ విధంగా విష్ణు తులసి కల్యాణం మన జిల్లాలో అనేక వైష్ణవాలయాలలో జరుగుతుంది. ఆ రోజున దేవాలయంలో ఉన్న తులసి చెట్టు ముందు విష్ణుమూర్తి ప్రతిమను ఉంచి వారిరువురికి కల్యాణం జరపటం వల్ల లోకం సుభిక్షంగా ఉంటుందని నమ్మకం.

● ఒంగోలులో వ్రతాలు, కల్యాణాలు

ఒంగోలు నగరంతో పాటు జిల్లాలోని అనేక వైష్ణవాలయాలలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు, తులసి శ్రీ మహావిష్ణు కల్యాణాలు జరగనున్నాయి. నగరంలోని కేశవస్వామిపేట శ్రీప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం, సుందరనగర్ శ్రీసీతారామ స్వామి దేవస్థానం, రాంనగర్ శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం, శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానం ఇలా పలు వైష్ణవాలయాలకు ఉత్థాన ఏకాదశి సందర్భంగా శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకోనున్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లను నిర్వాహకులు చేశారు.


ఒంగోలులోని చెన్నకేశవ స్వామి గుడి

నష్టం నివేదికలను సిద్ధం చేయండి

వైపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు


వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న గూడూరి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో తుఫాన్‌తో పంటనష్టపోయిన ప్రతి రైతుకు నష్ట పరిహారం అందించేందుకు వ్యవసాయాధికారులు నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. ఐదు మండలాల వ్యవసాయాధికారులతో శుక్రవారం ఎర్రగొండపాలెంలో సమీక్షించారు. ప్రతి గ్రామంలో పొలాలను పరిశీలించి రిపోర్టులు తయారు చేయాలని అన్నారు. తహసీల్దారు పర్యవేక్షణలో జరగాలని అన్నారు. వ్యవసాయాధికారులు ఇప్పటి వరకు నమోదు చేసిన రిపోర్టులు తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయాధికారులు, ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి పాల్గొన్నారు.

పంట నష్టంతో రైతు కన్నీరు

పూర్తిగా దెబ్బతిన్న మిర్చి, పత్తి, మొక్కజొన్న

నష్టపరిహారం అందించాలని వేడుకోలు


తుపాన్ ప్రభావంతో విరిగిన మిరప చెట్లు

ఎర్రగొండపాలెం రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎర్రగొండపాలెం మండలంలోని పలు గ్రామాలలో సాగు చేసిన మిరప, పత్తి, మొక్కజొన్న, బొప్పాయి తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మండల వ్యాప్తంగా సుమారు 500 ఎకరాల్లో బొప్పాయి, వెయ్యి ఎకరాల్లో మిరప, 500 ఎకరాల్లో మొక్కజొన్న ఇతర పంటలు నీట మునిగినట్లు సమాచారం. ముఖ్యంగా కొలుకుల, వీరభద్రాపురం, వీరాయపాలెం, వెంకటాద్రిపాలెం, ఆయ్యంబొట్లపల్లి, గంగాపాలెం,వాదంపల్లి, తమ్మడపల్లి గ్రామాలలో ఈ నష్టం వాటిల్లినట్లు రైతులు చెబుతున్నారు. తుఫాన్ కన్నీరు మిగిల్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పంటలను పరిశీలించి నష్టపరిహారం అందించాలని వారు కోరుతున్నారు.

గొర్రెల యజమానులకు నష్టపరిహారం అందించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గొర్రెల పెంపకందారుల సంఘం ప్రతినిధులు

గిద్దలూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాల నేపథ్యంలో మేతకు వెళ్లి తిరిగి వస్తూ సగిలేరువాగు ఉధృతిలో కొట్టుకుని పోయిన గొర్రెల యజమానులకు నష్టపరిహారం అందించాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గిద్దలూరు మండలం కేఎస్‌పల్లెకు చెందిన పి.ఈశ్వర్‌రావు, ఎ.శ్రీనివాసరెడ్డి అనే రైతులకు చెందిన గొర్రెలు మేత కోసం కొండకు పోయి తిరిగి వస్తున్న సమయంలో 30 గొర్రెలు సగిలేరువాగు ఉధృతికి నీటిలో కొట్టుకుని పోయి మృతిచెందాయని, సుమారు 4లక్షల రూపాయల మేర నష్టం జరిగిందని తెలిపారు. ప్రతి జీవానికి కనీసం 10వేల రూపాయల వంతున నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని తహసీల్దార్ ఆంజనేయరెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఈకార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఆవులయ్య, రామరాజు, రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

శిశుగృహాలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు నగరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశుగృహ, బాలసదనాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధిసాధికారశాఖ అధికారి సువర్ణ ఒక ప్రకటనలో కోరారు. ఒంగోలులోని శిశుగృహ, బాలసదనం, గిద్దలూరులోని బాలసదనంలో ఉన్న ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. శిశుగృహలో సోషల్ వర్కర్-1, పార్ట్ టైం డాక్టర్, ఆయా పోస్టులు-2, వన్‌స్టాఫ్ సెంటర్‌లోని సైకో సోషల్ కౌన్సిలర్ -1, కేసు వర్కర్-1, పారామెడికల్ పర్సన్-1, మల్టీపర్పస్ హెల్పర్-1, ఒంగోలులోని బాలసదనంలో స్టోర్ కీపర్ కమ్ అకౌంటెంట్ -1, ఎడ్యుకేటర్, పీడీ బోధకుడు-యోగా టీచర్, గిద్దలూరు బాలసదనంలో స్టోర్‌కీపర్ కం అకౌంటెంట్, ఎడ్యుకేటర్, పీటీ బోధకుడు-యోగా టీచర్, హౌస్‌కీపర్, ఆర్ట్ అండ్ క్రాఫ్టు మ్యూజిక్ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ పోస్టులన్నీ మహిళా అభ్యర్థులకే రిజర్వు అయ్యాయని, పార్ట్ డాక్టర్ పోస్టుకు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిపై జరుగుతుందన్నారు. ఈనెల నెల 8లోపు దరఖాస్తులను ఒంగోలునగరం రామ్‌నగర్ మూ డోలైన్‌లోని స్త్రీశిశుసంక్షేమశాఖ పీడీ కార్యాలయంలో అందజేయాలని, వివరాలకు ప్రకాశం వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

పంట నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం

● మంత్రి స్వామి

మర్రిపూడి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా పంట దెబ్బతిన్న ప్రతి రైతునూ ప్రజా ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి చెప్పారు. శుక్రవారం మండలంలోని అంకేపల్లిలో దెబ్బతిన్న సజ్జ పైరును పరిశీలించారు. నష్ట వివరాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాల కారణంగా చేతికొచ్చిన పంటను కోసుకోలేకపోయామని పలువురు రైతులు ఆయన ఎదుట వాపోయారు. ఎకరాకు రూ.15 వేలకుపైగా నష్టం వాటిల్లిందని సజ్జ కంకులు బూజు పట్టి నల్లగా మారిపోయాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు మంత్రి హామీ ఇచ్చారు. పూర్తి స్థాయిలో అంచనాలు సిద్ధం చేసి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు.

నీరు నిల్వ ఉన్న కంది పొలాలను ఆయన పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కంది పైరు దెబ్బతింటే పంట బీమా వస్తుందన్నారు. మండలంలో 340 హెక్టార్లలో సజ్జ పైరు పూర్తిగా దెబ్బతిన్నదని మంత్రి తెలిపారు. జిల్లాలో 23 వేల హెక్టార్లలో పలు పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా తెలుపుతోందన్నారు. సమగ్ర నివేదిక వచ్చిన తర్వాత ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పరిహారం అందిస్తుందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ, దర్శి ఏడీ బాలాజీ నాయక్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రమేష్, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, తహసీల్దార్ జనార్ధన్, ఎంపీడీవో జగదీష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన టీడీపీ నేతలు

వైసీపీ బురద రాజకీయాలకు స్వస్తి పలకాలి

● మంత్రి స్వామి

మర్రిపూడి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ రాష్ట్రం జలవిలయం చేస్తే ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రజలను కంటికి రెప్పలా కాపాడిన సమర్థవంతమైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ నిరంతరం జిల్లా స్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి గ్రామ సహాయకుల వరకు దిశానిర్దేశం చేస్తూ ప్రకృతి విలయం నుంచి ప్రజలను కాపాడగలిగారని కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో సహా మాజీ వ్యవసాయ శాఖ మంత్రి కన్నబాబులు చేస్తున్న విమర్శలు అర్థరహితమన్నారు. గత ఎన్నికలలో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పినప్పటికీ వారి తీరు మారలేదని ఎద్దేవా చేశారు. జిల్లాలో జలవిలయం తాండవిచ్చిందని ఎన్నో ఏళ్లుగా నిండని జలాశయిలు, చెరువులు సమృద్ధిగా జలకళ సంతరించుకున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాలో ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం సంభవించకుండా రాత్రింబవళ్లు అధికార యంత్రాంగం చేసిన కృషిని ఆయన అభినందించారు. జిల్లావ్యాప్తంగా పలు ప్రధాన రహదారులు తీవ్రంగా దెబ్బతినడంతో రవాణా వ్యవస్థ స్తంభించిపోయిందని తెలిపారు. ఆర్‌అండ్‌బీ పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షించి త్వరితగతిన మరమ్మతులు చేసేందుకు అవసరమైన అంచనాలు రూపొందించాలని ఆదేశించామన్నారు. మర్రిపూడి చెరువు కట్ట కింద ప్రమాదకరంగా మారిన కోనేరుల వద్ద తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ డీఈని ఫోన్‌లో ఆదేశించారు. రూ.39 కోట్ల గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేయిస్తే వైసీపీ పాలకులు పనులు పూర్తి చేయించలేకపోయారని విమర్శించారు. లక్ష్మీనరసింహస్వామి ఘాట్ రోడ్డు నిర్మాణానికి రూ.4కోట్ల నిధులు మంజూరు చేయించానని రహదారి నిర్మాణానికి భక్తులు సహకరించాలని కోరారు. త్వరలో టంగుటూరు పొదిలి ఆర్‌అండ్‌బీ రహదారి శాశ్వత అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. మర్రిపూడిలో పీడీసీసీబీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. మర్రిపూడి సచివాలయాన్ని రెండుగా విభజించి వల్లాయపాలెం పంచాయతీని మర్రిపూడి సచివాలయ పరిధిలో చేర్చాలని గ్రామస్థులు కోరారు. విలేకరుల సమావేశంలో మర్రిపూడి సొసైటీ అధ్యక్షుడు ఎర్రమోతు శ్రీనివాసులు, నాయకులు రేగల వీరనారాయణ, దాసరి వెంకటేశ్వర్లు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చేరెడ్డి నర్సారెడ్డి, తుళ్లూరి నరసింహారావు, మాకినేని శ్రీనివాసరావు, సారెడ్డి నరసింహారెడ్డి, ఎర్రంరెడ్డి వెంకటరెడ్డి, చెన్నుబోయిన బాలనర్సయ్య, ముత్తముల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొత్తపట్నం-ఒంగోలు రోడ్డులో రాకపోకల పునరుద్ధరణ

● వరద నీటిని తొలగించే పనులను పరిశీలించిన కలెక్టర్


వరద నీటినిబయటకు పంపే పనులను పరిశీలిస్తున్న కలెక్టర్, వివరిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

కొత్తపట్నం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపట్నం-ఒంగోలు, ఈతముక్కల-సూరారెడ్డిపాలెం రహదారుల్లో గత మూడు రోజులుగా నిలిచిపోయిన రాకపోకలు శుక్రవారం పునరుద్ధరించారు. తుఫాన్ నేపథ్యంలో వరద నీరు ఆయా రోడ్లపై ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రమాదకర స్థాయిలో పారుతుండటంతో ఆర్టీసీ బస్సులను కూడా నిలిపివేశారు. దీంతో మూడు రోజుల పాటు కొత్తపట్నం మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా రహదారుల్లో వరద నీరు భారీ ప్రవహిస్తుండటం రోజుల తరబడి రాకపోకలు ఆగిపోవడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. అత్యవసర వైద్యసేవలు అందక ఇబ్బందులుపడ్డారు. ఈక్రమంలో రహదారులపై చేరిన వరద నీటిని బయటకు పంపేందుకు అధికారులు తీసుకున్న చర్యలను శుక్రవారం కలెక్టర్ రాజాబాబు, జేసీ గోపాలక్రిష్ణ పరిశీలించారు. కొప్పోలు నుంచి అల్లూరు వరకు ఆయన వరద నీటి ఉధృతిని పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. స్థానికులతో మాట్లాడారు. అల్లూరు-ఆలూరు గ్రామాల మధ్య పోతురాజు కాలువ వద్ద కొత్తగా నిర్మాణంలో ఉన్న వంతెన వద్ద నీటకి అడ్డుగా ఉన్న అప్రోచ్ రోడ్డును వెంటనే తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. అల్లూరు చెరువుకు అనుంధానంగా ఉన్న బేబిరెడ్డికాలు, ఎస్సెస్సీ కెనాల్ ఆధుకీరణ పనులు చేపట్టాలని స్థానిక రైతులు కోరారు.

ముగిసిన పోలీస్ అమరవీరుల వారోత్సవాలు

విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం

అబ్బురపరిచిన జాగిలాల విన్యాసాలు

ఒంగోలు క్రైం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరుల త్యాగాలు అజరామరం అని ఎస్పీ వి.హర్షవర్ధన రాజు కొనియాడారు. శుక్రవారం స్థానిక పోలీసు కార్యాలయంలో పోలీసు అమరవీరుల వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పోలీసు విధులపై అవగాహన కల్పించేందుకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిచారు. ఎస్పీ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం ఉన్నప్పటికీ అన్నీ పోలీసు స్టేషన్లలో వారం రోజుల పాటు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారని చెప్పారు. అదే విధంగా ఓపెన్ హౌస్ కార్యక్రమంలో విద్యార్థులకు పోలీసు విధులు, వారు వినియోగించే ఆయుధాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు వినియోగించే ఆయుధాలను ప్రదర్శించి వాటి గురించి వివరించారు. అంతే కాకుండా డ్రోన్ కెమెరాలు వినియోగం ఎలా ఉంటుందని తెలిపారు. పోలీసు జాగిలాల విన్యాసాలు విద్యార్థులను అబ్బురపరిచాయి. చీటా, జాకీ అనే జాగిలాలు ఎస్పీకి గౌరవ వందనం చేసి విన్యాసాలు ప్రారంభించాయి. జాకీ జాగిలం చేసిన హర్డిల్స్ జంప్ విద్యార్థులను ఆకట్టుకున్నాయి. అదేవిధంగా వాసన చూసి నేరస్థులను, దొంగలను పట్టుకోవడం లాంటి విన్యాసాలు ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావుతో పాటు తదితర అధికారులు పాల్గొన్నారు.


ఓపెన్ హౌస్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు


ఓపెన్ హౌస్‌లో గన్లను పరిశీలిస్తున్న విద్యార్థులు


తక్షణ రక్షణ కోసం మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

టంగుటూరు-పొదిలి రహదారికి తాత్కాలిక మరమ్మతులు

● మంత్రి ఆదేశంతో కదిలివచ్చిన ఆర్‌అండ్‌బీ అధికార యంత్రాంగం

మర్రిపూడి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు-పొదిలి ఆర్‌అండ్‌బీ రహదారి మర్రిపూడి చెరువు కట్ట కింద కోనేరుల వద్ద అత్యంత ప్రమాదకరంగా తయారైంది. తుఫాన్‌తో మర్రిపూడి చెరువు పూర్తిస్థాయిలో నిండటంతో కట్ట కింద ఉన్న కోనేరులలోకి సమృద్ధిగా నీటి ఊట చేరింది. 40 ఏళ్ల క్రితం నిర్మించిన రక్షణ గోడలు కూలిపోవడంతో అంచులు విరిగిపడి భారీ వాహనాలు కోనేరులో పడిపోయే ప్రమాదం ఏర్పడింది. ఏ మాత్రం ఆదమరిస్తే ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో శుక్రువారం మర్రిపూడి పర్యటనకు వచ్చిన మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి దృష్టికి పలువురు రోడ్డు దుస్థితిని తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి వెంటనే ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ డీఈ ఆనందరావుని ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా పర్యటనలో ఉన్న ఆర్‌అండ్‌బీ సీఈ శేషకుమార్ మంత్రి ఆదేశాల మేరకు హుటాహుటిన వచ్చి రహదారిని పరిశీలించారు. కోనేరులను పూడ్చేందుకు అంచనాలను రూపొందించాలని అధ్వానంగా ఉన్న టంగుటూరు-పొదిలి రహదారి అభివృద్ధికి సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని సీఈ ఆదేశించారు. తాత్కాలికంగా కుంగిపోయిన రోడ్డుకు మెటల్ డస్టుతో మరమ్మతులు చేయించారు. పడిపోయిన రక్షణ గోడల పక్కనే ఇసుక బస్తాలను ఏర్పాటు చేసి రేడియం స్టిక్కర్లు అతికించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని డీఈ ఆనందరావు తెలిపారు. సీఈ వెంట ఎస్ఈ రవినాయక్, ఈఈ గోపీనాయక్ ఉన్నారు.

9మందికి డిప్యూటీ ఎంపీడీవోలుగా పోస్టింగ్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రేడ్ -1 పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తూ డిప్యూటీ ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి పొందిన 9 మందికి పోస్టింగ్‌లు లభించాయి. ఈ మేరకు కలెక్టర్ పి.రాజాబాబు శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. పి.సాంబయ్య (పొన్నలూరు), సిహెచ్.వెంకటేశ్వర్లు (కనిగిరి), కె.హరిబాబు (ఒంగోలు), జి.రాఘవరావు (తర్లుబాడు), బీవీ జనార్దన్ రాజు (వెలిగండ్ల), యు.అరుణకుమారి (సంతనూతలపాడు), వి.శ్రీనివాసులు (పెద్దారవీడు), జి.స్వర్ణలత (మార్కాపురం), కె.శ్రీధర్‌రావు(చీమకుర్తి)ని డిప్యూటీ ఎంపీడీవోలుగా నియమించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

రాష్ట్రస్థాయి పోటీలకు పలువురు విద్యార్థుల ఎంపిక

ఒంగోలు విద్య, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ హ్యాండ్‌బాల్ రాష్ట్ర జట్టుకు ఒంగోలులోని అపెక్స్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న మహేశ్వరరెడ్డి ఎంపికయ్యారు. స్థానిక డీఆర్‌ఆర్‌ఎం మునిసిపల్‌స్కూలులో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపిన మహేష్‌రెడ్డిని రాష్ట్రజట్టుకు ఎంపిక చేశారు. తెనాలిలో త్వరలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఆయన పాల్గొనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక పాఠశాలలో కరస్పాండెంట్ శివకోటిరెడ్డి, డైరెక్టర్ వాకా రాజశేఖర్ రెడ్డి, పీఈటీ జగదీష్‌లు మహేశ్వరరెడ్డిని అభినందించారు.

వాలీబాల్, హ్యాండ్‌బాల్ పోటీలకు..



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

మద్దిపాడు: పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరులో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ స్కూల్ గేమ్స్ పోటీలకు మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్ జస్ముద్దీన్ ఎంపికైనట్లు హెచ్‌ఎం జి.మాల్యాద్రి శుక్రవారం తెలిపారు. అదేవిధంగా హ్యాండ్‌బాల్ అండర్-17 విభాగంలో జి.అభిరామ్ తెనాలిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. వీరిని ఉపాధ్యాయులు సుబ్బారావు, పీడీలు వనజ, సౌజన్య, చుంచు కళ్యాణి అభినందించారు.

చీమకుర్తి విద్యార్థిని ఎంపిక



నవ్య

చీమకుర్తి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలకు చీమకుర్తి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.నవ్య ఎంపికయ్యారు. శనివారం నుంచి కొవ్వూరులో జరగనున్న పోటీలలో ఆమె ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా నవ్యను, పీడీ స్వరూపావాణిలను హెచ్‌ఎం జి.వీరాస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు.

వైఎస్సార్ విగ్రహంపై వేస్టాయిల్ చల్లడంపై పిర్యాదు

నాగులుప్పలపాడు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరులోని బస్టాండ్ సెంటర్‌లో గల దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహంపై గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం వేస్టాయిల్ చల్లారు. దీంతో వైసీపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు.

వ్యాధులు ప్రబలకుండా కార్పొరేషన్ చర్యలు



త్రోవగుంట వీధుల్లో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య కార్మికులు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వ్యాధులు ప్రబలకుండా కార్పొరేషన్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ఈమేరకు శుక్రవారం కమిషనర్ వెంకటేశ్వరరావు ఆదేశాలతో అన్ని నగరంలోని అన్ని డివిజన్‌లలో బ్లీచింగ్ చల్లడం, కాలువల్లో పూడిక తీత పనులు, అలాగే ఖాళీస్థలాల్లో నీరు నిలిచిన ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వదిలారు. అలాగే దోమల వ్యాప్తి చెందకుండా డివిజన్‌ల వారీగా ఫాగింగ్ పనులు చేపట్టగా, సచివాలయ నర్సింగ్ సెక్రటరీలను బృందాలుగా నియమించి ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. ప్రజల ఆరోగ్య స్థితిగతులను నమోదు చేసుకుని వారికి అసవరమైన మందులను అందజేశారు.

నాణ్యమైన పొగాకు పండించాలి

మద్దిపాడు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యమైన పొగాకును పండించాలని వెల్లంపల్లి వేలం కేంద్రం కార్యనిర్వహణాధికారి కోవి రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక వేలంకేంద్రంలో ఆయన రైతులతో మాట్లాడుతూ తుఫాన్ కారణంగా పొగాకు నారు దెబ్బతిన్నదని చెప్పారు. అందువల్ల రైతులు నాణ్యమైన నారును ఎంచుకోవాలన్నారు. అదేవిధం గా పొగాకు బ్యారన్‌లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. బోర్డు అనుమతి మేరకే పొగాకును పండించాలన్నారు. కార్యక్రమంలో యశ్వంత్ బాబు, నారిపెద్ది వరహాలచౌదరి, రామకోటి రెడ్డి, మండవ గోవిందరాజులు, హర్ష తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం..!

● ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్



కరవదిలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల, పక్కన ఒడా చైర్మన్ రియాజ్

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా పంటపొలాలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అధైర్యపడవద్దని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ భరోసా ఇచ్చారు. శుక్రవారం ఒంగోలు మండల పరిధిలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాలైన వలేటివారిపాలెం, కరవది, గుండాయపాలెం గ్రామాల్లో, గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన వారి వివరాలను అధికారులు సేకరిస్తున్నారన్నారు. అందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. విపత్తు ముప్పును గుర్తించిన సీఎం చంద్రబాబునాయుడు ముందస్తు చర్యలు తీసుకోవడంతోపాటు, అధికారులు, నాయకులతో సమీక్షించడం ద్వారా పెను ముప్పు తప్పిందన్నారు. ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగలేదని, అయితే పంట పొలాలు నీటి మునిగిపోవడం బాధాకరం అన్నారు. వారిని అన్ని విధాలుగా ఆదుకునేందుకు అవసరమైన చర్యలు తీసుంటున్నట్లు తెలిపారు. పంట నష్టాల నివేదికలు ప్రభుత్వానికి పంపి బాధిత రైతులకు నష్టపరిహారం కచ్చితంగా అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఒడా చైర్మన్ షేక్ రియాజ్, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా జరిగాయి. స్థానిక బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గ కన్వీనర్ వైసీ యోగయ్యయాదవ్ ఆధ్వర్యంలో వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా రాష్ట్రసెల్స్ కో కన్వీనర్ నిడమానూరి సూర్యకళ్యాణ చక్రవర్తి, జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు మాట్లాడారు. సర్దార్ వల్లభాయ్‌పటేల్‌ను యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీవీ.శివారెడ్డి, పీవీ.కృష్ణారెడ్డి, మాకినేని అమరసింహ, రాయపాటి అజయ్, దామోదర్, రాజేష్‌వర్మ, కటారి సుధాకర్, ఎ.సంజీవకుమార్, కావూరి వాసు, కిలారు రవి, రాజశేఖర్, డేగ సురేష్, అల్లరి రామయ్య, పి.సత్యవతి, శిరీష, గుర్రం రంగనాథ్ పాల్గొన్నారు.

క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో..

ఒంగోలు విద్య: భారతరత్న సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతి, జాతీయ ఏక్తా దివస్ వేడుకలను శుక్రవారం స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విభాగం, స్టైప్, డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి వికసిత భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో ముందుగా వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా విద్యార్థులు ఐక్యతార్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో క్విస్ విద్యాసంస్థల అధినేత సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ కిషోర్‌బాబు, డీన్ సత్యమెహర్, స్టైప్ సీఈవో శ్రీమన్నారాయణ, రిటైర్డ్ తహసీల్దార్ ఇస్మాయిల్, డాక్టర్ నవనీత్ కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయంలో..

ఒంగోలు కల్చరల్: సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక జిల్లా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ కాళహస్తి సంపూర్ణ ఆధ్వర్యంలో పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధం గా తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 41వ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎ.ప్రసాద్, డీవీ.సుబ్బారెడ్డి, కె.కోటేశ్వరరావు, ఓటీవీ.సుబ్బారావు, బంతికట్ల నాగేశ్వరరావు, డాక్టర్ మధురశ్రీ తదతరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: మద్దిపాడులోని నటరాజ కళా కేంద్రంలో పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. దేవరశెట్టి యలమంద, నేలటూరి సత్యనారాయణ, కాకుమాను సుబ్బారావు, గంగిశెట్టి నరసింహారావు, కటకం వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య, రామాంజనేయులు, ఉండవల్లి సుందరరావు షేక్ మజీద్ తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో వల్లభాయ్‌పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో సురేష్‌బాబు నివాళులర్పించారు.

పశువుల దాణా పంపిణీ



దాణాను అందజేస్తున్న అధికారులు

ఒంగోలు రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ అనంతరం పశువులు వ్యాధులబారిన పడకుండా ఉండేందుకు శుక్రవారం ఒంగోలు మండలం యరజర్లలోని పశుకేంద్రం ఆవరణలో వైద్యశిబిరాన్ని నిర్వహిం చారు. త్రోవగుంట పశువైద్యశాల డాక్టర్ బి.బసవశంకరరావు హాజరై పశువులకు టీకాలు వేశారు. 50శాతం రాయితీపై అర్హులైన పశుపోషకులకు ఐదు మెట్రిక్ టన్నుల సమీకృత దాణాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుండపనేని శ్రీనివాసరావు, పశువైద్యాధికారి వై.భూపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' కొనసాగిస్తూ నిర్ణయం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమాన్ని కొనసాగించాలని నిర్ణయించారు. స్థానిక హైదరీక్లబ్‌లో శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. రాష్ట్ర పరిశీలకుడు ఎస్.లక్ష్మీపతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాజ్‌కుమార్‌లు హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్.సూర్యనారాయణ ఆదేశాల మేరకు సంఘం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలను జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి వివరించారు. ఇక అనుబంధ సంఘాలైన పెన్షనర్స్ విభాగం, మహిళా విభాగం, సచివాలయ, నర్సెస్ విభాగాలు జిల్లాలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు క్రైం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు డీఈ పాండురంగారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్థానిక జడ్పీకాలనీ, కొత్తడొంక, జర్నలిస్టు కాలనీ, సుబ్బయ్యనగర్, మర్రిచెట్టుకాలనీ, ప్రగతినగర్, గాంధీనగర్ ఎక్స్‌టెన్షన్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రత్యేక కాలనీ కోసం వినతి

మద్దిపాడు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలోని రాచవారిపాలెం మాదిగపల్లెకు వరద వచ్చిన ప్రతిసారి ముంపునకు గురవుతోందని, దీంతో కాలనీవాసులు తీవ్ర అగచాట్లు పడుతున్నారని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్ మాదిగ కోరారు. శుక్రవారం ఒంగోలులో కలెక్టర్ రాజాబాబును కాలనీవాసులతో కలిసి సమస్యను వివరించారు. సుమారు 100 కుటుంబాలు ఉన్నాయని, వారికి మెరక ప్రాంతంలో ప్రత్యేకంగా ప్రభుత్వం ఇళ్లస్థలాలను ఇచ్చి ప్రత్యేక కాలనీని ఏర్పాటుచేయాలని కోరారు. ఇందుకు స్పందించిన కలెక్టర్, డీఆర్వో చినఓబులేశుకు పూర్తిస్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను కలిసి కాలనీవాసుల సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీఎస్ ప్రతినిధులు కొలకలూరి విజయ్ కుమార్, పత్రా బంగారం, దూళ్ల అప్పారావు, దుడ్డు వినోద్, కూచిపూడి నాగభూషణం, కూచిపూడి డేవిడ్, లింగయ్య, మరియమ్మ, సుబ్బాయమ్మ, రాయపాటి మణి పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ దాచూరి రామిరెడ్డి స్మారక రెగ్యులర్ ఉచిత వైద్యశిబిరం ఆదివారం స్థానిక నెల్లూరుబస్టాండులోని టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ మాదాల వెంకటరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాచూరి రామిరెడ్డి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో ప్రతిరెండు నెలలకు ఒకసారి నిర్వహించే ఈ శిబిరంలో బీపీ, షుగర్, ఫిట్స్, పక్షవాతం గల రోగులకు రెండు నెలలకు అవసరమైన మందులను కేవలం రూ.200లకే ఇస్తారని, అనుభవంకలిగిన వైద్యులు పాల్గొంటారన్నారు. కొత్తగా వచ్చేవారు వైద్యపరీక్షల నివేదికలతో హాజరుకావాలని కోరారు.

కులం రంగు పులమడం తగదు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలోని దారకంపాడు గ్రామంలో ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన గొడవలో కులం రంగు పులమడం తగదని ఆల్ ఇండియా కాపు ఫెడరేషన్ అధ్యక్షుడు గొర్రెపాటి అర్జునరావు, జనరల్ సెక్రటరీ కత్తి చెన్నకేశవనాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామానికి చెందిన హరిచంద్రప్రసాద్, లక్ష్మీనాయుడు మధ్య ఆర్థికపరమైన లావాదేవీల నేపథ్యంలో ఘర్షణ జరిగిందన్నారు. అయితే కొంతమంది కులం రంగు పులిమి మాట్లాడటం తగదని హితవు పలికారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో ముంపునకు గురైన మోటూరు ఉదయం కాలనీలోని పేదలకు ఏపీ మెప్మా ఆర్పీల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కాలనీలో చెత్తసేకరణ పనులు చేసుకుంటూ పోతురాజు కాలువ కట్టమీద గత 20 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న కాలనీ వాసులకు వాటిని అందజేశారు. కార్యక్రమలో మెప్మా యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.రాజలక్ష్మి, ప్రతినిధులు విజయమ్మ, సుజాత, రమణ, సంధ్యారాణి, కన్వీనర్ టి.మహేష్, తంబి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

3న కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గత నెల 28న జరగాల్సిన ఒంగోలు నగరపాలక సంస్థ పాలకవర్గ సమావేశం మొంథా ముప్పు కారణంగా వాయిదా పడిన విషం తెలిసిందే. అయితే ఆ సమావేశాన్ని ఈనెల 3వ తేదీన మధ్యాహ్నం 3-30 గంటలకు జరుగుతుందని మేయర్ గంగాడ సుజాత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పింఛన్ల నగదు పంపిణీకి సిద్ధం

నాగులుప్పలపాడు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పథకం కింద మండల పరిధిలోని 10,177మంది లబ్ధిదారులకు శనివారం రూ.4,36,64,500 నగదు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎంపీడీవో తేళ్ల రవి కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 1, 3వ తేదీల్లో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు సచివాలయ సిబ్బంది వెళ్లి పంపిణీ చేస్తారని, అందరూ అందుబాటులో ఉండాలని ఆయన కోరారు.

ఘనంగా ఫన్ ఫినిటీ గేమింగ్ వరల్డ్ ప్రారంభం



ఫన్ ఫినిటీ గేమింగ్ వరల్డ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్, చైర్మన్ రియాజ్, రవిశంకర్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రవిప్రియా మాల్‌లో కంది రవిశంకర్ కుటుంబం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫన్ ఫినిటి గేమింగ్ వరల్డ్‌ను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ఒంగోలులో ఏదైనా కొత్తదనాన్ని పరిచయం చేయాలంటే అది కంది రవిశంకర్‌కే సాధ్యమవుతుందని తెలిపారు. ఫన్ ఫినిటి గేమింగ్ వరల్డ్ ఇక్కడ ఏర్పాటు చేయడం శుభపరిణామని, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అనేక ఆటలకు సంబంధించిన ఆర్టికల్స్ ఇక్కడ ఉండటం విశేషమని అభినందించారు. రవిశంకర్ గ్రూప్ ఎండీ కంది రవిశంకర్ మాట్లాడుతూ అనేకరకాల గేమ్స్‌తో పాటు చిన్నపిల్లల బర్త్‌డేలు చేసుకోవాలంటే ఇది అనువైన స్థలమన్నారు. ఒడా చైర్మన్ షేక్ రియాజ్ ఈ సందర్భంగా రవిశంకర్‌ను అభినందించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ, గేమింగ్ వరల్డ్ ఫౌండర్ సీఈవో కంది సాయినాథ్, డైరెక్టర్ కంది విష్ణుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మట్టిగుంట శివాలయం రికార్డులు ఎక్కడ..?

భూముల కౌలు ఆదాయం లెక్కలు చూపని వైనం ● ఈవోపై గ్రామస్థుల ఆగ్రహం



ఈవో శ్రీనివాసరావును ప్రశ్నిస్తున్న గ్రామస్థులు

నాగులుప్పలపాడు,అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మట్టిగుంట గ్రామంలోని శివాలయానికి సంబంధించిన రికార్డులు అప్పగించకపోవడంపై పూర్వపు ఈవో మీనిశెట్టి శ్రీనివాసరావుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శివాలయానికి సంబంధించి కౌలురూపంలో వచ్చిన ఆదాయం, పూజారుల జీతాలు, ఇతర లావాదేవీలపై శుక్రవారం గ్రామంలో సమావేశం జరిగింది. శివాలయాన్ని దేవదాయశాఖ పరిధిలోకి తీసుకొన్నప్పటికి 41.5 ఎకరాల భూమి ఉంది. అప్పటి నుంచి ప్రతి ఏటా సగటున పంట కౌలు సుమారు రూ.10 లక్షలు నుంచి రూ.13 లక్షల వరకు వస్తుందని, ప్రస్తుతం పూజారులకు జీతభత్యాలు చెల్లించలేని పరిస్థితి నెలకొనడానికి కారణం ఏమిటని ప్రస్తుత ఈవో కె.శ్రీనివాసరావును గ్రామస్థులు నిలదీశారు. దీంతో ఆయన మాట్లాడుతూ తాను బాధ్యతలు చేపట్టే నాటికి గత 15 ఏళ్ల నుంచి ఇక్కడ ఈవోగా పనిచేసిన మీనిశెట్టి శ్రీనివాసరావు రూ.2.90 లక్షలు జమ చేసి, తర్వాత వసూలు చేసిన రూ.2.22 లక్షలతో కలిపి రూ.5లక్షలు ఖర్చు చేసినట్లుగా తెలిపారని పేర్కొన్నారు. దాంతో దేవాలయ రికార్డులను చూపించాలని గ్రామస్థులు కోరగా పూర్వ ఈవో శివాలయానికి సంబంధించిన 10 రికార్డులను తనకు అప్పగించలేదని చెప్పారు. గత 15 ఏళ్ల నుంచి సుమారు రూ.70లక్షల దేవుడి సొమ్ము లెక్కలు చూపకుండా, రికార్డులు అప్పగించకుండా తప్పించుకున్న తిరుగుతున్న గత ఈవో శ్రీనివాసరావు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి పూర్వపు ఈవోపై చర్యలు తీసుకొని మట్టిగుంట శివాలయం ఆదాయ నిర్వహణ సక్రమంగా జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ చీడల హనుమంతరావు, బండారుపల్లి సురేష్, చెన్నుపాటి శరత్, జాలాది ఆంజనేయులు, జాగర్లమూడి రవి పాల్గొన్నారు.

నిర్వాసితులకు సాయం అందజేత

సంతనూతలపాడు, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనిమిది పునరావాసకేంద్రాల్లో తలదాచుకున్న నిర్వాసితులకు శుక్రవారం రూ.6.75లక్షలను తక్షణ సాయంగా అందజేసినట్లు తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని గంగవరంలో 2, మైనంపాడులో 1, పి.తక్కెళ్లపాడులో 1, పేర్నమిట్టలో 2, పి.గుడిపాడులో 1, కొనగానివారిపాలెంలో 1 తుఫాన్ బాధిత శిబిరాలు ఉన్నాయన్నారు. వాటిలో 819మంది బాధితులకు నగదును, నిత్యావసర సరుకులను అందజేసినట్లు ఆయన చెప్పారు.

- పి.తక్కెళ్లపాడు పునరావాస కేంద్రంలో ఉన్న 11 కుటుంబాల తుఫాన్ బాధితులకు శుక్రవారం టీడీపీ సీనియర్ నేత కుంచాల రాజు నిత్యావసర వస్తువులు, కూరగాయలు, దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ బాధితులకు తన వంతు సాయం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు బి.చలపతిరావు, ఎస్.శ్రీను, కె.చిరంజీవి, విజయ్, వందనం పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : రిమ్స్ శానిటేషన్ వర్కర్స్‌నగర ముఠా వర్కర్స్ యూనియన్ల ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులో ఏఐటీయూసీ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సుభాన్‌నాయుడు, కొత్తకోట వెంకటేశ్వర్లు, ఎస్‌డీ.సర్దార్, శ్రీరామ్ శ్రీనివాసులు, సీహెచ్.వెంకటేశ్వర్లు, వెంకట్రావు, హనుమయ్య పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే సరైన గుర్తింపు



బదిలీపై వెళ్తున్న వారిని సన్మానిస్తున్న సహోద్యోగులు

మార్కాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తే సరైన గుర్తింపు లభిస్తుందని వయోజన విద్య విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎ.వీరారెడ్డి, సాధన డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.మధుసూదన్‌లు అన్నారు. స్థానిక ఆకాశవాణి కేంద్రంలో శుక్రవారం బదిలీపై విజయవాడ కేంద్రానికి వెళ్తున్న ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌లు పి.ప్రశాంత్‌కిరణ్, జి.దివ్యలకు వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారి తో కలిసి పనిచేసిన సహ ఉద్యోగులు అనుభూతులను పంచుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు, పలువురు కళాకారులు, కవులు వారిని సన్మానించారు.

అధ్వానంగా శివారు కాలనీల రోడ్లు

మురుగు, వర్షం నీటితో బురదమయం



నల్లబండ బజారులో వర్షం, మురుగు నీటితో నిండిన రోడ్డు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు ప్రాంతాలలో పలు కాలనీలకు వెళ్లే రహదార్లు అధ్వానంగా మారాయి. వర్షం పడిందంటే మోకాలి లోతులో వర్షం నీరు చేరి గుంతలమయంగా మారుతున్నాయి. దీనికితోడు ఇళ్లలోని మురుగు నీరు కూడా వచ్చి అందులో చేరడంతో దుర్వాసన వెదజల్లుతున్నది. పట్టణ శివారులోని మిలటరీ క్యాంటిన్‌కు వెళ్లే పద్మావతి నగర్‌లో కొన్ని నెలల క్రితం మున్సిపల్ అధికారులు రోడ్డు వేసినప్పటికీ బురదమయంగా మారింది. ఈప్రాంతంలో మాజీ సైనిక, సైనిక ఉద్యోగులకు ఏర్పాటు చేసిన క్యాంటిన్ ఉండడం అక్కడకు వెళ్లే వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే నల్లబండ బజారులోని పలు కాలనీలు మరీ అధ్వానంగా మారాయి. నాయిబ్రాహ్మణ కాలనీకి వెళ్లే ప్రాంతంలో ఇళ్ళలోని మురుగునీరంతా రోడ్లపైకి చేరి ఆప్రాంతంలో పందులు, పశువులకు నిలయంగా మారింది. పారిశుధ్యం క్షీణించడంతో దోమలు విపరీతంగా పెరిగాయి. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆప్రాంతవాసులు పేర్కొంటున్నారు. అలా గే పాములపల్లె వెళ్లే బృందావన కాలనీ వద్ద కూడా నిత్యం మోకాలిలోతు వర్షం నీరు ఉంటుందని, వర్షంపడిన సమయాలలో వారం పదిరోజులు ఆనీటి లో నుంచే వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆప్రాంత ప్రజలు, పాములపల్లె గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చొరవ చూపి శివారు ప్రాంత రోడ్లను అభివృద్ధి పరచాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



మిలటరీ క్యాంటిన్‌కు వెళ్లే రహదారి



బహుమతులు సాధించిన విద్యార్థినులు

చదువుతోపాటు ఆటలలోనూ రాణించాలి

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు ఆటలలోనూ రాణించాలని సాయి బాలాజీ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ మస్తాన్ వలి అన్నారు. స్థానిక సాయి బాలాజీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు మార్కాపురంలో జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీలలో ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించిన మస్తాన్ వలి మాట్లాడుతూ.. యోగా అండర్-17లో ఉదయ కార్తి, అండర్-14లో లతిక, చదరంగం అండర్-14లో దివ్య శ్రీ, దీపిక, షటిల్ అండర్-14లో సుష్మా, అండర్-17లో త్రిభువనశ్రీలు, బ్యాడ్మింటన్ అండర్-17లో అభిలాష్, ముస్తకీమ్‌లు ఎంపియ్యారని తెలిపారు.

ఖాజీగా మహమ్మద్ జుబేర్ నియామకం

ఎర్రగొండపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం ముస్లిం ప్రభుత్వ ఖాజీగా షేక్ మౌలానా మహమ్మద్ జుబేర్‌కు శుక్రవారం టీడీపీ కార్యాలయంలో నియామకపత్రాన్ని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అందజేశారు. టీడీపీ ప్రభుత్వం ముస్లింల సంక్షేమం కోరుకుంటుందని ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు అన్నారు.ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

రేపు సామూహిక రుద్ర పూజ

గిద్దలూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరామకృష్ణ ధ్యాన మందిరం ఆవరణలో ఈనెల 2వ ఉదయం 7గంటల నుంచి కార్తీక మాస సామూహిక రుద్రపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ యోగా గురూజీ బి.ఎస్.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం..

రైతులకు ఎరిక్షన్‌బాబు భరోసా



రైతులతో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి):అధైర్యపడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు రైతులకు భరోసా ఇచ్చారు. మండలంలోని కటకాని పల్లె గ్రామంలో తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులతో శుక్రవారం మాట్లాడారు.ప్రధానంగా వర్షానికి మించి వరదనీరు పోటెత్తి ఫీడర్ కెనాల్‌కు గండ్లు పడి పంట పొలాలపై ప్రవహించడంతో సాగు చేసిన పంటలతో పాటు నేల కూడా కోతకు గురయ్యిందని, గ్రామానికి చెందిన దూదేకుల రసూల్ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలుసుకుని సముదాయించారు. ప్రకృతి విపత్తుకు చాలా ఇబ్బందులు పడ్డామని అంతమాత్రం చేత అఘాయిత్యాలు చేసుకోకూడదని అన్నారు. ప్రభుత్వం రైతులకు న్యాయం చేసేందుకు అధికారులను గ్రామాలకు వెళ్లి పరిశీలించి అంచనాలు తయారు చేయాలని ఆదేశించిందన్నారు.సమగ్ర సర్వే అనంతరం నష్ట పరిహారం చెల్లింపులు జరుగుతాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవో జవహర్ లాల్ నాయక్, వీఆర్‌వో నాగేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు షేక్ మాబు, నాయకుడు దొడ్డా శేషాద్రి, రావెళ్ల సత్యనారాయణ, వై.బాబు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

మార్కాపురం రూరల్: తుఫాన్‌కు పంట నష్టపోయిన రైతులు అధైర్య పడకుండా ఉండాలని, ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ నాయకుడు శేఖర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మండలంలోని బోడపాడు, జమ్మనపల్లి గ్రామాలతో పాటు పలు గ్రామాలలో టీడీపీ, బీజేపీ నాయకులు దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ అధికారులతో కలసి శుక్రవారం పరిశీలించి రైతులకు ధైర్యాన్ని చెప్పారు. తుఫాన్ ప్రభావంతో పంటలను నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం అండగా ఉండి నష్ట పరిహారాన్ని అందిస్తుందని తెలిపారు. తప్పనిసరిగా పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఈ క్రాప్ చేయించుకుని ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటమే లక్ష్యం

మార్కాపురంలో రన్‌ఫర్ యూనిటీ ర్యాలీ



పొదిలిలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ రాజేష్‌కుమార్

మార్కాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటమే ప్రధాన లక్ష్యమని మార్కాపురం సీఐ పి.సుబ్బారావు అన్నారు. జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి శుక్రవారం పట్టణంలో రన్ ఫర్ యూనిటీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక టౌన్ పోలీసు స్టేషన్ వద్ద కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఐ సుబ్బారావు మాట్లాడారు. అనంతరం ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఎస్వీకేపీ కాలేజీలో అందరితో ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాల్లో టౌన్, రూరల్ ఎస్సైలు ఎం.సైదుబాబు, పి.అంకమ్మరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తర్లుపాడులో..

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు పంచాయతీ లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటాలతో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు షేక్ మౌలాలి , ఉపాధ్యాయురాలు అలివేలు కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో..

ఎర్రగొండపాలెం: వల్లబాయ్‌పటేల్ జయంతిని స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పాల్గొని వ రాట్లాడగా టీడీపీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

ఐక్యతే మహాబలం

పొదిలి : ప్రతి ఒక్కరు ఐక్యతతో ఉంటే ఎంతటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని సీఐ రాజేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి పెద్దబస్టాండ్ వరకు కళాశాల విద్యార్థులతో రన్‌ఫర్ యూనిట్ కార్యక్రమం నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేశారు. ఎస్ఐ వేమన, కొనకనమిట్ల ఎస్ఎస్ బి. శ్రీకాంత్, ఏఎస్ఐ సత్యనారాయణ, కాజేజి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

గిద్దలూరు టౌన్ : బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జేవీనారాయణ సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆపార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెంలో 2కే రన్

ఎర్రగొండపాలెం: ఎర్రగొండపాలెంలో సీఐ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం 2 కే రన్ ర్యాలీ నిర్వహించారు. సర్దార్ వల్లబాయ్ పటేల్‌కు ఘనంగా నివాళులు తెలిపారు. ప్రధాన సెంటరులో పోలీసులు మానవహారం నిర్వహించారు.

ఉక్కు మనిషికి నివాళి

పుల్లలచెరువు :స్వాతంత్ర్య సమరయోధుడు,ఉక్కుమనిషి సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి సందర్భంగా పుల్లలచెరువు పోలీసులు ఘనంగా నివాళులు అర్పించారు. ఎస్ఐ ఎల్ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో 2కె రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దోర్నాలలో..

పెద్దదోర్నాల :స్థానిక పోలీసుస్టేషన్, ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేశ్ ఆధ్వర్యంలో పటేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కార్మిక సమస్యల పరిష్కారమే ఏఐటీయూసీ ధ్యేయం

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కార్మిక సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాడే కార్మిక సంఘం ఏఐటీయూసీ అని జిల్లా కార్యదర్శి షేక్ కాశీం అన్నారు. ఏఐటీయూసీ 106వ వ్యవస్థాపక దినోత్సవాన్ని విశ్వేశ్వర రిక్షా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు.

జగదాంబకు ప్రత్యేక పూజలు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని మార్కాపురం పట్టణంలోని జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం జగదాంబకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై పూజలు చేశారు.

ఎన్జీవో సంఘం నూతన కార్యవర్గం

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీవో హోమ్‌లో మార్కాపురం తాలుకా ఎన్జీవో సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా బీవీ శ్రీనివాసశాస్త్రి, కార్యదర్శిగా జె.రవికిరణ్, మహిళా జాయింట్ సెక్రటరీగా జి.సరస్వతి ఎన్నికయ్యారు.

మాజీ ఎమ్మెల్యే 'పిడతల' జయంతి

గిద్దలూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాజీ ఎమ్మెల్యే పిడతల విజయ్‌కుమార్‌రెడ్డి జయంతిని శ్రీవివేకానంద విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శ్రీవివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.పోలిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.మురళీకృష్ణ, వృద్ధాశ్రమం నిర్వాహకులు రాజశేఖర్, పలువురు లెక్చరర్లు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వృద్ధుడికి తీవ్ర గాయాలు

తర్లుపాడు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నంద్యాల నుంచి గుంటూరు వెళ్తున్న రైలు నుంచి తర్లుపాడు రైల్వేస్టేషన్‌లో వృద్ధుడు జారిపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వృద్ధుడు రైలు వాకిట్లో కుర్చొని కదులుతున్న సమయంలో కిందపడిపోయినట్లు తెలిపారు. క్షతగాత్రుడిని 108 వాహనం ద్వారా మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. ఆ వృద్ధుడు తమిళనాడుకు చెందిన వాసిగా పోలీసులు గుర్తించారు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో ఒంగోలు రిమ్స్‌కు పంపించారు.

ఇరిగేషన్ నిర్వీర్యం

గత వైసీపీ పాలనలో..

▸ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ధ్వజం

▸ పెద్దచెరువు, గొల్లపల్లి, నాగులచెరువుల పరిశీలన



కనిగిరి చెరువు అలుగువాలు రివెట్‌మెంట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ వ్యవస్థను గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ధ్వజమెత్తారు. పట్టణంలోని కనిగిరి పెద్ద చెరువు అలుగు లీకులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో ఇరిగేషన్ చెరువులు దెబ్బతిన్నాయన్నారు. మండలంలోని గొల్లపల్లి చెరువు మరమ్మతులను తూతూమంత్రంగా నిర్వహించి కోట్లాది రూపాయలను వైసీపీ నేతలు దిగమింగారని ఆరోపించారు. ఫలితంగా, తుఫాన్ విపత్తు సమయంలో లీకుల నుంచి వరద నీటి ఉధృతి పెరిగి ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. కనిగిరి పెద్దచెరువు నుంచి అలుగు రివెట్‌మెంట్ పగిలి పోవటంతో చెరువు నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించిదన్నారు. వర్షం ఆగిపోయినా కూడా గత రెండు రోజులుగా నీరు వృథాగా పోతుండటంతో రివిట్‌మెంట్ వద్ద తాత్కాలిక మరమ్మతులు చేయించి నీటిని ఆపగలిగామన్నారు. నాగులచెరువు చెరువు నుంచి స్వల్పంగా నీరు బయటికి వెళ్తుందని తెలిపారు. దీనిని బాగుచేయించి ప్రజల ఇబ్బందులను తొలగిస్తామన్నారు. ఇరిగేషన్ చెరువులకు చేపట్టాల్సిన పనులు, మరమ్మతులకు అవసరమైన నిధుల వివరాలు, తగిన ప్రణాళికతో సీఎం చంద్రబాబుకు విన్నవించి నిధుల సమీకరణకు కృషి చేస్తామన్నారు. కాగా, ఇటీవల తుఫాను కారణంగా నష్టపోయిన బాధిత కుటుంబాలకు శంఖవరం గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చేతులమీదుగా నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చాకిరాల గ్రామంలో సబ్సిడీపై శనగ విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొగాకు సాగుతో పాటు అంతర పంటల సేద్యం చేసుకుంటే మేలు చేకూరుతుందన్నారు. కనిగిరి ప్రాంతం వర్షాభావ ప్రాంతం కావటంతో రైతులకు మేలు చేకూర్చేందుకే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సహకారంతో కనిగిరి ప్రాంతంలో రిలయన్స్ బయోగ్యాస్ కంపెనీ ఏర్పాటుకు పనులు జరుగుతున్నాయన్నారు. కంపెనీ ఏర్పాటుతో కనిగిరి ప్రాంతంలోని మెట్ట, కొండపోరంబోకు, బీడు భూములకు కూడా ఆదాయం సమకూర్చునేందుకు వీలుందన్నారు. రిలయన్స్ సంస్థ మన భూములను లీజుకు తీసుకుని ఎకరాకు రూ.31వేలు అందిస్తున్నట్టు చెప్పారు. తుఫాన్ కారణంగా ట్రీమెన్ కమిటీ ఏర్పాటుకు బ్రేక్ పడిందన్నారు. రానున్న రోజుల్లో ఆప్రక్రియను కూడా కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు. గ్రామకంఠం భూములను కూడా రిలయన్స్ సంస్థకు ఇస్తే ఆ వచ్చే నగదును గ్రామ పంచాయతీకి జమ చేయటం జరుగుతుందన్నారు. దీంతో గ్రామంలో అన్ని వసతులు ఏర్పరుచుకోవచ్చునని చెప్పారు. కనిగిరి ప్రాంత అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఏడీఏ జైనులాబ్దిన్, తహసీల్దార్ జయలక్ష్మి, ఎంపీపీ ప్రకాశం, కందురు తిరుపతిరెడ్డి, పిచ్చాల శ్రీనివాసరెడ్డి, కొండాకృష్ణారెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు, బాలు ఓబులురెడ్డి, షేక్ ఫిరోజ్, వై.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న అప్రోచ్ రోడ్డుకు మరమ్మతులు

తాళ్లూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు దోసకాయలపాడు- తోటవెంగన్నపాలెం మార్గంలో కొట్టుకుపోయిన దోర్నపువాగు చట్టా అప్రోచ్ రోడ్డుకు శుక్రవారం మరమ్మతులు చేపట్టారు.

ఇటీవల కురిసిన వర్షాలకు దోర్నపువాగు ఉధృతంగా ప్రవహించడంతో చప్టా ఇరువైపులా అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో గత నాలుగు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. దర్శి మార్కెట్ కమిటీ డైరెక్టర్ నల్లపాటి సత్యనారాయణ చప్టాకు ఇరువైపులా మట్టితోలి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మరమ్మతులు చేయించారు. ఎంపీడీవో పి.అజిత చప్టా వద్ద జరుగుతున్న అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మెలకయ్య, కూటాల రవి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

పీసీపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 60కుటుంబాలలోని ప్రజలు పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందారు. పెదయిర్లపాడు, మురుగుమ్మి, చింతగుంపల్లి, పీసీపల్లి, నేరేడుపల్లిలోని కేంద్రాలలో ఉన్న బాధితులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసిన నిత్యావసర సరుకులను శుక్రవారం తహసీల్దా ర్ సీహెచ్ ఉష పంపిణీ చేశారు. అలాగే, ప్రభుత్వం ప్రకటించిన ఆర్థికసాయాన్ని అందజేశారు.

పామూరు: పునరావాస బాధితులకు శుక్రవారం దూబగుంట గ్రామంలో తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు నిత్యావసర సరుకులు, నగదు పంపిణీ చేశారు. మండలంలో ఆరు పునరవాస కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: పునరావాస కేంద్రంలో ఉన్న 11 కుటుంబాలకు శుక్రవారం సాయంత్రం నిత్యావసర సరుకులు, నగదును తహసీల్దార్ ఎల్.లక్ష్మీ నారాయణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మేదరమెట్ల నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చందలూరు విద్యార్థి

దర్శి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న ఎం.ప్రేమ్‌కుమార్ రాష్ట్రస్థాయి అండర్ 17 హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఒంగోలులోని ఏబీఎం జూనియర్ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రేమ్‌కుమార్ విశేష ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రేమ్‌కుమార్‌ను ప్రధానోపాధ్యాయుడు గురుప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఆంజనే యులు, పాఠశాల ఛైర్మన్ బాలనర్సింహులు, ఉపాధ్యాయులు అభినందిం చారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

తాళ్లూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎంపీడీవో పి.అజిత అన్నారు. శుక్రవారం మండలంలోని దోసకాయలపాడు సచివాలయాన్ని ఆమె సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే ప్రతి సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో దర్శి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎన్.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి మెలకయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే, తాళ్లూరు పంచాయతీ పరిధిలోని కొత్తపాలెం ప్రాథమిక పాఠశాల పరిసరాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో అజిత పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్ షహనాజ్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

జాతి సమైక్యతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

కనిగిరి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జాతి సమైక్యతకు ప్రతిఒక్కరూ పాటుపడాలని డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్ అన్నా రు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జాతీయ సమైఖ్యతా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని రన్‌ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత జాతి గర్వించేవిధంగా పటేల్ చేసిన సంస్కరణలు నేటికి ఆచరణలో ఉన్నాయంటే ఆయనకు దేశం పట్ల ఉన్న భక్తి రుజువు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐ ఖాజావలి, ఎస్ఐ శ్రీరాం, మున్సిపల్ ఛైర్మన్ గఫార్, మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దొనకొండ: సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తిగా దేశం కోసం యువత పాటుపడాలని ఏఎస్ఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మాజీ ఉపప్రధాని పటేల్ జయంతి సందర్భంగా శక్రవారం విద్యార్థులతో మార్కాపురం వెళ్లే ప్రధాన రహదారిలో 2కే రన్ నిర్వహించారు.

పామూరు: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం పామూరులో జాతీయ ఐక్యతా దినోత్సవం ర్యాలీ కార్యక్రమాన్ని సీఐ ఎంభీమానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల ఎస్ఐలు టి.కిశోర్‌బాబు, ఎం.వెంకటేశ్వరనాయక్, కృష్ణ పావని, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల రాకపోకల పునరుద్ధరణ

తాళ్లూరు,అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రవాహం తగ్గి వాగుల ఉధృతి తగ్గటంతో ఎస్సై సింగంశెట్టి మల్లికార్జునరావు శుక్రవారం నుంచి తాళ్లూరు- విఠలాపురం, తాళ్లూరు- మల్కాపురం మార్గంలో వాహనాల రాకపోకలు పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. చప్టాలవద్ద అడ్డుగా వేసిన ముళ్ల కంపను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు

కనిగిరి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రామిక, కార్మిక వర్గాల శ్రేయస్సే లక్ష్యంగా ఏఐటీయూసీ కృషి చేస్తుందని ఆసంఘం జిల్లా అధ్యక్షుడు యాసిన్ అన్నారు. ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ వేడుకలను శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు వై.రవీంద్రబాబు, నాసర్‌వలి, గుజ్జుల బాలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'సైన్స్ ఎక్స్‌పోజర్'కు ఆదర్శ విద్యార్థిని ఎంపిక

ముండ్లమూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మారం శ్రావణి అనే విద్యార్థిని సైన్స్ ఎక్స్‌పోజర్ ట్రిప్‌కు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరావు తెలిపారు. నవంబరు 25న విజయవాడ నుంచి ఇండిగో విమానంలో న్యూఢిల్లీ వెళ్లి, అక్కడి సైన్స్ మ్యూజియంలను సందర్శిస్తారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా నుంచి ఇద్దరు ఎంపిక కాగా, అందులో శ్రావణి ఒకరని తెలిపారు.

దర్శి పట్టణాభివృద్ధే లక్ష్యం

▸ మున్సిపల్ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ పిచ్చయ్య, పాల్గొన్న కమిషనర్ మహేశ్వరరావు, కౌన్సిలర్లు

దర్శి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మున్సిపల్ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న లోతట్టు ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పట్టణంలో ఇబ్బందికరంగా మారిన జోమ్ కాలువ, కాటేరు వాగుల ఆక్రమణలను తొలగిస్తామన్నారు. వీటిని అభివృద్ధిపర్చి భవిష్యత్తులో నివాస ప్రాంతాల్లోకి నీరురాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మురుగు కాల్వల నిర్మాణం, కాలువల్లో పూడికతీత పనులకు వెంటనే అంచనాలు తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని, బ్లీచింగ్ చల్లాలని ఆయన ఆదేశించారు. దర్శి ఏఎంసీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన దారం నాగవేణి తన 19వ వార్డు కౌన్సిలర్ సభ్యత్వానికి చేసిన రాజీనామాను సమావేశం ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

దొనకొండ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని గంగదేవిపల్లి గ్రామంలో దెబ్బతిన్న పత్తి, పొగాకు పంటలను శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన పంటలు చేతికొచ్చే సమయంలో తుఫాన్‌తో దెబ్బతిన్నాయన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ బొరిగొర్ల ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

16 అడుగులకు చేరిన మోపాడు నీటిమట్టం

పామూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు మండలంలోని మోపాడు రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరిగింది. గతంలో 9 అడుగులు ఉండగా, ప్రస్తుతం 16 అడుగులకు చేరిం ది. తద్వార లక్ష్మీనరసాపురం, మోపాడు, తూర్పుకట్టకిందపల్లి, బొట్లగూడూరు, అయకట్టుదారులు వరిపైరు సాగుచేసేందుకు అనుకూలంగా మారింది. రిజర్వాయర్ పూర్తి నీటిమట్టం 29 అడుగులు. 20 అడుగులు చేరితే రిజర్వాయర్ పరిధిలోని పూర్తి ఆయకట్టులో వరి సాగుచేసేందుకు అవకాశం కలుగుతుంది.

పొలాల్లో వర్షపునీరు నిల్వలేకుండా చూడాలి

తాళ్లూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పొలాల్లో నిలిచిన నీటిని బయటకు వెళ్లగొట్టి పంటలను కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు అన్నారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన పంటలను శుక్రవారం పలుగ్రామాల్లో ఆయన పరిశీలించారు. నీటి నిల్వవల్ల తెగుళ్ల ఉధృతి పెరుగుతుందన్నారు. ఈసందర్భంగా రైతులకు పలుసూచనలు చేశారు. కాగా, ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా కోతకు వచ్చిన నేలవాలింది. కొత్తపాలెం, తాళ్లూరు, తదితర గ్రామాల్లో విత్తనాలు మొలకెత్తాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

6లో..

ఉబికి వస్తున్న కన్నీరు



మగ్గాల గుంతల్లోకి ఉబికి వచ్చిన ఊటనీరు..

ఎలా బతకాలో అర్థం కావడం లేదు



వర్షాల వల్ల నాలుగు నెలలుగా పని చేయలేకపోతున్నాం. నెలకు రూ.5వేల పని కూడా సాగడం లే దు. దీంతో అప్పులు చేయాల్సి వ స్తోంది. తుపానుతో మొత్తం పరిస్థితి తలకిందులైంది. ఏం చేయాలో పాలుపోవడం లేదు.

వెంకటేశ్వర్లు, తోటవారిపాలెం

ప్రభుత్వం ఆదుకోకపోతే కష్టమే



తుపాను కారణంగా మగ్గం గుంతల్లోకి నీరు చేరింది. ఆ నీరు ఇంకడానికి కనీసం రెండు, మూడు నెలలు పడుతుంది. ఇప్పటికే నాలుగు నెలలుగా పనులు లేవు. ఇంకో మూడు నెలలు పనులుండవు. పడుగు, పేకలు పాడైపోతాయి. ప్రభుత్వం సా యం చేయకపోతే బత కడం కూడా కష్టమే.

- అవ్వారు కుమార్, చంద్రమౌళి నగర్

- నిండా మునిగిన నేతన్న!
- వర్షాలకు ఆగిన మగ్గం
- ఊటెక్కిన మగ్గం గుంతలు
- పనులు లేక పస్తులతో జీవనం
- మొంథా తుపానుతో మరింత దిగజారిన వైనం
- ప్రభుత్వ చేయూత కోసం నేతన్నల చూపు

చీరాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కిందటి నెల కురిసిన వర్షాలకు ఆగిన మగ్గం మొంథా తుపాను ధాటికి మరో నెలరోజుల వరకూ కదిలే పరిస్థితి లేకుండా పోయింది. రెక్కాడితేగానీ డొక్కాడని నేతన్నల బతుకులు కకావికలమయ్యాయి. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు పీకల్లోతు కష్టాల్లో మునిగిపోయిన చేనేత కార్మికులను మొంథా తుపాను పూర్తిగా ముంచేసింది.



25 వేల కుటుంబాలపై ప్రభావం

చేనేత మనుగడ సాగించాలంటే వాతావరణం సమతుల్యంగా ఉండాలి. ఎండలు మండినా, వానలు కురిసినా చేమగ్గం ఆగిపోతుంది. ఈ ఏడాది వర్షాల తాకిడికి (మిగతా 6వ పేజీలో)

ఉపాధి లేక..అప్పుల పాలు

ఇప్పటికే నెలల తరబడి పనులు కోల్పోయి అల్లాడుతున్న చేనేత కార్మికులకు తుపాను దెబ్బ శరాఘాతంగా పరిణమించింది. కనీస ఆదాయం కూడా పొందలేని సగటు చేనేత కుటుంబాలు కొంత కాలంగా అర్ధాకలితో అల్లాడుతున్నాయి. అప్పులపాలవుతున్నాయి. ఈ పరిస్థితి నుంచి నేతన్నలు బయటపడాలంటే ప్రభుత్వం నుంచి వారికి సహాయం అందాలి. లేదంటే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంది.



సీతానగరం రైల్వే బ్రిడ్జి వద్ద వరద ఉధృతి

ఉధృతంగా కృష్ణమ్మ

- బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక
- 69 గేట్లు ఎత్తి 4.56 లక్షల క్యూసెక్కులు విడుదల

తాడేపల్లి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల కారణంగా ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలతో కృష్ణానదిలో ప్రవాహం ఉధృతంగా ఉంది. ప్రకాశం బ్యారేజి వద్ద వరద భారీగా పెరిగింది. పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర వాగుల నుంచి శుక్రవారం 4లక్షల 56 వేల 400 క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్ వద్దకు చేరింది. వరద ఉధృతి 4 లక్షల క్యూసెక్కులు దాటడంతో బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. బ్యారేజి రిజర్వాయర్‌లో 13.1 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా మొత్తం 69 గేట్లను ఎత్తి దిగువకు అంతే నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. వరద అంతకంతకూ పెరుగుతుండడంతో దిగువన నదీ తీరప్రాంతవాసులు, లంక భూముల రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

వీడని ముంపు

- మూడు రోజులుగా నీటిలోనే పొలాలు
- పంటలను కాపాడుకునే యత్నాల్లో రైతులు
- క్షేత్రస్థాయిలో నష్టం నమోదు ప్రక్రియ ప్రారంభం
- పరిహారానికి అడ్డంకిగా మారిన సాంకేతిక సమస్యలు



రేపల్లె: లంకెవానిదిబ్బలో నీటమునిగిన వరి ఓదెలను చూపెడుతున్న రైతులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): అనేక ఒడి దుడుకులను అధిగ మించి సాగు చేసిన పంట లను మొంథా తుఫాన్ ముంచేసింది. చేతికి అందే దశ లో భారీ వర్షాలు.. రైతుల ఆశలను చిదిమేశాయి. తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో పొలాలు ముంపునకు గురయ్యాయి. గురు, శుక్రవారాల్లో ఎండ తీవ్రంగా కాసింది. అయితే పొలాలను ముంపు వీడలేదు. మూడు రోజులుగా నీటిలోనే పంటలు నానుతున్నాయి. చెరువులను తలపిస్తోన్న పొలాలను చూసి రైతులు బోరుమంటున్నారు. వీడని ముంపుతో అంతో ఇంతో పంట చేతికి వస్తుందని ఉన్న మిణుకు మిణుకు ఆశలు కూడా ప్రస్తుతం ఆవిరయ్యాయని రైతులు కన్నీటి పర్యంత మవుతున్నారు. రైతన్నకు వచ్చిన పెను కష్టానికి మొం థా విపత్తు ఓ కారణమైతే వ్యవస్థల నిర్లక్ష్యం మరో కారణం గా కనిపిస్తోంది. తుఫాన్ తీవ్రత తగ్గి మూడు రోజులైనా ఇంకా పొలాలు తటాకాలను తలపించడం వెనుక అనేక కాల్వలకు గండ్లు పడడమే కారణంగా నిలిచింది. పంట కాల్వలతో పాటు డ్రెయినేజీల్లో తూటుకాడ, గుర్రపు డెక్క తొలగించే పనుల విషయంలో అనేక ప్రాంతాల్లో నామమాత్రమే. కట్టల పటిష్టత ప్రకటనలకే పరిమితమైంది. ఈ పరిస్థితుల్లో అన్నదాతల రెక్కల కష్టం నీటిపాలైంది. అదే కాల్వలు బాగు చేసి ఉంటే పొలాల్లోని నీరంతా వెళ్లిపోయి.. కొంతైనా పంట చేతికి అంది ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా లేకపోవడంతో పంటంతా నీటిపాలైంది.

సాయం చేస్తేనే గట్టెక్కుతారు..

రెక్కల కష్టం నీటిపాలై.. అప్పులు కళ్ల ముందు కనిపిస్తోన్న తరుణంలో రైతులు ప్రభుత్వం అందించే సాయం కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ఇందులోనూ అనేక ప్రతిబంధకాలు రైతుకు శాపంగా మారనున్నాయా అనే సందేహాలు వెంటాడుతున్నాయి. ముఖ్యంగా ఈ-క్రాప్ నమో దు పూర్తి స్థాయిలో జరగలేదు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత నష్ట పరిహారం పొందేందుకు వివరాలను ఏపీ ఎయిమ్స్ యాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం సూచిస్తోంది. అయితే ఇందుకు తొలుత ఈ క్రాప్ తప్పనిసరి అన్న నిబంధన ఉంది. ఇక సీసీఆర్సీ (మిగతా 6వ పేజీలో)



బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న మంత్రి సత్యప్రసాద్

48 మందికి రూ.82.67 లక్షలు పంపిణీ

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన మంత్రి అనగాని

రేపల్లె, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వైద్య ఖర్చుల నిమిత్తం పేదలు అప్పులు పాలు కాకుండా ఉండాలని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సకాలంలో నగదు మంజూరు చేస్తున్నట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. శుక్రవారం నియోజకవర్గంలోని 48 మంది బాధితులకు సీఎంఆర్ఎఫ్, ఎల్‌వోసీ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న 48 మందికి రూ.82 లక్షల 67 వేలు మంజూరైనట్లు తెలిపారు. 15 నెలల్లో సీఎంఆర్ఎఫ్ ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాల వారికి రూ.16 కోట్లు అందించిన ఘనత చంద్రబాబునాయుడిదన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, అనగాని శివప్రసాద్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కర రావు, తాతా ఏడుకొండలు, కొలసాని రాము, పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



పోలీసులతో కలిసి ర్యాలీ చేస్తున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

రక్తదానం అందరి బాధ్యత

- పోలీసు అమరవీరుల సంస్మరణలో ఎస్పీ
- బాపట్లలో కొవ్వొత్తుల ర్యాలీ.. మానవహారం

బాపట్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా బాపట్ల రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ ఫంక్షన్ ప్లాజాలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పోలీసులతో పాటు యువత పెద్దసంఖ్యలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానం అవుతుందన్నారు. దేశంలో రక్తనిల్వలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి శస్త్రచికిత్సల సమయంలో రక్తం అందక మృతి చెందుతున్నారన్నారు. రక్తదానంతో ఇలాంటి వారెందరికో ఉపయోగపడుతుందన్నారు. తరుచుగా రక్తదానం వల్ల ఆరోగ్యానికి ఎంతోమంచిదని చెప్పారు. రక్తదానం వల్ల శరీరంలో కొత్తరక్తం ఏర్పడుతుందన్నారు. రక్తదానం చేసిన వారిని అభినందించి వారికి పండ్లు, జ్యూస్ అందజేశారు.

అమరవీరులకు జోహార్లు

పోలీసు అమరవీరుల సంస్మరణ ముగింపు కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ర్యాలీని ప్రారంభించగా, అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారికి జోహార్లు అర్పిస్తూ నినాదాలతో ర్యాలీ సాగింది. అనంతరం గడియార స్తంభం సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమాల్లో ఏడీఎంహెచ్‌వో వి.సోమలనాయక్, డీఎస్పీలు జి.రామాంజనేయులు, విజయసారథి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ, సీఐలు ఆర్.రాంబాబు, శ్రీనివాసరావు, హరికృష్ణ, ఆర్ఐ శ్రీకాంత్, ఎస్ఐలు, సిబ్బంది, చీరాల ఏరియా హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ భారత్ రాజేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో రేపు మాస్టర్స్ అథ్లెటిక్స్ ఎంపికలు

బాపట్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఎంపికలు ఆదివారం బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గ్రౌండ్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమౌతాయని మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరి షేక్.నజీర్ తెలిపారు. 30 నుంచి వంద ఏళ్లలోపు క్రీడాకారులు స్త్రీ, పురుషులు ఈ ఎంపిక పోటీలకు హాజరు కావచ్చన్నారు. ఇక్కడ ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు జిరాక్స్ పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోతో రావాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు డిసెంబరు 13, 14 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులన్నారు.

పారిశుధ్యం లోపంతో వ్యాధులు

డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ

బాపట్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీవర్షాల వల్ల పారిశుధ్య లోపంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ అపరిశుభ్రత, తాగునీరు కలుషితం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో అంటువ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచిచల్లార్చిన నీటిని తాగాలన్నారు. నీటి వనరులు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. నిల్వఉన్న ఆహార పదార్థాలను తీసుకోరాదని చెప్పారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఆశాకార్యకర్తను, ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలన్నారు.

పునరావాస కేంద్రాల్లోని వారికి సాయం

కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలు

బాపట్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన వారికి సాయం అందించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుఫాన్ బాధితులకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలన్నారు. పునరావాస కేంద్రంలో ఉన్న ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, కేజీ చొప్పున చక్కెర, పామాయిల్, కందిపప్పు అందజేయాలన్నారు. జిల్లాలో 12,671 మంది మత్స్యకార, 8,567 చేనేత కార్మిక కుటుంబాలకు 50 కిలోల బియ్యం, కిలో పంచదార, కందిపప్పు, పామాయిల్ లీటరు అందజేశామన్నారు. రాత్రి పూట పునరావాస కేంద్రంలో ఉన్నవారికి ఆర్థికసాయం అందజేయాలన్నారు. ఆర్థిక సాయం పంపిణీలో లబ్ధిదారులకు ఫోన్, బ్యాంక్ ఖాతా, ఆధార్ నెంబరు తప్పనిసరన్నారు. బ్యాంక్ ఖాతా లేనివారికి చేతికి నగదు అందజేస్తామన్నారు. సమావేశంలో డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, సీపీవో ఎ.షాలెంరాజు, మత్స్యశాఖ ఏడీ శ్రీనివాస్‌నాయక్, జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

నీవెంటే నేను..!

● భర్త మరణించిన గంటలోనే భార్య మృతి



పగడాల సుబ్బారావు, వెంకటసుబ్బులు (ఫైల్)

కారంచేడు (పర్చూరు), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : భర్త మృతి చెందిన గంటలోనే భార్య కూడా తనువు చాలించింది. ఈ ఘటన కారంచేడు మండలం ఆదిపూడిలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఆదిపూడి గ్రామానికి చెందిన పగడాల సుబ్బారావు (80) అనారోగ్యంతో బాధపడుతుండటంతో శుక్రవారం ఉదయం చీరాల వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో గుంటూరు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఇక అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దనే ఉన్న భార్య పగడాల వెంకటసుబ్బులు (70) భర్త మృతదేహాన్ని చూసి తట్టుకోలేకపోయింది. ఆయన భౌతిక కాయాన్ని ఇంటికి తెచ్చిన గంటలోనే ఆమె కూడా తుదిశ్వాస విడిచారు. ఇద్దరి మృతదేహాలకు బంధువులు ఒకేసారి దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ ఘటన గ్రామస్థులను కలిచివేసింది.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

● బాపట్ల జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు



అధికారులకు సూచనలు ఇస్తున్న డీపీవో ప్రభాకర్‌రావు

పర్చూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయితీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా పంచాయితీ అధికారి ప్రభాకరరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన పర్చూరు పంచాయతీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయితీ జిల్లా అధికారి మాట్లాడుతూ తుపాను ప్రభావంతో ముంపునకు గురైన ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. మురుగు నీరు నిల్వలేకుండా చేసి బ్లీచింగ్‌ను చల్లాలన్నారు. మండలంలో పారిశుధ్య కార్యక్రమాలపై అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. అనంతరం పర్చూరు వాగు, వంతెన వద్ద వాగుచప్టావద్ద ముంపుకు గురైన ప్రాంతాలను ఆయన స్థానిక అధికారులతో కలసి పరిశీలించారు. పంచాయతీ సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బి.హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర క్రికెట్ జట్టుకు రావినూతల విద్యార్థి ఎంపిక



ప్రతిభ చూపిన విద్యార్థి విజయ్, పీఈటీ కల్యాణి

మేదరమెట్ల, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన క్రికెట్ పోటీల్లో రావినూతల విద్యార్థి ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. శుక్రవారం మండలంలోని పమిడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-14 రాష్ట్ర క్రికెట్ జట్టు ఎంపికలో రావినూతల హైస్కూల్ విద్యార్థి కే. విజయ్ ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు రాఘవరెడ్డి తెలిపారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన విద్యార్థిని, శిక్షణ ఇచ్చిన పీఈటీ కల్యాణిని ఉపాధ్యాయులు, గ్రామస్థులు, హెచ్ఎం అభినందించారు.

గల్లంతైన వృద్ధుడి కోసం గాలింపు



నది వెంబడి గాలిస్తున్న పోలీసులు

అద్దంకి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ నదిలో దూకి గల్లంతైన వృద్ధుడు కోసం శుక్రవారం ఎస్‌డీఆర్‌ఎఫ్, పోలీస్ బృందాలు గాలించాయి. అద్దంకి పట్టణం సమీపంలోని గుండ్లకమ్మ బ్రిడ్జి వద్ద నుండి దిగువ కు సుమారు 3 కి.మీ దూరం అద్దంకి టౌన్, రూరల్ సీఐలు సుబ్బరాజు, మల్లికార్జునరావుల ఆధ్వర్యంలో సిబ్బంది డ్రోన్‌ల ద్వారా పరిశీలించారు. యస్‌డీఆర్‌ఎఫ్ బృందం, అగ్నిమాపక శాఖ అధికారి వెంకటరావుల ఆధ్వర్యంలో గుండ్లకమ్మ నదిలో గాలించారు. శనివారం కూడా గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

కారు ఢీకొని మోటార్ సైకిలిస్టుకు గాయాలు

అద్దంకి, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని మోటారు సైకిలిస్టుకు గాయాలైన ఘటన మండలంలోని శ్రీనివాసనగర్ వద్ద నామ్ రోడ్డులో మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న నూతి వెంకటస్వామిని కారు ఢీ కొట్టడంతో గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు శ్రీనివాసనగర్ కు చెందిన నూతి వెంకటస్వామి శుక్రవారం మోటార్‌సైకిల్ పై పశువుల మేతకు వెళ్తుండగా నామ్ రోడ్డు లో వస్తున్న కారు ఢీ కొట్టింది. గాయపడ్డ వెంకటస్వామిని 108 వాహనం లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నేడు మంత్రి రవికుమార్ పర్యటన

అద్దంకి, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి):విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఉదయం 9:30 గంటలకు పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా అద్దంకి మండలంలోని చక్రాయపాలెంలో పింఛన్ల పంపిణీలో పాల్గొంటారు. 10:00 గంటలకు చ క్రాయపాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ చేస్తారు. 11 గంటలకు కుంకుపాడు, మోదేపల్లి, కొటికలపూడి లలో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలు, రోడ్డు, వంతెనలను పరిశీలిస్తారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి,అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): కొత్త టవర్ విద్యుత్ లైన్ పనుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ దామోదరం తెలిపారు. అద్దంకి పట్టణంలోని కొత్తదామావారిపాలెం, భవానిసెంటర్ లలో 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు, ద్వారకానగర్, ఆటోనగర్, శింగరకొండ, శింగరకొండపాలెం లలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఎంఈవోకు సేవారత్న అవార్డు

పర్చూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు ఎంఈవో డాక్టర్ అల్లూరి శివకోటేశ్వరరావు విశ్వజననీ సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. శనివారం పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్ నందు ప్రతిభా పురస్కారం అందుకోనున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులు మృతి

● ఐదుగురికి తీవ్రగాయాలు ● క్షతగాత్రులలో ఐదేళ్ల బాలుడు ● కారంచేడు వద్ద లారీని ఆటో ఢీకొనడంతో విషాదం
● గతంలో ఇద్దరు కుమారులను రోడ్డు ప్రమాదాల్లోనే కోల్పోయిన వృద్ధ దంపతులు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో



రాఘవయ్య , సింగమ్మ (ఫైల్)

పర్చూరు/చీరాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులు దుర్మరణం చెందారు. ఆటోడ్రైవర్‌తో సహా మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఐదేళ్ల బాలుడు కూడా ఉండడం బాధాకరం. ఈ ఘటన కారంచేడులోని గ్యాస్ గోడౌన్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. క్షతగాత్రులు తెలిపిన వివరాల ప్రకారం... పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామానికి చెందిన కొమ్మనబోయిన రాఘవయ్య (75), సింగమ్మ (70) దంపతులు. వీరు వైద్యపరీక్షల నిమిత్తం ఆటోలో చీరాలలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు బయల్దేరారు. అదేగ్రామానికి చెందిన సిద్ధబత్తిన రమాదేవి, ఆమె ఐదేళ్ల మనవడు (కుమారుడి కొడుకు) సుహాస్‌కు వైద్యం నిమిత్తం కుమార్తె నట్టువ భార్గవితో కలిసి చీరాల వెళ్లేందుకు అదే ఆటో ఎక్కారు. అప్పటికే ఆటోలో షేక్ నాగూర్‌వలి అనే విద్యార్థి ఉన్నారు. ఆయన చీరాల్లోని ఓ కళాశాలలో ఎంబీఏ చదువుతున్నాడు. ప్రస్తుతం పరీక్షలు రాసేందుకు వెళుతూ ఆటో ఎక్కాడు. ఈక్రమంలో ఆరుగురితో చీరాల కొత్తపేటకు చెందిన ఆటో డ్రైవర్ శివశంకర్ చీరాలకు బయల్దేరాడు. కారంచేడు గ్యాస్ గోడౌన్ వద్దకు వచ్చేసరికి ఆటో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధ దంపతుల్లోని సింగమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. క్షతగాత్రులను స్థానికులు రెండు 108 వాహనాల ద్వారా చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ సింగమ్మ భర్త రాఘవయ్య కూడా మృతి చెందాడు. ఆటోడ్రైవర్ శివశంకర్‌ను ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. మిగిలిన నలుగురు తీవ్రగాయాలతో చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. కారంచేడు ఎస్సై షేక్ ఖాదర్ బాషా వైద్యశాలకు చేరుకొని వివరాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒకే కుటుంబంలో నలుగురిని బలిగొన్న ప్రమాదాలు

పర్చూరు మండలంలోని ఉప్పుటూరుకు కొమ్మనబోయిన రాఘవయ్య, సింగమ్మలు శుక్రవారం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందగా, వారి ఇద్దరు కుమారులను కూడా గతంలో రోడ్డు ప్రమాదాలు బలిగొన్నాయి. మృతులకు ముగ్గురు కుమారులు కాగా.. పెద్దకుమారుడు వెంకటేశ్వర్లు పదేళ్ల క్రితం పర్చూరు-కారంచేడు రోడ్డులోని రామానాయుడు వారధి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మరో కుమారుడు సురేష్ పర్చూరులోని పెట్రోలు బంక్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. ఇద్దరు కుమారుల మరణంతో ఆ దంపతులు కుంగిపోయారు. ఇప్పుడు ఆ వృద్ధదంపతులు కూడా రోడ్డు ప్రమాదానికి బలయ్యారు. దీంతో ఉప్పుటూరు గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.



అపస్మారక స్థితిలో ఉన్న సుహాస్, భార్గవి, చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ శివశంకర్, అపస్మారక స్థితిలో రమాదేవి, గాయపడ్డ నాగూర్ వలీ

తుపాను బాధితులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



నిత్యావసరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ముందు చూపుతో వ్యవహరించడంతో మొంథా తుపానును సమర్థవంతంగా ఎదొర్కొన్నామని, తుఫాను బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. తుఫాను కారణంగా మార్టూరు పంచాయతీ పరిధిలోని బాధితులకు శుక్రవారం సాయంత్రం పెద్ద అండరుపాస్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాదితులకు నిత్యావసరాలైన బియ్యం, కందిపప్పు, పంచదార, కూరగాయలు తదితర వస్తువులను ఎమ్మెల్యే ఏలూరి పంపిణీ చేశారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పెద్ద అండరు పాస్ నుండి హీరోషోరూం వరకు సర్వీసు రోడ్డుపక్కన ఉన్న సైడు కాల్వలను తుపాను ముందు పూడికతీయించడంతో, వర్షపునీరు పెద్ద అండరుపాస్ వద్ద నిలబడలేదని, దీంతో పాటు సర్వీసురోడ్డులో కూడా నీళ్ల నిలబడలేదన్నారు. అదేవిదంగా సెంటర్లో గ్రామ పంచాయతీ వారు పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అపరిశుభ్రమైన వాతావరణం లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు సూచనలుచేశారు. కార్యక్రమంలో షేక్ రజాక్, కామినేని జనార్దన్, జంపని శ్రీను, కమ్మ శివనాగేశ్వరరావు, తాటి నాగేశ్వరరావు, కన్నెగంటి శ్రీను, తొండెపు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధాత్రి కుటుంబసభ్యులకు ఏలూరి పరామర్శ

ఇంకొల్లు : కర్నూలు బస్సు ప్రమాదంలో మృతి చెందిన గన్నమనేని ధాత్రి కుటుంబసభ్యులను ఇంకొల్లు మండలం పూసపాడు గ్రామంలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శుక్రవారం పరామర్శించారు.. ధాత్రి తల్లి వాణి తల్లికి ధైర్యం చెప్పి సానుభూతి తెలిపారు. అనంతరం ధాత్రి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నాయుడు హనుమంతరావు, పర్చూరు ఏఎంసీ ఛైర్మన్ గుంజి వెంకట్రావు, ఇంకొల్లు పీఏసీఎస్ ఛైర్మన్ కరి శ్రీనివాసరావు స్థానిక టీడీపీ నాయకులు ఉన్నారు. ఇంకొల్లు గ్రామానికి చెందిన షేక్ షబానాకు అత్యవసర చికిత్స కొరకు ఎల్‌వోసీ ద్వారా రూ.50వేల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇడుపులపాడులో ఓ వివాహ వేడుకల్లో పాల్గొన్నారు.

రైతులకు ఎమ్మెల్యే పరామర్శ

మార్టూరు : మొంథా తుపాను కారణంగా గ్రామంలో పంటల పరిస్థితి ఎలా ఉందని మండలంలోని ద్రోణాదుల గ్రామ రైతులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వివరాలు అడిగి తెనుకున్నారు. శుక్రవారం ఆయన గ్రామంలో బొడ్డురాయిసెంటరు వద్ద రామాలయం వద్ద రైతులతో మాట్లాడారు. ఈ సందర్బంగా గ్రామంలో మినుము పంట దెబ్బతిన్నట్లు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా మొక్కజొన్న పంట, ఎరువుల వినియోగంపై రైతులు మాట్లాడారు. రైతుసేవాకేంద్రం, సొసైటీల ద్వారా రైతులకు ఎరువులను పంపిణీ చేయాలని రైతులు కోరారు. అదేవిధంగా గ్రామంలో ఏమైనా అంతర్గత రహదారులు, గ్రామానికి వచ్చే రోడ్లు దెబ్బతిన్నాయా ఉంటే వాటి మరమ్మత్తులు విషయంపై ఏలూరి సాంబశివరావు గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేవిదంగా నాయకులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పెంట్యాల శ్రీను, ముప్పరాజు ఆంజనేయులు, పి.జానకి రామయ్య, బెల్లంకొండ బాపారావు, చిన్నం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉబికి వస్తున్న కన్నీరు!

(5వ పేజీ తరువాయి)

చేనేత పరిశ్రమ తీవ్రంగా దెబ్బతింది. నాలుగు నెలలుగా కురుస్తున్న వర్షాలకు నేతన్నలు పనులు కోల్పోగా, కిందటి నెల కురిసిన ఎడతెరపి లేని వర్షాలు వారిని పీకల్లోతు కష్టాల్లో ముంచేశాయి. ఈ వర్షాల కారణంగా గుంటూరు జిల్లాలోని మంగళగిరి, పేటేరు, ఇసుకపల్లి, రాజోలు, చెరుకుపల్లి, కనగాల, పొన్నూరు, చిలకలూరిపేట, తెనాలి, బాపట్ల జిల్లాలోని ఈపూరుపాలెం, చీరాల, వేటపాలెం, పందిళ్లపల్లి, ఈతముక్కల, వలపర్ల తదితర ప్రాంతాల్లో 25 వేల కుటుంబాలు బాగా దెబ్బతిన్నాయి. చీరాల పరిసర గ్రామాల్లోనే 17 వేల కుటుంబాలు ప్రత్యక్షంగా తుపాను బారిన పడగా.. మంగళగిరిలో 3 వేల కుటుంబాలు, రేపల్లె పరిసర ప్రాంతాల్లో మరో 3 వేల కుటుంబాలు తుపాను ప్రభావానికి గురయ్యాయి. చేతిలో పని ఉన్నా.. అనుకూలమైన వాతావరణం లేకపోవడంతో నేతన్నలు తీవ్రంగా నష్టపోయారు.

ఊటెక్కుతున్న మగ్గం గుంతలు

మొంథా తుపాను ప్రభావం చీరాల పరిసర ప్రాంతాల్లో అత్యంత తీవ్రంగా ఉంది. చీరాల చుట్టుపక్కల ప్రాంతాల్లో మూడు రోజుల పాటు ఎడతెరపి లేకుండా కురిసిన గాలివాన కారణంగా భూగర్భ జలాల నీటిమట్టం విపరీతంగా పెరిగింది. మగ్గాల గుంతల్లోకి నీరు ఊరింది. మగ్గం గుంతల్లో రెండడుగుల మేర చేరిన ఈ నీటిని తోడుకున్నా ఊట వస్తూనే ఉంది. ఈ కారణంగా నీరు పూర్తిగా ఇంకిపోయే వరకూ నేతన్నలకు మగ్గం గుంతలో అడుగుపెట్టే అవకాశం ఉండదు. ఈ నీరు ఇంకడానికి కనీసం రెండు నెలల సమయమైనా పడుతుంది. ఈలోగా మళ్లీ వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత దిగజారుతుంది. ఈలోపు మగ్గంపై ఉన్న పడుగు, పేకలు దెబ్బతిని పోతాయి. ఇలా అన్ని విధాలుగా చేనేత కార్మికులు నష్టపోయే అవకాశం ఉంది.

వీడని ముంపు

(5వ పేజీ తరువాయి)

కార్డులు లేకుండా సాగు చేసుకుంటున్న కౌలు రైతుల పరిస్థితే ఏమిటో ఎవరికీ తెలియడంలేదు. ఒక్క బాపట్ల జిల్లా వరకు చూస్తే ఖరీఫ్ ప్రారంభంలో 3,26,000 ఎకరాల సాగు సాధారణ విస్తీర్ణంగా వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ-క్రాప్‌లో నమోదు చేసింది 2,84,000 ఎకరాలు మాత్రమే. ఇందులో దాదాపు 50,000 ఎకరాల వరకు సాగు చేసుకుంటున్న కౌలుదారు కాకుండా భూయజమాని పేరిటే ఈ-క్రాప్‌లో నమోదైంది. రెండు లక్షల మంది వరకు కౌలురైతులు ఉంటే 80,000 మందికి మాత్రమే సీసీఆర్‌సీ కార్డుల పంపిణీ జరిగింది. ఇదే పరిస్థితి పల్నాడు, గుంటూరు జిల్లాల్లోనూ ఉంది. అంటే అటు ఈ-క్రాప్ నమోదు కాని సాగుదారులు, ఇటు కౌలు రైతులు మొంథా పరిహారానికి అర్హులు కాకుండా పోతున్నారు. సాధారణ విస్తీర్ణానికి, ఈ-క్రాప్ నమోదు లెక్కలకు పొంతన లేకపోవడం కూడా పరిహారానికి అడ్డంకులుగా మారనున్నాయి. ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చరల్ ఇన్‌ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఏపీఎయిమ్స్) యాప్ ద్వారా మాత్రమే పంట నష్టాన్ని అంచనా వేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. అయితే ఈ-క్రాప్‌లో లేకుండా పంట నష్టపోయిన వివరాలను విడిగా నమోదు చేస్తామని యంత్రాంగం చెబుతున్నప్పటికీ దానిపై స్పష్టత లేదు. మూడు రోజుల్లోనే ఏపీఎయిమ్స్‌లో పంట నష్టం వివరాలన్నీ నమోదు చేయాలనే ఆదేశాలు యంత్రాంగానికి అందాయి. ఇంత స్వల్ప వ్యవధిలో ఇది సాధ్యం కాకపోగా అర్హులైన ఎంతో మంది రైతులకు అన్యాయం జరిగే అవకాశం ఉంది. సాంకేతిక చిక్కులపై సడలింపులు ఇవ్వడంతో పాటు, ఏపీ ఎయిమ్స్ యాప్ నమోదే ప్రామాణికంగా కాకుండా మ్యానువల్ నమోదుకు కూడా ఆస్కారమిస్తేనే రైతులు గట్టెక్కే అవకాశం ఉంది.

ఉదారంగా వ్యవహరించాలి

క్షేత్రస్థాయిలో ఈ-క్రాప్ నమోదుకు, ప్రస్తుతం జరిగిన నష్టానికి పొంతన లేదు. ముఖ్యంగా ఏపీఎయిమ్స్ యాప్ విషయంలో నిబంధనలు సడలించకపోతే రైతులకు పరిహారం ఎండమావే. గతంలో బర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసే విషయంలో కూడా ఎయిమ్స్ యాప్‌లో నమోదైన వివరాలకు, ఈ-క్రాప్ లెక్కలకు పొంతన లేకపోవడంతో నిబంధనల విషయంలో ఉదారంగా వ్యవహరించారు. అదేవిధంగా ఇప్పుడు కూడా ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోని వారిని కూడా పరిహారానికి అర్హులయ్యే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.

వ్యాయామంతో శారీరక, మానసిక ఆరోగ్యం



వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న రోటరీ సభ్యులు

పర్చూరు : క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే మానసిన, శారీరక ఉల్లాసంతోపాటు, మెరుగైనా ఆరోగ్యం చేకూరుతుందని ఎస్సై జీ.వీ.చౌదరి అన్నారు. ఏక్తాదివాస్ సందర్బంగా రన్‌ఫర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పర్చూరు పోలీసు సిబ్బంది నేతృత్వంలో రెండు కిలోమీటర్లు పరుగెత్తి దేశ ఏకతా స్ఫూర్తిని చాటారు. పోలీసులతో పాటు, యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని రన్‌చేశారు. ఈకార్యక్రమంలో ట్రైనీ ఎస్సై పులి గోపి, ఏఎస్సై సాంబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా దినోత్సవము

అద్దంకి : రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ సమైక్యతా దినోత్సవము నిర్వహించారు. ఈ సందర్బంగా సర్దార్ వల్లభాయ్ 150వ జయంతి సందర్బంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇందిరాగాంధీ వర్దంతి సందర్బంగా ఇందిరానగర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాలలో రోటరీక్లబ్ అధ్యక్షుడు బాచిన శివపూర్ణచంద్రరావు, కార్యదర్శి అళహరి హరిప్రసాద్, తమ్మన శ్రీనివాసరావు, మహమ్మద్ రఫీ, అద్దంకి లేవి ప్రసాద్, సందిరెడ్డి శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, డాక్టర్ ఖాజావలి, అంజాద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి దెబ్బతిన్న పంటలను రక్షించుకుందాం..!

● రైతులకు శాస్త్రవేత్తల బృందం సూచన ● నష్టంపై అంచనాలు వేస్తున్న అధికారులు



కొరిశపాడులో మొక్కజొన్నను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త హరిత

మేదరమెట్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న మొక్కజొన్న పంటను కొన్ని జాగ్రత్తలను తీసుకోవడం ద్వారా కొంత వరకు రక్షించుకోవచ్చని బాపట్ల అగ్రికల్చర్ రిసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త టి.హరిత తెలిపారు. శుక్రవారం మండలంలోని కొరిశపాడులో తుపానుకు నేలవాలిన మొక్కజొన్న పంటను అద్దంకి ఏడీఏ ఎఫ్రాయిం, ఏవో రాంమ్మోహన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ పంటలో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపడంతో పాటు పంటపై రెండుశాతం యూరియా కానీ, ఒక శాతం పొటాషియం నైట్రేట్ పిచాకారి చేయడం ద్వారా పంట త్వరగా కోలుకుంటుందన్నారు. కాండం కుల్లు, వేరు తెగులు, బూజు తెగులు రాకుండా నివారించడానికి కార్బండిజం 2 నుంచి 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి చికారి చేసి తెగులను నివారించవచ్చన్నారు.

బాపట్ల డాట్ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కే.అచ్యుతరాజు మినుము పంట గురించి రైతులకు పలు సూచనలు చేశారు. మినుములో ఇనుపధాతు లోపాన్ని నివారించుకోవడానికి అన్నభేరి 5 గ్రామాలు లేదా, నిమ్మఉప్పు 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయడం ద్వారా లోపాన్ని నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆత్మ అధికారి రామిరెడ్డి, ఆర్ఎస్‌కే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో నీరు నిల్వలేకుండా చూడండి

అద్దంకి : మొక్కజొన్న పంట లో నీరు నిల్వ ఉండకుండా రైతులు జా గ్రత్తలు తీసుకోవాలని బాపట్ల ఏరువాక కేం ద్రం శా స్త్రవేత్త అచ్యుతరాజు అన్నారు. మండలంలోని గోపాలపురం, చక్రాయపాలెం, చినకొత్తపల్లి గ్రామాలలో తుపానుతో దెబ్బతిన్న మొక్కజొన్న, పత్తి తదితర పంటలను శుక్రవారం శాస్త్రవేత్తలు అచ్యుతరాజు, హరిత, ఏడీఏ ఎఫ్రాయం, ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ తదితరులు పరిశీలించారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మొక్కజొన్న కండెలు నీళ్లలో లేకుండా చూసుకోవాలన్నారు. బూజు వచ్చే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలన్నారు. కాలువల ద్వారా నీటిని బయటకు పంపించాలన్నారు.

పంట నమోదు ప్రారంభం : ఏవో సుబ్బారెడ్డి

పంటనష్టంపై అంచనాలు

పంగులూరు: మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పొలాల పంటనష్టం అంచనా ప్రారంభించినట్లు ఏవో డి.సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని ముప్పవరం, కోటపాడు, కొండమూరు గ్రామాలలో తుపాను కారణంగా అధిక వర్షాలకు దెబ్బతిన్న మినుము ఇతర పంటలను ఏవో సుబ్బారెడ్డి శుక్రవారం రైతులతో కలసి పరిశీలించారు. 33 శాతం పైగా పంట దెబ్బతిన్న వివరాలను వ్యవసాయ సిబ్బంది నమోదు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో సిబ్బంది చేపట్టిన పంటనష్టం ఎన్యుమరేషన్ కార్యక్రమాన్ని ఎ.ఓ. పరివీలించారు. రైతులు 33శాతం పైగా దెబ్బతిన్న పంట వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ గోపి, కిరణ్, రోజి, మస్తాన్, వీఆర్‌వోలు రైతులు పాల్గొన్నారు.

చినగంజాం : మండలంలోని చినగంజాం ప్రాంతంలో సాగుచేస్తున్న వరిపైరును ప్రకృతి వ్యసాయాధికారులు శుక్రవారం పరిశీలించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగ డీపీఎం ఎస్.హెచ్.హుస్సేన్, అడిషనల్ డీపీఎం మోహన్‌లు పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. చినగంజాంలో బీఆర్‌సీ యాజమాని విజయ్ ఆనంద్‌కుమార్‌ను ప్రొలీకాఫ్ కిట్లు తయారీ స్థితి గురించి డీపీఎం అడిగి తెలుసుకున్నారు. బీఆర్‌సీ నుంచి పప్పులలో పాలీక్రాఫ్ కిట్లు తయారీ చేస్తున్నట్లు ఆనంద్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఏవో ఆర్.చంద్రశేఖర్, బీపీఎంయూ డీపీపీ శ్రీనివాసరావు, ఎన్ఎఫ్ఏ శ్రీవల్లి, చీరాల డివిజన్ మాస్టర్ ట్రైనర్ భారతి, యూనిట్ ఇన్‌చార్జ్ జయమ్మ, మండల పరిధిలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



ముప్పవరం గ్రామంలో మినుమును పరిశీలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి, వరిని పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు

అవీ..ఇవీ..

బీటీ రోడ్డుకు పడిన గండ్లు

చందలూరు-గంగవరం మధ్య నిలిచిన రాకపోకలు



చందలూరు- గంగవరం మధ్య బీటీరోడ్డులో పడిన గండ్లు

పంగులూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీవర్షాలతో చందలూరు- గంగవరం గ్రామాల మధ్య బీటీరోడ్డుకు గండ్లు పడ్డాయి.ఈ రెండు గ్రామాల మధ్య నడిమివాగు సమీపంలో వరద తాకిడికి రోడ్డు మధ్యలో సగానికిపైగా కోతకు గురైంది. భారీగండ్లతో రాకపోకలు నిలిచిపోయాయి. నిత్యం చందలూరు నుంచి వివిధ పనుల నిమిత్తం ఇంకొల్లుకు వెళ్లే ప్రజలు, కళాశాలకు చేరుకునే విద్యార్థులు కూడా ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ప్రస్తుతం వర్షాలకు రోడ్డు దెబ్బతినడంతో ఈ రెండు గ్రామాల రైతులు తమ పంటపొలాలకు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణ మరమ్మతులు చేపట్టి రాకపోకలకు అంతరాయం లేకుండా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

శతాధిక వృద్ధురాలు నాగరత్నమ్మ మృతి



నాగరత్నమ్మ(ఫైల్)

నాగులపాలెం(పర్చూరు), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండల పరిధిలోని నాగులపాలెం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు కొల్లా నాగరత్నమ్మ(106) శుక్రవారం మృతి చెందారు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పది పదులకు పైగా వయస్సు ఉన్న నాగరత్నమ్మ చివరి వరకు ఆరోగ్యవంతమైన జీవనం సాగించారు. తన పనులను తానే చేసుకుంటూ నేటి యువతరాన్ని స్ఫూర్తిగా నిలిచారు. చివరి రోజుల వరకు ఆమె స్వయంగా వంటచేసుకోవడం ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. నాగరత్నమ్మ మనవళ్లు, మనుమరాళ్ళు విదేశాల్లో ఉన్నత స్థాయిలో ఉన్నారు. శనివారం గ్రామంలో ఆమెకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుమారుడు కొల్లా సుబ్బారావు తెలిపారు.

కోరం లేక కౌన్సిల్ సమావేశం వాయిదా



ఆరుగురు కౌన్సిలర్‌లతో ఖాళీగా సమావేశం హాలు

● కార్యాలయం బయట ఇద్దరు కౌన్సిలర్ల నిరసన

చీరాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం జరగాల్సి ఉండగా, వాయిదా పడింది. 60 అంశాలతో సమావేశం నిర్వహించేందుకు అధికారులు ప్రకటన విడుదల చేశారు. అలాగే అనుకున్న రీతిలో ఉదయం 11 గంటలకే మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావు, కమిషనర్ అబ్దుల్ రషీద్, డి రఘురామ్, టీపీవో శ్రీనివాసరావు, ఏఈ రవికుమార్‌లు హాజరయ్యారు. అయితే దాదాపుగా అరగంట గడిచిన అనంతరం కౌన్సిలర్లు సల్లూరి సత్యానందం, మామిడాల రాములు, గోలి స్వాతి, మరో మగ్గురు తప్ప మిగిలిన సభ్యులు గైర్హాజర య్యారు. దీంతో ఛైర్మన్ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి హాలు నుంచి బయటకు వెళ్లారు. ఇదిలా ఉంటే అధికార పార్టీకి చెందిన 31 వార్డు కౌన్సిలర్ సత్యానందం, గుంటూరు ప్రభాకరరావు ఛైర్మన్‌పై అసహనం వ్యక్తం చేస్తూ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

పశువుల యజమానులకు దాణా పంపిణీ



పశువుల యజమానులకు దాణా పంపిణీ చేస్తున్న అధికారులు

పాపాయిపాలెం(చీరాల), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నేపథ్యంలో ఇబ్బందులు ఎదుర్కొన్న పశువుల యజమానులకు పశుసంవర్ధకశాఖ దాణా అందజేస్తోంది. ఈ క్రమంలోనే శుక్రవారం వేటపాలెం మండలం పాపాయిపాలెం గ్రామంలో 200 మంది రైతులకు దాణా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.వేణుగోపాల్, ఏడీ చిట్టిబాబు, పశువైద్యులు డా.పుష్పలత, వాసు, పులి హరికృష్ణ, పోతురాజు, నారాయణ, బొమ్మిడి నాగరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

3న మండల సర్వసభ్య సమావేశం

యద్దనపూడి,(మార్టూరు) అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి):యద్దనపూడి ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 3న సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు అందరూ హాజరుకావాలని ఆయన తన ప్రకటనలో కోరారు.

నోటీసు

హైకోర్టు ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అమరావతి
సి.ఆర్.పి. నెం.567 ఆఫ్ 2025

మధ్య:
చుక్కా లలిత, భర్త: శ్రీనివాసరావు, వయస్సు: 48 సం॥లు, వృత్తి: హౌస్ వైఫ్, నివాసము: డోర్ నెం.23-11-50/3, గొల్లపాడు, మునిసిపల్ వాటర్ ట్యాంక్ ఎదురు, చీరాల, ఇప్పుడు బాపట్ల జిల్లా.
రివిజన్ పిటీషన్/రెస్పాండెంట్ నెం.1
రెస్పాండెంట్ నెం.1/డిఫెండెంట్ నెం.1
మరియు
01.పోలుదాసు రాధా దేవి, భర్త: వేమన, వయస్సు: 63 సం॥లు, నివాసము: డి.నెం.15-10-18, పాపరాజుతోట, చీరాల **రెస్పాండెంట్/అప్పిలెంట్/పిటీషనర్/ప్లైంటిఫ్**
02. చుక్కా కృష్ణారావు, తండ్రి: పెద్ద వెంకటేశ్వర్లు, వయస్సు: 55 సం॥లు, నివాసము: డి.నెం.23-21-14, గొల్లపాలెం, మునిసిపల్ వాటర్ ట్యాంక్, చీరాల.
రెస్పాండెంట్/రెస్పాండెంట్ నెం.2
రెస్పాండెంట్ నెం.2/డిఫెండెంట్ నెం.2
ప్రతివాది నెం.1కు జారీచేయబడిన వ్యక్తిగత నోటీసు

To,
01.పోలుదాసు రాధా దేవి, భర్త: వేమన, వయస్సు: 63 సం॥లు, నివాసము: డి.నెం.15-10-18, పాపరాజుతోట, చీరాల

గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి, చీరాల కోర్టు వారు జారీ చేసిన తాత్కాలిక నిషేదాని మంజూరు చేస్తూ సి.ఎం.ఎ. నెం.2/2019లో ది.03-11-2022న జారీ చేసిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా, పైన తెలిపిన సి.ఆర్.పి. నెం.567/2025 గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, అమరావతిలో దాఖలు చేయబడినది.

గౌరవనీయ హైకోర్టు, ఆంధ్రప్రదేశ్, అమరావతి వారి ఆదేశాల మేరకు పైన పేర్కొన్న సి.ఆర్.పి. కి సంబంధించి మొదటి ప్రతివాదిగా ఉన్న మీకు నేను వ్యక్తిగత నోటీసు పంపియున్నాను. నోటీసులు పంపినప్పటికీ, ఏదో ఒక కారణం చేత అది మీకు అందలేదు. దానికి అనుగుణంగా ఆంధ్రజ్యోతి, చీరాల ఎడిషన్‌లో పేపర్ పబ్లికేషన్ ద్వారా మీకు నోటీసును అందించడానికి నన్ను అనుమతించింది. 3 వారాల తరువాత అనగా **ది.06-11-2025** తర్వాత తెలిపిన సి.ఆర్.పి. ని పోస్ట్ చేయుచున్నప్పుడు,

దీని దృష్ట్యా, **ది.06-11-2025న ఉదయం 10.30 గం॥లకు** లేదా అంతకు ముందు గౌరవనీయ హైకోర్టు ముందు పెండింగ్‌లో ఉన్న సి.ఆర్.పి. నెం.567/2025లో మీరు స్వయంగా లేదా మీ న్యాయవాది ద్వారా హాజరు కావాలని నేను అభ్యర్థిస్తున్నాను, లేని పక్షంలో గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మీరు లేనప్పుడు చట్టప్రకారం కేసును కొనసాగిస్తుంది మరియు కేసును నిర్ణయిస్తుంది.

ఇది మీ సమాచారం కోసం. **ఎ.రాజేంద్ర బాబు, బి.ఎస్.సి., ఎల్.ఎల్.బి., న్యాయవాది**
గుంటూరు-522004, ఫోన్: 98481 98363.

విమర్శలు, ప్రతివిమర్శల మధ్య కౌన్సిల్ సమావేశం

నాడు వివక్ష చూపించి.. నేడు నిందలా..



అసహనం వ్యక్తం చేస్తున్న ఛైర్‌పర్సన్, మాట్లాడుతున్న కౌన్సిలర్లు

అద్దంకి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపల్ సాధారణ సమావేశం విమర్శలు, ప్రతివిమర్శల మధ్య సాగింది. అద్దంకి మున్సిపల్ సమావేశం శుక్రవారం ఛైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన నిర్వహించారు. అజెండాలోని మొత్తం 27 అంశాలను ఆమోదించారు. అయితే సమావేశం ముగిసే సమయంలో వైసీపీ కౌన్సిలర్లు బాలు, కోటేశ్వరరావులు తమ వార్డులలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం లేదని అన్నారు. దీనికి సమాధానంగా కమిషనర్ రవీంద్ర ఆయా వార్డులలో చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. వైసీపీ కౌన్సిలర్ల విమర్శలకు టీడీపీ మహిళా కౌన్సిలర్లు కంపా రజనీ, మాగులూరి తిరుపతమ్మలు సమాధానం ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహించే వార్డులకు ఎలాంటి నిధులు కేటాయించకుండా తీవ్ర వివక్ష చూపించారన్నారు. కాని ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వార్డు లకు సమ ప్రాధాన్యం ఇస్తూ నిధులు కేటాయి స్తోందన్నారు. అదేసమయంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో అద్దంకి పట్టణంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. వైసీపీ కౌన్సిలర్లు బాలు మాట్లాడుతూ మినీ బైపాస్ రోడ్డు నిర్మాణం పీపీపీ పద్ధతిలో నిర్మిస్తే మున్సిపాలిటీ నుంచి ఎలా చెల్లింపులు సాధ్యం అవుతాయని ప్రశ్నించారు. అద్దంకి మున్సిపాలిటీ ఆదాయం పరిగణలోకి తీసుకోకుండా పీపీపీ విధానంలో మినీ బైపాస్ రోడ్డు నిర్మాణం ఎలా చేస్తారన్నారు. టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల వాదో పవాదనలతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది.

తుపాను బాధితులకు అండగా ప్రభుత్వం

పలు గ్రామాల్లో ఎమ్మెల్యే కొండయ్య పర్యటన



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : తుపాను బారిన పడిన రైతులకు ప్రజా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. శుక్రవారం చీరాల మండల పరిధిలోని వాడరేవు, బోయినవారిపాలెం, కావూరివారిపాలెం ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈసందర్భంగా ఆయా ప్రాంతాల్లోని వరి, వేరుశనగ పంట లను పరిశీలించి రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే అధికారులు నష్టానికి సంబంధించిన అంచనాలను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిఒక్కరికి పారదర్శకంగా సాయం అందుతుందన్నారు. నిత్యవసరాలు పంపిణీ చేశా రు. అంతకుముందు కీర్తివారిపాలెం జాతీయ రహదారి నుంచి వాడరేవు జీరో పాయింట్ వరకు పోలీసులు నిర్వహించిన ఏక్తాదివస్ యూనిటీ రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అలా గే వారితో నడిచి జాతీయ ఐక్యతను చాటారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే వెంట పలువురు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిమ్మాయపాలెం పొలాలకు ఏటా వరద ముప్పు

తీవ్రంగా నష్టపోతున్న రైతులు



తిమ్మాయపాలెం వద్ద పొలాలలో నిలిచిన వర్షపు నీరు

అద్దంకి, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాయపాలెం వద్ద పొలాలకు వరద ముప్పుతో రైతులకు ఏటా తిప్పలు తప్పడం లేదు. దర్శి రోడ్డుకు ఇరువైపులా ఉన్న సుమారు 200 ఎకరాల పొలాలలోకి చిన్నపాటి వర్షం కురిసినా నీరు చేరి బయటకు వెళ్ళే మార్గం లేక నిలిచిపోతోంది. పంటలు సాగు చేసే ముందు వర్షాలు పడితే ఇక నెలల తరబడి వేచి ఉండాల్సిందే. పంటలు సాగు చేసిన వర్షాలు పడితే పంటను వదులుకోవాల్సిందే. తిమ్మాయపాలెం ఎత్తిపోతల పథకం కాలువ నుంచి దర్శి రోడ్డుకు రెండు వైపులా భూమి ఏటవాలు లేకుండా చదునుగా ఉంది. దీనికి తోడు దర్శి రోడ్డులో ఎక్కువ కల్వర్టులు కూడా ఏర్పాటు చేయక పోవడంతో నీరు ఎక్కడి కక్కడే నిలిచి పోతోంది. వరద నీరు పోయేందుకు ప్రత్యేకంగా కాలువ, వాగు లేక పోవడంతో పొలాలలో నుంచి ప్రవహించాల్సి ఉంది. పొలాలలో నుంచి వెళ్లే నీరు కుంకుపాడు రోడ్డు వరకు పోయి నిలిచిపోతున్నాయి. మెట్ట పంటలు ఎలాగూ సాగు చేసే అవకాశం లేదు. వరి సాగు చేసినా నీరు నిలిచి ఉండడంతో ఎదుగుదల లేకుండా కుళ్లిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ప్రత్యామ్నాయంగా వరద నీరు పోయే వీలుగా కాలువ ఏర్పాటు చేస్తే రైతులందరికి ప్రయోజనం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జలదిగ్బంధంలో పెదగంజాం



పోలేరమ్మ గుడి సమీపంలో రోడ్డుపై వరదనీరు

చినగంజాం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : వర్షాలు ఆగినా మండలంలోని పెదగంజాం గ్రామం ఇంకా జలదిగ్బంధంలోనే ఉంది. పెదగంజాం గ్రామానికి చుట్టుపక్కల వరద నీరు రావడంతో మూడు రోజుల నుంచి గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని బుచ్చిగుంట సమీపంలోని మురుగుకాలువకు వరద రావడం, రైల్వేస్టేషన్ అండర్‌పాస్‌లోనికి వర్షపునీరు భారీగా చేరడం, బకింగ్‌హాం కాలువకు వచ్చిన వరదనీరు గ్రామంలోని పోలేరమ్మ గుడి నుంచి ఎన్టీఆర్ వారిధి వరకు ఉన్న రహదారిపై ఉధృతంగా ప్రవహిం చడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపో యాయి. గ్రామంలోనికి రాకపోకలను తమ సిబ్బంది నిలువరిస్తున్నట్లు తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు శుక్రవారం తెలిపారు. మున్నంవారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని రాజమాతకాలనీ లోనికి వచ్చిన వరద నీటిని, రైల్వే అండర్‌పాస్‌లో నిలిచిన వర్షపు నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.ధనలక్ష్మి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



రాజమాత కాలనీలో వరద నీటిని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

పోలూరు వాగుకు తగ్గని ఉధృతి

యద్దనపూడి,(మార్టూరు) : మొంథా తుఫాను వరదనీరు యద్దనపూడి మండలంలోని పోలూరు వాగులో శుక్రవారం కూడా కొనసాగుతోంది. ఈ వాగులో నీరు కొంతమేర తగ్గినప్పటికీ పోలూరు గ్రామానికి మాత్రం ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. మూడు రోజుల నుంచి పోలూరు గ్రామానికి యద్దనపూడి, ఇతర గ్రామాలకు ప్రజల రాకపోకలు స్తంభించాయి. అదేవిధంగా శనివారం ఉదయం వరకు వాగు ఉధృతి కొనసాగే అవకాశం ఉందని, శనివారం సాయంత్రానికి ప్రజల రాకపోకలు జరిగే అ వకాశం ఉందని పోలూరు గ్రామస్థులు పేర్కొటున్నారు. యద్దనపూడి నుండి పర్చూరుకు, యనమదల నుంచి అనంతవరం గ్రామానికి వరదనీరు ఉధృతి తగ్గడంతో యధావిధిగా ప్రజల రాకపోకలు కొనసాగుతున్నాయి.

వరద నీటిలోనే ప్రయాణాలు



చంటిబిడ్డతో రోడ్డుదాటుతున్న స్వర్ణవాసులు

కారంచేడు (పర్చూరు), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో వాగులు, చెరువులు, కాలువలు పొంగి పొరలి ఆయా గ్రామాలు జలదిగ్బంధంలో ఉండగా, రాకపోకలు నిలిచిపోయాయి. వర్షం ఆగిపోయినా వాగులు, కాలువల్లో నీటి ఉధృతి తగ్గలేదు. దీంతో ఆయా ప్రధాన కాలువలు పొంగి పొరలుతున్నాయి. ఎక్కడ చూసినా పంట పొలాలు సముద్రాన్ని తలపించేలా నీటితో నిండిపోయి ఉన్నాయి. గ్రామాల నలు దిక్కులను వరద నీరు ముంచెత్తటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. కారంచేడు - స్వర్ణ గ్రామాల మధ్య కొమ్మమూరు కాలువకు గండ్లు పడటంతో రోడ్లపై నుంచి నీటి ప్రవాహం కొనసాగుతోంది. పంట పొలాలు సైతం నేటికి వరద నీటితో నిండి ఉన్నాయి. దీంతో ఆయా మార్గాల నుంచి ప్రజలు అతికష్టం మీద ప్రవహిస్తున్నా నీటిలోనే చంటి బిడ్డలతో రాకపోకలు సాగిస్తున్నారు.

జాండ్రపేట వాసులకు తీరిన కరెంట్ కష్టాలు

● కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన అధికారులు



నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న డీఈ థామస్

జాండ్రపేట (చీరాల), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని జాండ్రపేట సిపాయిపేట వాసులకు కరెంట్ కష్టాలు తీరాయి. రూ.8 లక్షల విలువైన నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం డీఈ జాన్‌థామస్ ప్రారంభించారు. గ్రామంలో గతంలో లో-ఓల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడినట్లు అధికారులు తెలిపారు. ఇకపై అంతరాయం సమస్యలు ఉండవన్నారు. కార్యక్రమంలో డీఈఈ హరిప్రసాద్, ఏఈ2 అసిస్టెంట్ ఇంజనీర్ శంకర్, ఇతర విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బలరాం స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు

తోటవారిపాలెం (చీరాల), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తేళ్ల రాంబాబు తెలిపారు. బలరాం జన్మదిన వేడుకలు సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని తోటవారిపాలెం యానదికాలనీ వాసులకు పండ్లు పంపిణీ చేశారు. గతంలో అన్నదానాలు నిర్వహించినట్లు రాంబాబు వివరించాడు.

తుపాను బాధితులకు సరుకుల పంపిణీ

మార్టూరు, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి):మండలంలోని కోలలపూడి గ్రామంలో 12 మంది తుపాను బాధితులకు 25 కిలోలు బియ్యం,నిత్యావసరవస్తువులను శుక్రవారం పంపిణీ చేశారు. జడ్పీ హైస్కూల్‌లోని పునరావాసకేంద్రంలో తలదాచుకున్న బాధితులకు కలెక్టర్ ఆదేశాలు మేరకు సరుకులను పంపిణీ చేశామని సర్పంచ్ ఎం.సతీష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సొసైటీ అధ్యక్షులు తాటి నాగార్జున, కందిమళ్ల కొండలరావు, చందు, కనుమూరి చిన్న, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మేము సైతం ప్రజాసేవలో..



నిత్యావసరాలు అందజేస్తున్న దుకాణదారులు, టీడీపీ శ్రేణులు

చీరాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : తుపాను ప్రభావంతో ఎంతో మంది నిరాశ్ర యులుగా మారారు. అయితే అప్పటికే ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకునేందుకు సహాయక చర్యలు చేపట్టింది. అయితే మేము సైతం ప్రజాసేవలో అంటూ ఓ మొబైల్ దుకాణా దారుడు ముందుకు వచ్చాడు. పట్టణంలోని త్రినేత్రం మొబైల్ దుకాణదారుడు మోకాళ్ల లోతు నీళ్లల్లో ఉన్న కొత్తపేట పంచాయతీ కృపానగర్‌లో తుఫాన్ బాధితులకు టీడీపీ కార్యకర్త గవిని వెంకటేశ్వర్లుతో కలిసి దుకాణ దారుడు సుబ్బుయాదవ్ సుమారు 50 మందికి నిత్యవసరాలు అందజేశారు. వారి వెంట వెంకటేశ్వర్లు, షేక్ అహ్మద్, గోపీ తదితరులు ఉన్నారు.

పోలీసు అమరుల వీరుల త్యాగాలు ఎనలేనివి

● చివరిరోజు రక్తదాన శిబిరం ఏర్పాటు



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సీఐ సుబ్బారావు, ఎస్సై రాజ్యలక్ష్మి

చీరాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల త్యాగాలు ఎనలేనివని వన్‌టౌన్ సీఐ సుబ్బారావు అన్నారు. డీఎస్పీ ఎండీ మొయిన్ ఆదేశాల మేరకు శుక్రవారం ఎస్సై రాజ్యలక్ష్మీతో కలిసి స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో పోలీసుల రక్తదాన శిబిరం నిర్వహించారు. దీంతో పలువురు సిబ్బంది హాజరై రక్తదానం చేశారు. కార్యక్రమంలో పలువురు పోలీసులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఇన్వర్టర్ బహూకరణ



ఇన్వర్టర్‌ను బహూకరిస్తున్న పూర్వవిద్యార్థిని అనంతలక్ష్మి

పంగులూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదవాడ ఉన్నత పాఠశాలకు పూర్వవిద్యార్థిని, కల్లంవారిపాలెం సచివాలయ ఏఎన్ఎం పోలిశెట్టి అనంతలక్ష్మి ఇన్వర్టర్, బ్యాటరీ బహూకరించారు. రూ.26వేల విలువైన ఇన్వర్టర్‌తో పాటు బ్యాటరీని శుక్రవారం పాఠశాల హెచ్ఎం పూసల రఘురామయ్యకు అందజేశారు. తన తల్లిదండ్రులు గుండా సాంబశివరావు, వెంకటరత్నాల ఆశయాలు తనను ముందుకు నడిపిస్తున్నాయని అనంతలక్ష్మి తెలిపారు. బాల బాలికలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. తమ పాఠశాలకు విలువైన ఇన్వర్టర్ సమకూర్చిన పూర్వ విద్యార్థిని అనంతలక్ష్మికి హెచ్.యం, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చిలుకూరి శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కుటుంబాలకు వంటగ్యాస్ పంపిణీ



వంటగ్యాస్ కనెక్షన్ అందజేస్తున్న గ్రామవికాస్‌సొసైటీ ప్రతినిధులు

ఇంకొల్లు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దుకూరు గ్రామంలో గ్రామ వికాస్ సొసైటీ ద్వారా 12 కుటుంబాలకు ఉచిత వంట గ్యాస్ కనెక్షన్లను అందజేశారు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ. రాయిణి నళిని సుబ్బరామయ్య తన పుట్టినరోజు సందర్భంగా సమకూర్చిన రూ.75వేల నిధులతో 12 కుటుంబాల వారికి ఇండేన్ వంటగ్యాస్ శుక్రవారం గ్రామవికాస్ సొసైటీ ప్రతినిధులు పంపిణీ చేశారు. విద్యా కార్యక్రమాలతో పాటు పేదల సంక్షేమమే లక్ష్యంగా గ్రామవికాస్ సొసైటీ తమ సేవలు విస్తరిస్తుందని ప్రతినిధి చెన్నుపాటి జనార్ధనరావు అన్నారు. కార్యక్రమంలో పిల్లి బెన్నీ, పలువురు గ్రామవికాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మొంథా ప్రభావంతో కూలిన నూరేళ్ల మర్రిచెట్టు



కూలిన మర్రి చెట్టు

ఇంకొల్లు, అక్టోబరు 31, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుద్దుకూరు గ్రామంలో పోలేరమ్మ గుడి వద్ద చెరువుకట్టపై ఉన్న 100 సంవత్సరాల చరిత్ర కలిగిన మర్రి చెట్టు తుఫాన్ కారణంగా కుప్పకూలింది. మంగళవారం అర్ధరాత్రి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి బుధవారం ఉదయం చెరువులోకి పడిపోయింది. వందేళ్ల క్రితం నూజెళ్లపల్లెకు చెందినన ఓ వ్యక్తి చెరువుకట్టపై కూర్చునేందుకు రావి, మర్రి చెట్లు నాటారని అది మహావృక్షంగా పెరిగిందన్నారు. చెట్టు కిందే పిండప్రదానాలు చేసుకునేందుకు, విశ్రాంతి తీసుకునేందుకు ఉపయోగకరంగా ఉన్న చెట్టు మొంథా తుఫాన్ దెబ్బకు కుప్పకూలిందని గ్రామస్థులు తెలిపారు. చాలా ఏళ్ల చరిత్ర కలిగిన చెట్టు కూలిపోవడంతో గ్రామంలో చర్చనీయంశమైంది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పడిపోయిన మర్రి చెట్టును పరిశీలించారు. అనంతరం కోతకు గురైన చెరువుకట్టను పరిశీలించి చెరువుకట్ట బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు.


ఎత్తిపోతలు నిర్మిస్తే తీవ్ర నష్టం



కారంచేడులో సమావేశంలో పాల్గొన్న రైతులు

కారంచేడు(పర్చూరు), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా, అప్పాపురం వద్ద కొమ్మమూరు కాలువపై లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ నిర్మిస్తే దిగువన ఉన్న కారంచేడు భూములకు సాగునీటితోపాటు, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు వస్తాయని కారంచేడు మండల రైతులు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా కాకుమానుకు చెందిన ఓ పారిశ్రామికవేత్త పీ4 ముసుగులో కొమ్మమూరు కాలువ ఎగువ ప్రాంతంలో ఉన్న అప్పాపురం మెయిన్ ఛానల్ చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదని సాకుతో ఈలిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. దీనికి వ్యతిరేకంగా శుక్రవారం కారంచేడు సాయిబాబా మందిర అతిథి భవనంతో రైతులతో సమావేశం నిర్వహించారు. త్వరలో ఏర్పాటు చేసే కార్యాచరణపై సభ్యుల అభిప్రాయాలు స్వీకరించారు. కార్యక్రమంలో యార్లగడ్డ శ్రీనివాసరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు యార్లగడ్డ సుబ్బారావు, పోతిని నాగేశ్వరరావు, మాలెంపాటి చినసారాయణ, కొల్లా సుబ్బారాయుడు, చాగంటి సాంబయ్య, వాసు, పాలేటి మల్లి తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా
అంతస్తుల నిర్మాణం ఎలా!?
● ఏసీపీతోపాటు ముగ్గురు ప్లానింగ్ అధికారులకు షోకాజు
● ఇద్దరు ఆర్ఐలు, మరో ఇద్దరు అడ్మిన్లకు కూడా.. 8లో..



పెన్నా హుషార్!

నెల్లూరు శివార్లలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్నా నది

అనంతసాగరం : నిండుకుండలా ఉన్న సోమశిల జలాశయం



సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి 76,015 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో జలాశయంలో 71 టీఎంసీల నీరు నిల్వ చేసి దిగువకు క్రస్ట్‌గేట్ల ద్వారా 77,650 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. - అనంతసాగరం (ఆంధ్రజ్యోతి)

● నదిలోకి 1.39 లక్షల క్యూసెక్కులకుపైగా వరద
● సోమశిలలోకి భారీగా చేరుతున్న నీరు
● బీరాపేరు, బొగ్గేరుల నుంచి సంగం బ్యారేజీలోకి..
● అప్రమత్తమైన జిల్లా అధికార యంత్రాంగం
● లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న అధికారులు
● పెన్నానది పరిసరాల్లోకి వెళ్లరాదని ఆదేశాలు

ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద..
బీరాపేరు, బొగ్గేరు వాగుల నుంచి భారీగా వస్తున్న నీటితో పెన్నమ్మ పోటెత్తుతోంది. జిల్లా ప్రధాన జలాశయమైన సోమశిల నుంచి 93 వేల క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, సంగం బ్యారేజీ నుంచి మరో 46వేల క్యూసెక్కులు మొత్తం 1.39 లక్షల క్యూసెక్కుల నీటితో పెన్నా నది పరవళ్లు తొక్కుతోంది. ఈ ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉంటుందని తెలియడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. పెన్నా పరివాహక మండలాల తహసీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్వోలు లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయం, సంగం బ్యారేజీ నుంచి పెన్నాదికి భారీగా వరద పోటెత్తుతుండటంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే సోమశిల నుంచి ప్రతి రోజూ 70 వేల క్యూసెక్కులకుపైగా నీరు పెన్నానదికి వదులుతున్నారు. దీనికి తోడు బీరాపేరు, బొగ్గేరు నుంచి కూడా వరద ప్రవాహం పెరగడంతో సంగం బ్యారేజీ నుంచి 1.4 లక్షల క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేశారు. దీంతో జిల్లా యంత్రాగం మొత్తం అప్రమత్తమైంది. పెన్నా పరివాహక మండలాల తహసీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్వోలు లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. నదిలో నీటి ప్రవాహం స్థితిగతులపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నారు.

● లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తం

నెల్లూరులోని లోతట్టు ప్రాంతాలైన జాకీర్‌హుస్సేన్‌నగర్, కిసాన్ నగర్, భగత్‌సింగ్ కాలనీ, గాంధీగిరిజన కాలనీ ప్రాంతాల ప్రజలను ఇప్పటికే అధికారులు అప్రమత్తం చేశారు. అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. వరదల వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రధానంగా పెన్నానది పరిసరాల్లోకి ఎవరూ వెళ్లకుండా చర్యలు చేపట్టారు.

ప్రజలను అప్రమత్తం చేయండి
● పార్టీ శ్రేణులకు మంత్రి నారాయణ ఆదేశం

నెల్లూరు (సిటీ) : ఎగువ నుంచి సోమశిలకు వస్తున్న వరద ప్రవాహంతో పెన్నాకు అదే వరదను విడుదల చేస్తున్నందున నెల్లూరు నగర శివార్లలోని ప్రజలను అప్రమత్తం చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ టీడీపీ శ్రేణులకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ నాయకులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పెన్నాకు సుమారు లక్ష క్యూసెక్కుల వరకు వరద వస్తున్నందున కరకట్టకు సమీపాన ఉన్న ప్రజల యోగక్షేమాలను పరిశీలించాలని సూచించారు. అవసరమైతే వారందరినీ పునరావాస కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేశారు. ప్రాణ, ఆస్తి నష్టాలు జరగనివ్వకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్పొరేషన్ అధికారులు కూడా రంగంలోకి దిగి పెన్నా వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్నారు.

'సంగం' బ్యారేజీ వద్ద..

సంగం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సంగం బ్యారేజీకి సోమశిల నీటితోపాటు బీరాపేరు, బొగ్గేరు నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. శుక్రవారం ఉదయం 1.39 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవగా, 12.6 అడుగులకు నీటిమట్టం చేరింది. ఇందులో సోమశిల నుంచి 93 వేల క్యూసెక్కుల ప్రవాహం, బీరాపేరు, బొగ్గేరు వాగుల ద్వారా సుమారు 46 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోంది. అయితే సాయంత్రానికి 5 వేల క్యూసెక్కుల ప్రవాహం తగ్గింది. బ్యారేజీకి వస్తున్న వరదను వచ్చినట్టే 79 గేట్లతోపాటు కుడివైపు ఉన్న మూడు గేట్లను ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నట్లు సెక్షన్ ఏఈ వినయ్ తెలిపారు. సంగం బ్యారేజీకి భారీగా వరద ప్రవాహం రావడంతో పాత ఆనకట్టలో కనిగిరి ప్రధాన కాలువ హెడ్‌రెగ్యులేటర్‌లో ఒక గేటు దెబ్బతిన్నది. దీంతో సుమారు 300 క్యూసెక్కుల నీరు కనిగిరి రిజర్వాయర్‌కు వెళ్తోంది. దెబ్బతిన్న గేటును యుద్ధపాతిపదికన ఏర్పాటు చేయాల్సి ఉంది.

● 'కండలేరు'లో 58.83 టీఎంసీలు

రాపూరు : కండలేరు డ్యాంలో నీటిమట్టం 58.83 టీఎంసీలకు చేరుకున్నట్లు ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 890 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 850 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నట్లు తెలిపారు.

● 'రాళ్లపాడు'లో 20.2 అడుగులు

లింగసముద్రం : రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం 20.2 అడుగులకు చేరింది. ప్రాజెక్టులోకి కేవలం 150 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తున్నట్లు డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. అయితే రైతుల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టులో నీటిమట్టం 20 అడుగులకు తగ్గకుండా నిల్వ ఉంచుతామని తెలిపారు.

● 'గండిపాళెం'లో 22 అడుగులు

ఉదయగిరి : గండిపాళెం జలాశయ నీటిమట్టం 22 అడుగులకు చేరినట్లు జలవనరుల శాఖ డీఈ కందుకూరి చంద్రమౌళి పేర్కొన్నారు. పైతట్టు ప్రాంతం నుంచి 780 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు తెలిపారు.



లింగసముద్రం : రాళ్లపాడు రిజర్వాయర్‌లో నీరు

ప్రత్యేక అభివృద్ధి పక్కదారి!

11 వర్కుల్లో అవినీతి జరిగిందన్న ప్రభుత్వం
ఇప్పటికే చార్జెస్ ఫ్రేమ్ చేసిన సర్కారు
నగర పాలకసంస్థలో నలుగురు ఇంజనీర్లపై విచారణ
మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం

నెల్లూరు(సిటీ), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంలో అవకతవకలకు పాల్పడుతున్న అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించింది. ఇందులో ఈఈ అళహరి శేషగిరితోపాటు డీఈఈ శ్రీనివాసరావు, ఏఈఈలు ఖాదర్‌మస్తాన్, ఫాజిల్ ఉన్నారు. ఇప్పటికే జరిగిన ప్రాథమిక విచారణలో అవకతవకలను గుర్తించినట్లు తెలుస్తుండగా ఆ మేరకు విధి నిర్వహణలో చార్జెస్ ఫ్రేమ్ చేశారు. తదుపరి సమగ్ర విచారణకు ఆదేశించిన ప్రభుత్వం రానున్న మూడు నెలల్లో నివేదికను తమకు అందచేయాలని ఆదేశించింది. విచారణ అధికారిగా టిడ్కో చీఫ్ ఇంజనీర్ రామమూర్తిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు. విశ్వసనీయ సమాచారం మేరకు ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్డీఎఫ్) ద్వారా నెల్లూరులో అనేక పనులు చేయగా, 11 వర్కులను ఓ కాంట్రాక్టర్ టెండర్ల ద్వారా పొందగా ఆయన స్థానంలో మరొకరితో ఒక సీసీ రోడ్డును రూ.40 లక్షలతో, మరో 10 సీసీరోడ్లు ఒక్కొక్కటి రూ. 5 లక్షలతో నిర్మిం చారు. ఇవి పారదర్శకంగా లేకపోవడం, నాణ్యత ప్రమాణాలకు దూరంగా ఉండటంతో గత ప్రభుత్వంలోనే విజిలెన్స్ విచారణ జరి గినట్లు సమాచారం. అప్పట్లోనే వీరందరిపై చార్జెస్ ఫ్రేమ్ అయి నట్లు తెలుస్తోంది. కాగ ఆ పనులకు సంబంధించిన పత్రాలన్నీ విచారణ అధికారికి అందచేయడంతోపాటు అధికారులపై తలెత్తిన ఆరోపణలు, చార్జెస్ ఫ్రేమ్‌తో నెలకొన్న వివాదంపై వివరణ ఇవ్వాలని తాజా ఉత్తర్వుల్లో ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశించారు. ఇందులో ఓ అధికారిపై వరుస విచారణలు ఉండటం గమనార్హం.

తుఫాన్ పరిహారం బ్యాంకు ఖాతాల్లోకి..

● అర్హులకు అందేలా కలెక్టర్ నిర్ణయం

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ బాధితులకు అందించే పరిహారాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నారు. బాధితులకు ఇచ్చే పరిహారం పక్కదారి పట్టకుండా, అర్హులైన వారికి నగదు చేరేలా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఈ నిర్ణయం తీసుకున్నారు. బాధితులకు బ్యాంకు ఖాతా లేకపోతే వారి చేత ఖాతా తెరిపించి పరిహారం జమ చేయనున్నారు. సహాయ కేంద్రంలో ఉన్న కుటుంబం లోని ఒక్కొక్కరికి రూ.వెయ్యి వంతున, ముగ్గురికి రూ.3 వేలు, కుటుంబంలో ఎంతమంది ఉన్నా రూ.3వేలకు మించకుండా పరిహారం చెల్లిస్తారు. ఇక పంట నష్టాలకు సంబంధించి రైతులకు రాబోయే పరిహారం కూడా వారి బ్యాంకు ఖాతాలోనే జమ చేయనున్నారు.

● పంట నష్టాలు ఇలా..

వ్యవసాయ శాఖ పరిధిలో 1,365 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో 1282.63 హెక్టార్లలో వరి పైరు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అదేవిధంగా 41.10 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు ఆశాఖ అధికారులు గుర్తించారు.

● దెబ్బతిన్న రోడ్లు

తుఫాన్ దెబ్బకు జిల్లాలో పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ రోడ్లు బాగా దెబ్బతిన్నా యి. ప్రాథమిక అంచనా నివేదికను అధికా రులు ప్రభుత్వానికి పంపారు. పంచాయతీ రాజ్ పరిధిలో 290 కి.మీ పొడవున రోడ్లు దెబ్బనిగా, తాత్కాలిక మరమ్మతులకు రూ.1.77 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ.146.60 కోట్లు అవసరమని ఆ శాఖ అధికారులు నివేదికలో పేర్కొన్నారు. రోడ్లు భవనాల శాఖ పరిధిలో 462 కి.మీ మేర రహదారులు దెబ్బతినగా, తాత్కాలిక మరమ్మతులకు రూ.22.87 కోట్లు, శాశ్వత పనులకు రూ.164 కోట్లు అవసరమవుతుందని నిర్ధారించారు.



చిట్రగుంట : మండల కేంద్రమైన దగదర్తిలో తుఫాన్ బాధితులకు సరుకులు పంపిణీచేస్తున్న తహసీల్దారు కృష్ణ తదితరులు

● నష్టాలపై ప్రాథమిక నివేదికలు సిద్ధం
● రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన యంత్రాంగం

● జలవనరుల శాఖ పరిధిలో...

తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు జలవనరులశాఖ పరిధిలో చెరువుల కరకట్టలు బలహీన పడ్డాయి. ఉధృతంగా ప్రవహించిన వరదలకు డ్రెయిన్లు కూడా దెబ్బతిన్నాయి. కాలువలు పూడికతో నిండి పోయాయి. తాత్కాలిక మరమ్మత్తులకు రూ.65కోట్లు, శాశ్వత మరమ్మతులకు సుమారు రూ.300 కోట్లు అవసరమని అధికారులు అంచనాలు తయారు చేశారు.



● బాధితులకు నిత్యావసరాల పంపిణీ

సహాయ కేంద్రాల్లో తలదాచుకున్న వారికి అధికారులు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నారు. బుధ, గురువారాల్లో రెండు వేల కుటుంబాలకు బియ్యం పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, ఒక కిలో వంతున బంగాళాదుంపలు, పామాయిల్, కందిపప్పు, ఉల్లిపాయలు, చక్కెర అందచేస్తున్నారు. 13,512 మత్స్యకార, 106 చేనేత కుటుంబాలకు 50 కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు.

రెవెన్యూ వివరాలు ఇలా...
● 1,365 హెక్టార్లలో పంటల నష్టం
● కాలువలో పడి ఓ మహిళ మరణం
● మృతి చెందిన మూగ జీవాలు : 631
● ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాలు : 117
● సహాయ కేంద్రాలకు తరలించిన వారు : 8,930 మంది
● పూర్తిస్థాయిలో, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు : 34
● వైద్య శిబిరాలు : 83



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

రాళ్లపాడు కాలువలకు 9న నీరు విడుదల

ఆయకట్టు రైతులు జాగ్రత్తగా వాడుకోవాలి
కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

లింగసముద్రం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో సమృద్ధిగా నీరు ఉన్నందున ఆయకట్టు పరిధిలో వరినారు మడుల కోసం నవంబరు 9వ తేదీన నీటిని విడుదల చేయనున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు చెప్పారు. శుక్రవారం సాయంత్రం కందుకూరులోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ప్రాజెక్టు అధికారులు, ఆయకట్టు ఛైర్మెన్ ఏలూరి వెంకటేశ్వర్లు, నీటి సంఘాల అధ్యక్షులు, రైతులతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న 20 అడుగుల నీరు వరి సాగుకు సరిపోదని, మరో 40 శాతం నీరు అవసరం ఉందని, ఈ నీటిని సోమశిల ప్రాజెక్టు నుంచి రప్పించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ప్రాజెక్టులో సిబ్బంది కొరతగా ఉన్నందున రైతులు సహకరించాలని, అలాగే నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈలు ఎం వెంకటేశ్వర్లు, పి శేషయ్య, ఏఈ మనోహర్, టీడీపీ నాయకులు గురునాథం, సోంపల్లి మనోహర్, నీటి సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

నేడు జనజాతీయ గౌరవ్ దివస్ - వివరాలు 8లో..

మాలకొండ హుండీల ఆదాయం రూ.1.06 కోట్లు



వింజమూరు ఎమ్పీడీవో కార్యాలయం ఎదుట పోలీసులు

వింజమూరు ఎంపీపీపై అవిశ్వాసం
● అనుకూలంగా 8 మంది ఓటు
● సభ్యులను ప్రలోభ పెట్టారంటూ ఆరోపణలు
● ఉద్రిక్తతల నేపథ్యంలో భారీ బందోబస్తు 8

బెల్టు తీస్తున్నారు!
సీఎం ఆదేశాలతో ఎక్సైజ్ వరుస దాడులు 8



యథావిధిగా 'ఎన్టీఆర్ వైద్య సేవ'లు
రూ.200 కోట్లకుపైగా బకాయిలు
చెల్లింపుపై ప్రభుత్వంతో ఆసుపత్రుల సంఘం చర్చలు సఫలం 8

మరో కేసులో లేడీడాన్‌కు రిమాండ్

నెల్లూరు(క్రైం), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తామని నగదు వసూలు చేసిన కేసులో లేడీడాన్ నిడిగుంట అరుణకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి తమ వద్ద నగదు వసూలు చేసిందని బాధితుల ఫిర్యాదు మేరకు సూర్యారావుపేట పోలీసుస్టేషన్‌లో అరుణపై కేసు నమోదు అయ్యింది. ఈ కేసులో నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారంలో ఉన్న అరుణను విజయవాడ పోలీసులు శుక్రవారం పీటీ వారెంట్‌పై అదుపులోకి తీసుకొని న్యాయస్థానంలో హాజరు పరిచారు. న్యాయస్థానం అరుణకు 14 రోజుల రిమాండ్ విధించడంతో నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు.

నేడు పింఛన్ల పంపిణీ
3,04,749 మందికి రూ.133.12 కోట్లు
- వివరాలు 8లో..



వేదగిరి క్షేత్రంలో పవిత్రోత్సవాలు ప్రారంభం 8

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	137
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 575



వాలీబాల్ పోటీల్లో పెద్దపట్టపుపాలెం విద్యార్థిని ప్రతిభ

ఉలవపాడు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో పెద్దపట్టపుపాలెం జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న తూపిలి ప్రవల్లిక ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్‌కే సలీంబాష, పీడీ బాలయ్యలు తెలిపారు. గత నెల 30వ తేదీన ప్రకాశం జిల్లా ఒంగోలులోని డీఆర్ఆర్ఎం హైస్కూల్ క్రీడా మైదానంలో ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనపరిచింది. దీంతో ఉపాధ్యాయులు కే హరిప్రసాదు, ఎస్ భాస్కరరావు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

తుఫాన్ బాధితులకు చేయూత

దగదర్తి (బిట్రగుంట) అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలంలో ఇటీవల తుఫాన్ దాటికి పునరావాస కేంద్రాలకు తరలించిన బాధితులకు తహసీల్దారు కృష్ణ శుక్రవారం ప్రభుత్వం తరఫున నిత్యావసర సరుకులు అందజేశారు. చేనేత కార్మికులకు 50 కేజీల బియ్యం, కిలో కంది పప్పు, లీటరు పామాయల్, కేజీ చక్కెర, కిలో బంగాళదుంపలు, కిలో ఉల్లిపాయలు పంపిణీ చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర వర్గాలకు 25 కేజీల బియ్యం, ఐదురకాల సరుకులు అందించామన్నారు. అనంతారంలో 30 ఎస్టీ కుటుంబాలు, ధర్మవరంలో 27 ఎస్టీ కుటుంబాలు, చెన్నూరులో 46 చేనేత కార్మికుల కుటుంబాలు, పెద్దపుత్తేడులో 20 ఎస్టీలు, 17 చేనేత కార్మిక కుటుంబాలు, దగదర్తిలో బీసీ, ఎస్టీ 15 కుటుంబాలకు ప్రభుత్వ సహాయాన్ని అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రియాంక, సీనియర్ అసిస్టెంట్లు, ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

టీఆర్ఆర్‌లో మియావాకి వనం ఏర్పాటుకు సన్నాహాలు

కందుకూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మియావాకి వనం ఏర్పాటు కార్యక్రమం చురుకుగా జరుగుతోందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం రవికుమార్ తెలిపారు. ప్రభుత్వ అనుమతితో స్కంధపురి సేవాసమితి కళాశాల ఆవరణలో 1.5 ఎకరాల విస్తీర్ణంలో ఒక అడవి తరహాలో దట్టంగా మొక్కలు నాటి పెంచటం జరుగుతుందన్నారు. 50 రకాల మొక్కలను ఒక్కో రకానికి పది మొక్కలు చొప్పున ఒకటిన్నర ఎకరంలో 500 మొక్కలు నాటి వాటిని సంరక్షించి పెంచటం ద్వారా దట్టమైన అడవిని రూపొందించటం ఈ మియావాకి ప్రక్రియ ఉద్దేశమని ఆయన వివరించారు. శుక్రవారం స్కంధపురి సేవాసమితి కన్వీనర్ పువ్వాడి మౌనిక సమక్షంలో సర్వేచేసి ఆ భూమికి మార్కింగ్ ఇవ్వటం జరిగిందని, ఈ నెలాఖరుకల్లా పూర్తిచేస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎన్ తిరుపతిస్వామి, బాలునాయక్, పి రాజగోపాల్, జి బ్రహ్మయ్య, ఎన్వీ శ్రీహరి, రత్నకరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయం 7 గంటల నుంచే పింఛన్లు పంపిణీ చేయాలి

లింగసముద్రం, అక్టోబరు 31 (అక్టోబరు): మండలంలోని లబ్ధిదారులకు శనివారం ఉదయం 7 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని ఎంపీడీ కె శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. మండలంలో 5227 మంది పింఛను లబ్ధిదారులున్నారని, సాయంత్రం లోపు సుమారు 90 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లను అందజేయాలన్నారు.

చర్చి నిర్మాణానికి ఆర్థిక సాయం

కొండాపురం, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంట పంచాయతీ ఆదిమూర్తిపురం ఎస్సీకాలనీలో నూతనంగా నిర్మిస్తున్న చర్చికి గ్రామ సాగునీటి సంఘ అధ్యక్షుడు జాగర్లమూడి శ్రీనివాసులు శుక్రవారం రూ.15 వేలు అందజేశారు. గ్రామంలో ఎవరికి సమస్య ఉన్నా తన వంతు సాయం అందజేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మంచాల ఏడుకొండలు, టీడీపీ నాయకుడు ఐతా వెంకటేశ్వర్లు, కాలనీవాసులు ఒంగోలు శేషగిరి, కే మోషు తదితరులు పాల్గొన్నారు.

విభిన్న సంస్కృతుల ఐక్యతే భారత్ బలం

కావలి (టౌన్) అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విభిన్న సంస్కృతుల ఐక్యతే భారతదేశం బలమని ఏకేవీకే డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ చెంచురామయ్య పేర్కొన్నారు. పట్టణంలోని విట్స్ కళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతిజ్ఞ చేసిన అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక డైరెక్టర్ ప్రత్యూషా రెడ్డి, డాక్టర్ లిఖిత్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధుకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బోగోలులో వైద్య శిబిరం

బిట్రగుంట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బోగోలు బాల కళ్యాణి కళ్యాణ మండపంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సాహిత్య అనూష, అంబేడ్కర్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

వలేటివారిపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లెలో శుక్రవారం మండల వైసీపీ కన్వీనర్ అనుమోల లక్ష్మీనరసింహం అధ్యక్షతన మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఇందులో కందుకూరు వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ పాల్గొని మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రయవేటీకరణ చేయడం వలన జరిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కట్టా హనుమంతరావు, పొట్టేళ్ల క్రిష్ణయ్య, చింతలపూడి రవీంద్ర, చౌడబోయిన యానాది, ఇరపని అంజయ్య, దేగా వెంకటేశ్వర్లు కామేశ్వరి పాల్గొన్నారు.

మాలధారులకు అన్న సంతర్పణ

కలిగిరి, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): మండలంలో భవానీ, శివయ్య, బాలాజి, అయ్యప్ప మాలలు ధరించిన స్వాములకు 21 రోజులపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శివస్వామి భక్తుడు దాసరి నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం పూజా కార్యక్రమాలు భజనలతోపాటు స్వాములకు అన్నసంతర్పణ చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



బంగారు కుటుంబాలకు తోపుడు బండ్ల వితరణ

కావలి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4 పథకంలో భాగంగా ఎంపిక చేసిన బంగారు కుటుంబాలకు కావలి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ సౌజన్యంతో కావలి పట్టణం, బోగోలు మండలానికి చెందిన 8 కుటుంబాలకు ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చేతుల మీదుగా తోపుడు బండ్లు అందజేశారు. కావలి టీడీపీ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు లేని రాష్ట్రమే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. తోపుడు బండ్లు అందజేసి, వారి జీవనోపాధికి అవకాశం కల్పించిన ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులు, ఎస్ఐలు ప్రసన్న కుమార్, బాషావలి, వారి బృందాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బందిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన దాతలు ముందుకు వచ్చి పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. దత్తత తీసుకున్న పీ-4 కుటుంబాలకు ఎలాంటి అవసరాలున్నా తాము అండగా ఉంటామని ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి ఏఎంసీ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, పీ-4 లీడర్ సత్యానంద్, బృంద సభ్యులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులు

● వాహనదారుల అవస్థలు

లింగసముద్రం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు రహదారులు దెబ్బతిన్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వలేటివారిపాలెం నుండి లింగసముద్రం మీదుగా రాళ్లపాడు ప్రాజెక్టు వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు, వీఆర్ కోట నుండి తాతా హోటల్ వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు, మొగిలిచెర్ల ఎస్సీ కాలనీ నుండి దత్తాత్రేయసామి గుడికి వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు, అలాగే చెరువు సమీపంలో నుండి వీఆర్ కోట వరకు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో ఈ రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



లింగసముద్రం కోత మిల్లు ఎదురుగా దెబ్బతిన్న రహదారి



ఆ రోడ్డులో.. నిత్యం 'ట్రాఫి'కర్!

కావలి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక కో ఆపరేటివ్ కాలనీ ప్రధాన రోడ్డులో నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతూ ఉంటుంది. ఈ రహదారికి అనుబంధంగా ఉన్న క్రిస్టియన్‌పేట రోడ్డులో అనేక ఆసుపత్రులు ఉన్నాయి. కో ఆపరేటివ్ కాలనీలో డిగ్రీ కళాశాలలు, వ్యాపార దుకాణాలున్నాయి. దీంతో ఈ రహదారి నిత్యం ప్రజలు, విద్యార్థులతో పాటు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. రోడ్డు ప్రారంభంలో వరుసగా టాక్సీలను పెడుతున్నారు. దుకాణదారులు తమ ద్విచక్ర వాహనాలతో పాటు, కార్లు తదితర వాహనాలను కూడా రోడ్డు పక్కన పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే ముందుకు వెళ్లలేని పరిస్థితి. ప్రతీరోజూ ట్రాఫిక్ స్తంభించిపోతుండడంతో ప్రజలు, వాహనవారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రొయ్యలమేత లారీలు లోడింగ్, అన్‌లోడింగ్‌కు వచ్చినపుడు ఆ రోడ్డు వద్ద మలుపు తిరగాలంటే ఎంతో సమయం తీసుకుంటోంది. ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే అంబులెన్స్‌లు సైతం ఇక్కడ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి రోగులు ఇబ్బందిపడుతున్నారు. నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఈ మార్గంవైపు ట్రాఫిక్ పోలీసులు కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదు. కావలిలో ట్రాఫిక్‌ను పోలీసులు పూర్తిగా గాలికి వదిలేశారని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

ఉలవపాడు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి తోడ్పడాలని కందుకూరు శాసన సభ్యుడు ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వాయల మస్తానమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు శాఖల అధికారుల పనితీరు, పనులపై సమీక్ష జరిపారు. గ్రామీణ నీటి సరఫరా అధికారుల పనితీరుని తప్పుపట్టారు. ఆయా గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులకు పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పంచాయతీల్లోని నిధులను దుర్వినియోగం చేస్తున్నారని, ఈవోపీఆర్డీ, ఎంపీడీవోలు పర్యవేక్షించాలని సూచించారు. అదేవిధంగా గ్రామీణ ఉపాధి అధికారులు గోకుల షెడ్లు, ఉద్యానవన మొక్కల పెంపకం బిల్లుల కోసం కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, పనితీరు మార్చుకోవాలన్నారు. పక్కాగృహాల మంజూరు విషయంలో తుఫాన్ బాధిత ప్రాంతాల ప్రజలు ఇళ్లు కట్టుకుంటామని ముందుకు వస్తే తొలుత వారికి పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చి పక్కాగృహాలు మంజూరు అయ్యేలా చూడాలని తహసీల్దార్ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈలకు సూచించారు. పారిశుధ్యం విషయంలో పంచాయతీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించ వద్దని, ముఖ్యంగా ఉలవపాడులో పారిశుధ్యంపై దృష్టిసారించాలని కార్యదర్శికి సూచించారు. ఇదే విషయమై మండలంలోని పంచాయతీల కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. అధికారులు పనితీరు మెరుగుపరుచుకోవాలని, సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో బీ సురేష్, మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఉలవపాడు మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

కందుకూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథిగృహంలో శుక్రవారం ఆయన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యసేవలు అందించాలని, సీజనల్ వ్యాధులకు అవసరమైన అన్నిరకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని నిర్దేశించారు. ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటిని సందర్శించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజారోగ్యమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి రూ. 25 లక్షల వరకు ఉచిత ఆరోగ్యబీమా అందించే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. ప్రభుత్వ లక్ష్యసాధనకు సిబ్బంది కృషి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ పి రమేష్, సీహెచ్ఓ జి శ్రీనివాసరావు, నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు, వైద్యసిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

● ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపు సందర్భంగా కందుకూరు సబ్ డివిజన్ పోలీసుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానం అని, పోలీసు శాఖ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సేవా కార్యక్రమాలలోనూ ముందుండటం అభినందనీయమన్నారు. డీఎస్పీ సీహెచ్‌వీ బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు విద్యార్థినీ, విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయటం ద్వారా తమ ప్రయత్నాన్ని విజయవంతం చేశారని అభినందించారు. కార్యక్రమంలో సీఐ అన్వర్‌బాషాతో పాటు పలువురు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. శుక్రవారం సాయంత్రం పోలీసు అమరవీరుల సంస్మరణార్థం పట్టణ పోలీసు స్టేషన్ వద్ద నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు.

సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలి : ఎంపీడీవో

వలేటివారిపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీవో శంకర్‌రావు తెలిపారు. మండలంలోని బడేవారిపాలెం, నేకునాపురం గ్రామ సచివాలయాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగుల మూమెంట్ రిజిస్టరు, హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. సకాలంలో హాజరుకాని ఉద్యోగులకు మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమయపాలన పాటించాలని సూచించారు.

చట్టాలపై అవగాహన అవసరం



పెదపవని గ్రామస్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కోటేశ్వరరావు

లింగసముద్రం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజలు చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ కె కోటేశ్వరరావు సూచించారు. శుక్రవారం మండలంలోని పెదపవని గ్రామంలో పౌర హక్కులపై సమావేశం నిర్వహించారు. ప్రజలు ఈ సందర్భంగా ఆయన పౌరహక్కుల చట్టం గురించి ప్రజలకు వివరించారు. ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎం రమణయ్య, ఎస్సీ బాలుర వసతి గృహ సంక్షేమ సంక్షేమ అధికారి సీహెచ్ శ్రీనివాసులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి

కందుకూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సాయంత్రం విద్యార్థినీ, విద్యార్థులు ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నాగూర్‌వలీ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కంచె లేని ఆనకట్ట

● పొంచి ఉన్న ప్రమాదం

ఉదయగిరి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు ఉదయగిరి ఆనకట్ట అలుగు పారుతుండడంతో రాకపోకలు స్తంభించాయి. దీంతో వాహనదారులు, ప్రజలు ఆనకట్టపై రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఆనకట్ట చుట్టూ ఏలాంటి రక్షణ కంచె లేకపోవడం, పలుచోట్ల కట్ట దెబ్బతిని, బురదమయంగా ఉండడంతో ఆదమరిస్తే వాహనాలు ఆనకట్ట నీటిలో పడే ప్రమాదం ఉంది. దీనికితోడు కట్టకు సమీపంలో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు సైతం ఉన్నాయి. ప్రమాదాలు జరగకుండా ఇప్పటికైనా అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.





ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల కల్చరల్ ఫెస్ట్‌లో సందడి చేసిన తెలుగు ఇండియన్ ఐడల్ ఫైనలిస్టులు

'ప్రకాశం' కల్చరల్ ఫెస్ట్‌లో

ఇండియన్ ఐడల్ ఫైనలిస్టుల సందడి

కందుకూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో కల్చరల్ ఫెస్ట్ శుక్రవారం సందడిగా జరిగింది. ఈ ఫెస్ట్‌లో ఆహా ఓటీటీ వేదికపై సంచలనం సృష్టించిన తెలుగు ఇండియన్ ఫైనలిస్టులు ధీరజ్, పవన్‌కల్యాణ్, బృంద, శ్రీష్టి ముఖ్య అతిథులుగా పాల్గొని తమ గానంతో సందడి చేశారు. ఈ సందర్భంగా కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల విజయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థినీ, విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపి చదువుపై మరింత దృష్టిపెట్టేందుకు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ హరిబాబు, అకడమిక్ ఇన్‌చార్జి మీరావలి, కల్చరల్ క్లబ్ ఇన్‌చార్జి డాక్టరు పావని, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

తొలగిన లోఓల్టేజ్ సమస్య



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న మాలేపాటి నాగేశ్వరరావు

బిట్రగుంట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అరవపాలెం గ్రామంలో ఓల్టేజ్ సమస్య తొలగిందని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ చిలకపాటి వెంకటేశ్వర్లు అన్నారు. బోగోలు పంచాయతీ అరవపాలెంలో అదనపు లోడ్ కలిగిన 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నేత భోగిరి ప్రభాకర్ మాట్లాడుతూ లో ఓల్టేజ్ సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతుండేవారన్నారు. సమస్యను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకుపోగా విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడారన్నారు. మండల విద్యుత్ అధికారి జడరాయ వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారన్నారు.

వర్షాలతో అధ్వానంగా పీఎస్ రోడ్డు

కలువాయి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు పొదలకూరు- సోమశిల మెయిన్ రోడ్డు అధ్వానంగా తయారైంది. కలువాయి పట్టణంలో రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. రోడ్డుపై ఉన్న గుంతలను కనీసం మట్టితోనైనా నింపి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



పౌర హక్కులపై అవగాహన అవసరం

అల్లూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మానవ హక్కులపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జి తహసీల్దారు ప్రవీణ్ కుమార్ అన్నారు. అల్లూరు మండలం బట్రకాగొల్లు గ్రామంలో శుక్రవారం పౌర హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పౌరుడికి రాజ్యాంగంలో స్వేచ్ఛగా బతికేందుకు హక్కు ఉందని, ఆ హక్కుకు భంగం కలిగించడం చట్టరీత్యా నేరమన్నారు. హక్కులపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రవీంద్రనాథ్, సునీత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

కావలి, అక్టోబరు31ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల కోసం కృషి చేస్తున్న ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం కావలి పట్టణంలో ఘనంగా జరిగింది. సీపీఐ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ జెండాలను సీపీఐ నాయకులు ఆవిష్కరించారు. 1920లో ఆవిర్భవించిన నాటి నుంచి ఏఐటీయూసీ 44 రకాల కార్మిక చట్టాలకు రూపశిల్పిగా చరిత్రలో నిలిచిపోయిందన్నారు. నాలుగు లేబర్ కోడ్ బిల్లులను రద్దు చేసి, 44 రకాల కార్మిక చట్టాలను పునరుద్ధరించాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండ్లూరి ఆదినారాయణ. మల్లె అంకయ్య, టీ. వెంకటేష్, కే. నాగరాజు, ఎం. వెంకటేశ్వర్లు, దమ్ము దర్గాబాబు, కే. కొండయ్య, పీ. బోస్, రవి, ప్రభావతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

అవినీతి వ్యతిరేక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : ఏపీజీబీ మేనేజర్

కావలి రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అవినీతి వ్యతిరేక చట్టాలపై ప్రజలు అవగాహన కలిగిఉండాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కేవీ సుబ్బారెడ్డి సూచించారు. కావలి మండలం తుమ్మలపెంట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం అవినీతి వ్యతిరేక చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లోక్ అదాలత్ సభ్యులు మాలకొం డారెడ్డి మాట్లాడుతూ సామాజిక పురోగతికి అవినీతి ప్రధాన అవరోధమన్నారు. అవినీతి నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. లంచం ఇవ్వటం, తీసుకోవటం రెండూ నేరమేనన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారిణి శ్రావణి, మహేంద్ర పాల్గొన్నారు.



అవినీతి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేస్తున్న బ్యాంక్ అధికారులు, తదితరులు

రేపు కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సబ్‌జూనియర్ బాల బాలికల జిల్లా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పీ.హరీష్, గంటా సతీష్ ఓ ప్రకటనలో తెలిపారు. బాలుర విభాగంలో 60 కేజీ, బాలికల విభాగంలో 55 కేజీ కేటగిరిలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.



నేత్రపర్వం ఆదిదంపతుల ప్రాకారోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలస్థానేశ్వరాలయంలో కార్తీక మాసం దీపోత్సవాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష అర్చనలు జరిగాయి. అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ, పూజలు జరిగాయి. సాయంత్రం భక్తులు పెద్ద ఎత్తున కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం ప్రాకారోత్సవం కనుల పండువగా జరిగింది. ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

వేదగిరి క్షేత్రంలో పవిత్రోత్సవాలు ప్రారంభం

నెల్లూరు రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం పవిత్రోత్సవాలు మొదలయ్యాయి. తొలిరోజు పుణ్యాహవాచనం, కంకణ ధారణ, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ, కుంభ ఆవాహన, ఆరాధన, నివేదన, అధివాసాలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు విశేష పూజలు చేశారు. ఆలయ చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి దంపతులు, ఈవో గోపి, ఉభయకర్తలు పాల్గొన్నారు. శనివారం గిరిప్రదక్షణ, పల్లకీసేవ జరగనున్నాయి.



మాలకొండ హుండీల ఆదాయం రూ.1.06 కోట్లు

వలేటివారిపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామికి 37 హుండీల ద్వారా 12 శనివారాలకు రూ.1,06,20,700 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్. చంద్రశేఖర్ తెలిపారు. మాలకొండ కల్యాణమండపంలో శుక్రవారం హుండీల లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఈ లెక్కింపులో నగదుతోపాటు 120.90 గ్రాముల బంగారం, 872.48 గ్రాముల వెండి, 8 యూఎస్ డాలర్లు, 125 పౌండ్స్, 286 రియాస్, 110 దిర్హామ్స్ రూపంలో లభించింది. ఈ హుండీల



లెక్కింపులో ఆలయ సిబ్బంది, భక్తులు, సేవాదళం సిబ్బంది, నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు.

యథావిధిగా 'ఎన్టీఆర్ వైద్య సేవ'లు

- జిల్లాలో రూ.200 కోట్లకుపైగా బకాయిలు
- చెల్లింపుపై ప్రభుత్వంతో ఆసుపత్రుల సంఘం చర్చలు సఫలం
- 20 రోజుల సమ్మె తర్వాత పునరుద్ధరణ



నెల్లూరులోని ఓ నెట్‌వర్క్ ఆసుపత్రిలో రోగులు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద అందించే వైద్య సేవలు ప్రైవేటు ఆసుపత్రుల్లో శుక్రవారం నుంచి యథావిధిగా కొనసాగాయి. నెట్‌వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం బకాయిలు చెల్లించాల్సి ఉండటంతో ఆయా ఆసుపత్రులు వైద్య సేవలను నిలిపివేసి సమ్మెకు దిగిన విషయం తెలిసినదే. ఈ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వంతో ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్(ఆషా) ప్రతినిధులు పలు దఫాలు చర్చలు జరిపినా ఫలితం లేకపోవటంతో నెట్‌వర్క్ ఆసుపత్రుల సమ్మె కొనసాగింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని 32 నెట్‌వర్క్ ఆసుపత్రులకుగాను 13 ఆసుపత్రులలో వైద్య సేవలు నిలిపి వేశారు. అక్టోబరు 10వ తేదీ నుంచి ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద పూర్తిస్థాయిలో వైద్య చికిత్సలు ఆపివేసి సమ్మెలోకి వెళ్లారు. ప్రభుత్వ ఆసుపత్రులతో కలిపి జిల్లాలోని 124 నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ. 200 కోట్లకుపైగా బకాయిలున్నాయి. ఒక్క నారాయణ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికే రూ.88 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే తాజాగా ప్రభుత్వంతో చర్చలు ఫలించడం, బకాయిల్లో రూ. 250 కోట్లు నవంబరులో చెల్లిస్తామని, మరో రూ. 3వేల కోట్లు బ్యాంకు అప్పుద్వారా వన్‌టైం సెటిల్‌మెంట్ చేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో ఆసుపత్రులు సమ్మె విరమించాయి. దీంతో శుక్రవారం నుంచి జిల్లాలోని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో సేవలు కొనసాగాయి.

బెల్టు తీస్తున్నారు!

- సీఎం ఆదేశాలతో ఎక్సైజ్ వరుస దాడులు
- అదుపులో అక్రమ మద్యం విక్రయదారులు
- మావాళ్లే వదిలేయాలని నేతల ఫోన్లు
- తలలు పట్టుకుంటున్న అధికారులు

నెల్లూరు(క్రైం) అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్యం బెల్ట్‌షాపులు కనిపించకూడదంటూ ఇటీవల సీఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎక్సైజ్ శాఖ అధికారులు జిల్లావ్యాప్తంగా ఉన్న బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపుతున్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు కావడంతో బెల్ట్ షాపులను కుటీర పరిశ్రమగా మార్చారు. వైసీపీ ప్రభుత్వంలో బెల్ట్ అన్నీ వర్గాలవారికి అలవాటుగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసింది. నూతన మద్యం పాలసీని అందుబాటులోకి తెచ్చింది. దీంతో ప్రైవేటు వైన్‌షాపులు ఏర్పడ్డాయి. అయితే గత ప్రభుత్వంతో పోటీ పడుతూ ఈ ప్రభుత్వంలోనూ బెల్ట్ షాపుల సంఖ్య పెరిగింది. దీంతో సీఎం చంద్రబాబు రంగంలోకి దిగి బెల్ట్ షాపులను పూర్తిగా నియంత్రించాలని ఆదేశించారు. దీంతో ఎక్సైజ్ అధికారులు జిల్లాలో బెల్ట్ షాపులపై ప్రత్యేక దృష్టి సారించారు.

● మనవాళ్లే వదిలేయండి...

ఈనెలలో వరుస దాడులు జరుపుతూ ఎక్సైజ్ అధికారులు బెల్ట్‌షాపులపై ఉక్కుపాదం మోపారు. అయితే ప్రస్తుతం నడుస్తున్న బెల్ట్‌షాపుల్లో అధికంగా వైన్ షాపులవారే సబ్ లీజ్‌కు మద్యం విక్రయిస్తున్నారని సమాచారం. వీటిపై చర్యలు తీసుకునేందుకు ఎక్సైజ్ అధికారులు అడుగులు వేస్తుంటే... అధికార పార్టీ నాయకులు ఫోన్లు చేసి, అవి మనవారివే వదిలేయండి.. అని చెబుతున్నారు. దీంతో చేసేది లేక అధికారులు వెనుకడుగేస్తున్నారు. ఓ పక్క సీఎం చంద్రబాబే బెల్ట్‌పై ఉక్కుపాదం మోపాలని ఆదేశాలు ఇస్తుంటే, మరో పక్క అధికారపార్టీ నాయకులు వదిలేయమని చెబుతుండడంతో అధికారులు ఏంచేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.



ఎక్సైజ్ అధికారులు గత ఏడాది అక్టోబరు 1 నుంచి ఈ ఏడాది సెప్టెంబరు 30 వరకు జరిపిన దాడుల వివరాలు

స్టేషన్	కేసులు	నిందితులు	ఐఎంఎల్ (లీటర్లు)	బీర్ (లీటర్లు)	సీజ్ చేసిన వాహనాలు
నెల్లూరు-1	76	76	166.14	--------	----
నెల్లూరు-2	82	90	198.72	------	2
కావలి	120	121	273.27	-------	----
కోవూరు	93	93	176.76	---------	1
బుచ్చి	67	67	111.8	---------	----
ఉదయగిరి	118	118	258.3	---------	3
కలిగిరి	102	102	236.16	---------	----
ఇందుకూరుపేట	77	77	184.92	---------	----
ఆత్మకూరు	95	96	250.11	---------	1
పొదలకూరు	97	97	180.36	6.5	----
కందుకూరు	71	71	136.03	---------	----
మొత్తం	998	1008	2172.51	6.5	7

నేడు సామాజిక పింఛన్ల పంపిణీ

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పథకం కింద ప్రతీ నెల అందించే సామాజిక పింఛన్లను శనివారం పంపిణీ చేస్తామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వీ నాగరాజకుమారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 3,04,749 మంది పింఛనర్లు ఉన్నారని తెలిపారు. వారికి రూ.133.12 కోట్లను పింఛనుగా అందచేస్తామని వివరించారు. 13,510 క్లస్టర్లలో 6445 మంది సిబ్బంది ఈ పింఛన్లను ఇంటివద్దకు వెళ్లి పంపిణీ చేస్తారని తెలిపారు. ఇందుకు సంబంధించి అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చేవూరు

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): భారత దేశానికి దశాబ్దన్నర కాలం ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ అందించిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఇందిరాగాంధీ 41వ వర్ధంతి సందర్భంగా నగరంలోని ఇందిరాభవన్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేవూరు మాట్లాడుతూ ఇందిరాగాంధీ గరీబీ హఠావో నినాదంతో నిరుపేదల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారన్నారు. దేశంలో మొదటిసారిగా 14 బ్యాంకులను విలీనం చేసిన ఘనత ఆమెదేనన్నారు. 1970లో రాజభరణాలను రద్దు చేశారన్నారు. 20 సూత్రాల పథకాన్ని ప్రవేశ పెట్టారని, 1974లో మొదటి సారిగా పోఖ్రాన్ అణు పరీక్షలు నిర్వహించారని తెలిపారు. 1972లో చారిత్రాత్మక సిమ్లా ఒప్పందాన్ని అప్పటి పాకిస్తాన్ ప్రధాని జుల్ఫీకర్ బుట్టోతో కుదుర్చుకున్నారన్నారు. 1971లో రష్యాతో 20 ఏళ్లపాటు శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకున్నారని చెప్పారు. అత్యున్నత పురష్కారం భారతరత్న దక్కిన తొలి మహిళగా ఎంతో పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఇందరమ్మ పేరు భారత దేశ చరిత్ర ఉన్నంత వరకు గుర్తింటుందన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏటూరి శ్రీనివాసులరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, నాయకులు మోహన్‌రెడ్డి, పప్పర్తి గణేష్‌బాబు, అల్లాఉద్దీన్, ఫజలుద్దీన్, నాగిరెడ్డి రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.



ఇందిరా గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు

వింజమూరు ఎంపీపీపై అవిశ్వాసం

వింజమూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఎంపీపీ ఇనగలూరు మోహన్‌రెడ్డిపై ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గిందని కావలి ఆర్డీవో వంశీకృష్ణ తెలిపారు. శుక్రవారం ఎమ్పీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశానికి 12 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా 11 మంది హాజరై 8 మంది సభ్యులు అవిశ్వాసానికి మొగ్గు చూపారు. ముందుగా సమావేశ హాల్‌లోకి వచ్చిన ఎంపీటీసీలతో ఎంపీపీ ఇనగనూరి మోహన్ రెడ్డి తాను ఎన్నికలకు పెట్టిన ఖర్చు మొత్తం ఇచ్చి ఎవరికైనా ఓటు వేసుకోవచ్చని సభ్యులకు సూచించారు. దీంతో కొంతసేపు గందరగోళం పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్డీవోతోపాటు పోలీసులు జోక్యం చే సుకుని అందరినీ బయటకు పంపేసి అవిశ్వాస తీర్మాన ప్రక్రియను కొనసాగించారు. అ విశ్వాసానికి అనుకూలంగా 8 ఓట్లు వచ్చాయని ఆర్డీవో తెలిపారు. ఎంపీటీసీ పల్లాల కొం డారెడ్డి సమావేశ మందిరం నుంచి బయటకు వచ్చి ఎంపీటీసీ సభ్యులను ప్రలోభ పెట్టి వారి ఆర్థిక అవసరాలను అలుసుగా తీసుకుని కొంతమంది ఇటువంటి అనైతిక చర్యలకు పాల్పడుతున్నారని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్పీ డీవో శ్రీనివాసరెడ్డి ఇతర అధికారులు పాల్గొనగా, 8 మండలాల పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



అవిశ్వాసానికి అనుకూలంగా ఉన్న ఎనిమిది మంది ఎమ్పీటీసీ సభ్యులు

నేడు జనజాతీయ గౌరవ్ దివస్

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జనజాతీయ గౌరవ్ దివస్ కార్యక్రమాన్ని నగరంలోని గిరిజన్ భవన్‌లో శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బీ.మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి, పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ, దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ గౌరవ్ దివాస్ కార్యక్రమం శనివారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వ గిరిజన మంత్రిత్వశాఖ, ట్రైబల్ కల్చర్ అండ్ ట్రైనింగ్ మిషన్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కేజీబీవీల్లో గెస్ట్ ఫ్యాకల్టీలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని టైప్-3 కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పీజీటీ, సీఆర్‌టీ పోస్టులకు తాత్కాలిక గెస్ట్ ఫ్యాకల్టీలుగా పని చేసుందుకు ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. లింగసముద్రంలో పీజీటీ ఫిజిక్స్, బోటనీ, కలిగిరిలో పీజీటీ ఎంపీహెచ్‌డబ్ల్యు, కలిగిరిలో సీఆర్‌టీ మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, సీతారామపురంలో తెలుగు, వలేటివారిపాలెంలో హిందీ, కందుకూరులో కెమిస్ట్రీ, సీఆర్‌టీ ఫిజిక్స్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే జనరల్ కేటగిరి అభ్యర్థి వయస్సు 48 ఏళ్ల లోపు ఉండాలని, ఎస్‌సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యుఎస్ అభ్యర్థులకు 47 ఏళ్ల లోపు, విభిన్న ప్రతిభావంతులు 52 ఏళ్ల లోపు, ఎక్స్ సర్వీస్ ఉమెన్ 45 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు సంబంధిత ఎంఈవో కార్యాలయాల నుంచి దరఖాస్తులు తీసుకుని అక్కడే పూర్తి చేసి, అర్హత ధ్రువీకరణ జెరాక్స్ కాపీలతో ఈనెల 4వ తేదీ లోపు అందచేయాలని పేర్కొన్నారు.

అనుమతులు లేకుండా అంతస్తుల నిర్మాణం ఎలా!?

నెల్లూరు(సిటీ), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా అదనపు అంతస్తులు ఎలా నిర్మిస్తున్నారు? ప్లాన్‌కు విరుద్ధంగా కమర్షియల్ వినియోగం ఎలా? పన్ను విధింపులో తప్పిదాలెందుకు వచ్చాయి? అంటూ నూటి ప్రశ్నలు వేసిన కమిషనర్ నందన్ పలువురు అధికారులు, సచివాలయ ఉద్యోగులకు శుక్రవారం షోకాజు నోటీసులు ఇచ్చారు. కార్పొరేషన్ వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు.. సుబేదార్‌పేట సచివాలయ పరిధిలో ప్రాపర్టీ అనుమతి లేకుండా అదనపు అంతస్తులు నిర్మించడం, ప్లాన్‌కు విరుద్ధంగా కమర్షియల్ వినియోగంపై ఏసీపీ రఘునందన్, టీపీబీవో వినయ్‌కుమార్, అడ్మిన్లు జయచంద్ర, ధనంజయ్‌లకు షోకాజు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు వివరణ ఇవ్వాలని ఆయన తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగ సుబేదార్ పేటలోని కమర్షియల్ భవనానికి రెసిడెన్షియల్ అనుమతులు ఉన్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలినట్లు ఉత్తర్వుల్లో చెప్పిన కమిషనర్ ఆ మేరకు జరిగిన తప్పిదంపై ఆర్ఐ లోకనాథం, శ్రావణ్‌కుమార్, అడ్మిన్లు రోహిణి, వెంకటేశ్వర్లుకు షోకాజు నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

బిట్రగుంట రైల్వే కార్యాలయాల తనిఖీ

బిట్రగుంట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వేస్టేషన్ పరిధిలోని పలు కార్యాలయాలను రైల్వే జోనల్ అధికారులు శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. సికింద్రాబాద్ నుంచి విజయవాడకు వచ్చిన జోనల్ ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ అధికారి వెంకటరమణారెడ్డి, విజయవాడ ఏడీఆర్‌ఎం కొండా శ్రీనివాసరావు కలిసి ప్రత్యేక రైల్లో గూడూరు వెళ్లారు. అక్కడి నుంచి సాయంత్రం బిట్రగుంట రైల్వే స్టేషన్‌లోని క్రూ కంట్రోల్ కార్యాలయం చేరుకుని రికార్డులను పరిశీలించారు. నూతన స్టేషన్లో వసతుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైలు ప్రమాద సమయంలో వినియోగించే ఏఆర్వీ, ఎంఆర్వీలను తనిఖీ చేశారు. డ్రైవర్లు, గార్డుల విశాంత్రి భవనాన్ని పరిశీలించారు. బోగోలు రైల్వే ఎల్సీ 144, రైలు క్రాసింగ్ పాయింట్స్‌ను సందర్శించారు. రాత్రి ప్రత్యేక రైల్లో విజయవాడకు వెళ్లినట్లు అధికారులు తెలిపారు.

డీఎస్‌డీవో యతిరాజ్‌కు ఘనంగా వీడ్కోలు

నెల్లూరు(విద్య), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీవో) ఆర్‌కే యతిరాజ్ ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అభినందన కార్యక్రమం జరిగింది. క్రీడా సంఘాలు, క్రీడా ప్రముఖులు, ప్రతినిధులు, ఉద్యోగులు కలిసి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాధికారులు, ప్రతినిధులు మాట్లాడారు. రెండు దశాబ్దాలకుపైగా కోచ్‌గా, జిల్లా అధికారిగా క్రీడారంగం ఉన్నతికి యతిరాజ్ కృషి చేశారన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆయన జీవితం ప్రశాంతంగా, ఆరోగ్యకరంగా కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం యతిరాజ్ దంపతులను ఘనంగా సత్కరించాయి. ఈ కార్యక్రమంలో చిత్తూరు డీఎస్‌డీవో ఏ బాలాజీ, పల్నాడు డీఎస్‌డీవో పీ నరసింహారెడ్డి, రిటైర్డ్ డీఎస్‌డీవో జీ వెంకటేశ్వరరావు, ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకనాథ్, ఏపీ జూడో సంఘం అధ్యక్షుడు ఆనం రామ్‌కిషోర్‌రెడ్డి, ఏపీ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే మహబూబ్‌బాషా, జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఆనం మహేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యతిరాజ్ దంపతులను సత్కరిస్తున్న క్రీడా రంగ ప్రతినిధులు

'ఆర్‌అండ్‌బీ'లో ఏపీజేఏసీ నాయకుల ఆందోళన

నెల్లూరు(హరనాథపురం) : ఆర్ అండ్‌బీలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఏపీజేఏసీ అమరావతి అసోసియేట్ అధ్యక్షుడు శరత్‌బాబు ఆధ్వర్యంలో ఉద్యోగులు కార్యాలయంలో కింద కూర్చుని ఆదోళన చేశారు. శరత్‌బాబు మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ సర్కిల్ కార్యాల యంలో లోకాయుక్త కేసుల ను ఎస్ఈ తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.

మొక్కజొన్న.. ఆదాయం మిన్న!

- 80రోజుల్లో చేతికొస్తున్న సైలేజ్ రకం
- ఎకరాకి రూ.20వేల వరకు ఆదాయం
- సాగుకు ముందే కొనుగోలు ఒప్పందం
- టన్నుకు రూ.2250 చెల్లించేలా 'ట్రూమీల్' ఒప్పందం

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మెట్ట ప్రాంత రైతులకు ఆదాయ వనరుగా మారింది సైలేజ్ మొక్కజొన్న. ఎకరా సాగుకు ఖర్చులుపోను రూ.20వేలకుపైగా మిగులుతోంది. దిగుబడులు బాగా వస్తే మరో రూ.4వేల వరకు అదనంగా వస్తోంది. తక్కువ నీటి వినియోగంతో సుమారు 80రోజుల్లోనే చేతికందే ఆరుతడి పంటగా దీనికి పేరుంది.

● ప్రత్యేకతలివి...

తక్కువ కాలంలో తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం తీసుకొస్తుంది. 4 నుంచి 5 తడుల నీరు సరిపోతుంది. కూలీల అవసరం ఉండదు. ఒక ఎకరాకు సగటున 18 నుంచి 20 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుంది. రూ.20వేల నుంచి రూ.24వేల వరకు నికర ఆదాయం లభిస్తుంది.

● యాజమాన్య పద్ధతులు

సైలేజ్ మొక్కజొన్న సాగుకు ఖరీఫ్ సీజన్‌లో మే, జూన్, జులై నెలలు ఎంతో అనుకూలం. అదేవిధంగా రబీ సీజన్‌కు వస్తే అక్టోబరు, నవంబరు, డిసెంబరు, జనవరి మొదటి వారం వరకు విత్తుకోవచ్చు. ఎకరాకి 12 కిలోల విత్తనాలు అవసరం. కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ లేదంటే కాప్టాన్‌తో విత్తన శుద్ధి చేసుకోవాలి. దీనివల్ల తొలిదశలో మొక్కలకు ఆశించే తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చు. విత్తనాలు నాటే ముందు మూడు, నాలుగుసార్లు దుక్కి దున్నాలి. ఎకరాకి దాదాపుగా 10 టన్నులు బాగామాగిన పశువుల ఎరువును ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి. బోదె కాలువలు చేసుకోవాలి. బోదెకు 1/3 వవంతు ఎత్తులో విత్తనాలు నాటుకోవాలి. నత్రజని ఎరువును విత్తే సమయంలో మూడో వంతు, 25-30 రోజుల మధ్యలో మూడో వంతు, 50-55రోజుల మధ్య మిగిలిన ఎరువు వేయాలి. విత్తే సమయంలో సగం పొటాష్, మిగిలిన సగం ఎరువు పూత దశలో వేసుకోవాలి. జింకు లోపం కనిపిస్తే లీటరు నీటికి 2 గ్రాముల చొప్పున జింకు సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలి.



● కలుపు నివారణ

పంట విత్తిన తరువాత రెండు, మూడు రోజుల్లోపు అట్రాజిన్ కలుపు మందు 1200 గ్రాములు, 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. విత్తిన నెల రోజులకు వెడల్పాటి కలుపు మొక్కలు గమనిస్తే ఎకరాకి 2,4 డి సోడియం సాల్టు 500గ్రాములు 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

● చీడపీడల యాజమాన్యం

సైలేజ్ మొక్కజొన్నలో గులాబీ రంగు కాండం తొలుచు పురుగు నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ 20యస్.సి 0.3మి.లీ లీటరు నీటితో కలిపి 12-15రోజులకు పిచికారీ చేయాలి. కత్తెర పురుగు నివారణకు పంట విత్తిన వారానికి ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు అమర్చి పురుగు ఉధృతిని గమనించాలి. గుడ్లను, మొదటి దశ పిల్ల పురుగులను నివారించేందుకు వేప సంబంధిత మందు అజాడిరాక్స్ 1500పిపియం 5.మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆకు ఎండు తెగులు, తుప్పు తెగులు నివారణకు మానూకోజెబ్ 2.5గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పొడ తెగులుకు నివారణకు ప్రొపికొనజోల్ 1మి.లీ లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలి.

గింజ నాటేప్పుడే కొనుగోలు ఒప్పందం

సైలేజ్ మొక్కజొన్న సాగుకు ట్రూమీల్ కంపెనీ రైతులతో ఒప్పందం కుదుర్చుకుని చెప్పిన ధరకే కొనుగోలు చేస్తుంది. గింజ నాటే సమయంలోనే ధరను ప్రకటించి రైతులతో ఒప్పంద పత్రం రాయించుకుంటారు. టన్నుకు రూ.2250లు చెల్లిస్తారు. ఆ సంస్థ వారే కోత మిషన్‌ను, వాహనాలను ఏర్పాటు చేసుకుంటారు. కోత అనంతరం వారం రోజులకు నగదు చెల్లింపులు చేస్తారు.

● శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ విశ్రాంత ఏడీ

ఇదే అనువైన సమయం

సైలేజ్ మొక్కజొన్న నాటేందుకు ఇదే అనువైన సమయం. సాగు చేసే ప్రతీ రైతుకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తాం. టన్నుకు రూ.2250లు చెల్లించేలా ట్రూమీల్ సంస్థ వ్యవసాయశాఖతో ఒప్పందం చేసుకుంది. మెట్ట రైతులు పొలాలను ఖాళీగా వదిలేకంటే ఈ మొక్కజొన్నను సాగు చేయడం వల్ల ఆదాయం పొందవచ్చు. ఉదయగిరి, అనంతసాగరం, మర్రిపాడు, వింజమూరు, ఆత్మకూరు, పొదలకూరు, కలువాయి, చేజర్ల ప్రాంతాల్లో కొంత మంది రైతులు సాగు చేస్తున్నారు.

- పీ సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి